

R.B.A.N.M's High School (Main)
LIBRARY

2990

ఆత్మశోధన

గాంధీమహాత్ముని స్వీయచరిత్ర

అనువాదం : కాటూరి వేంకటేశ్వరరావు

2990

2990

సత్యశోధన

గాంధీమహాత్ముని స్వీయచరిత్ర

R.B.A.N.M'S JUNIOR COL
BANGALORE-42.
SOCIATION DAY
'71 - 72

R.B.A.N.M's. Junior College Library
BAN... ORE-42

R.B.A.N.M's High School (Main)
LIBRARY

సత్యశోధన

(గాంధీమహాత్ముని స్వీయచరిత్ర)

TRANSLATION OF

GANDHIJI'S AUTOBIOGRAPHY

ABRIDGED BY

BHARATAN KUMARAPPA

Satya Sodhana.

By.

అనువాదకులు: Sri. Kaluri Venkateswara Rao.

శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు

R.B.A.N.M's High School (Main) LIBRARY

ACC. No. 7095
CLASS No. 8-94 (VE
Date 26/8/97

త్రివేణీ పబ్లిషర్సు

మచిలీపట్టణము

ద్వితీయ ముద్రణ
1968

134
2990
O35ు6
N68

మూల్యము :
రు. 2-00

త్రివేణీ ప్రెస్
మచిలీపట్టణము

విషయసూచిక

పుట

ప్రథమ భాగము : బాల్య యౌవనములు

1. జన్మాదికము 1
2. విద్యాభ్యాసము 3
3. వివాహము 11
4. దుస్సాంగత్యము 13
5. చౌర్యము 19
6. పితృవియోగము 24
7. ధర్మపరిచయము 25
8. ఇంగ్లాండు ప్రయాణమునకు సన్నాహము 29
9. ఓడలో 34

ద్వితీయ భాగము : సీమలో విద్యాభ్యాసము

10. లండనులో 40
11. ఆంగ్ల సభ్యతానుకరణము 43
12. మార్పులు 47
13. బిడియమే నా డాలు 53
14. భిన్నమత పరిచితి 54

తృతీయ భాగము : ఇండియాలో బారిస్టరుగా

15. స్వదేశాగమనము 58
16. ప్రథమాఘాతము 63

పుట

చతుర్థ భాగము : దక్షిణాఫ్రికాలో
17. దక్షిణాఫ్రికా చేరుట 69
18. ప్రిటోరియాకు 70
19. ప్రిటోరియాలో మొదటి దినము 81
20. భారతీయుల కష్టనిష్ఠురములు 84
21. అబ్దుల్లా దావా 88
22. తానొకటి తలప దైవమొకటి తలచెను 89
23. మూడు పౌనుల పన్ను 90

పంచమ భాగము : స్వదేశాగమనము
24. ఇండియాలో 93

షష్ఠ భాగము : మరల దక్షిణాఫ్రికా
25. తుపాను 96
26. పొదుపరిజీవనము 105
27. స్మరణము—ప్రాయశ్చిత్తము 107
28. బోయరు యుద్ధము 109
29. వెలగల కానుకలు 110

సప్తమ భాగము : మరల భారతభూమిలో
30. నా మొదటి కాంగ్రెస్ 114
31. బొంబాయి నగరములో 118

అష్టమ భాగము : మరల దక్షిణాఫ్రికాలో
32. మరల దక్షిణాఫ్రికా 119
33. గీతాధ్యయనము 120

	పుట
34. నన్ను మంత్రముగ్ధు నొనర్చిన గ్రంథము	122
35. ఫోనిక్సు వసతి	123
36. జూలూ తిరుగుబాటు	124
37. కస్తూరిబా ధీరత్వము	126
38. ఇంటిలో సత్యాగ్రహము	129
39. సత్యాగ్రహోదయము	131
40. కారాగృహవాసము	133
41. దండప్రహారణము	134
42. పునః సత్యాగ్రహము	139
43. సత్యాగ్రహ విజయము	143

నవమ భాగము : ఇండియాలో - ఆశ్రమస్థాపనము

44. పూనానగరములో	145
45. ఆశ్రమస్థాపనము	146

దశమ భాగము : చంపారణ్యము

46. నీలిమందు మచ్చ	149
47. కళంకము మాసిపోయినది	153

ఏకాదశ భాగము : అహమదాబాదు కూలిజనము

48. కూలిజనముతో సంబంధము	155

ద్వాదశ భాగము : ఖేడాసత్యాగ్రహము

49. ఖేడాసత్యాగ్రహము	159
50. మృత్యువుచెంగట	162

పుట

త్రయోదశ భాగము :

రౌలటుశాసనము, రాజకీయములలో ప్రవేశము

51. రౌలటుశాసనము 165

చతుర్దశ భాగము : ఖాదీపుట్టుక

52. ఖాదీపుట్టుక 171

53. ఆశ్వాసాంతము 173

PRESENTED BY G.S. RAJU.
P.U.C. II B.
22.2.73

ప్రథమ భాగము : బాల్య యౌవనములు

1

జన్మాదికము

నాతండ్రి కరంచందు గాంధి పోర్బందరు సంస్థానమున ముఖ్యమంత్రి. స్వకులాభిమాని, సత్యప్రియుడు, ధీరుడు, ఉదారుడు నగు ఆయనకు శీఘ్రకోప మొకటి కద్దు. ధనము కూడబెట్టుటకై ఆయన యెన్నడు ప్రాకులాడి యెరుగడు. కావున మానాటి కేకొంచమో ఆస్తి మిగిలినది.

గుజరాతి బడిలో ఐదవ తరగతి చదివెనేమోకాని అంతకు మించిన చదు వెరుగ డాయన. దేశచరిత్రము, భూగోళ శాస్త్రములను మొదలే యెరుగడు. అట్లయ్యు, లోకానుభవ సంపదచే ఆయన వ్యవహారదక్షుడై, ఎట్టి చిక్కులనైన ఇట్టె విడదీసి, వేలకొలది ప్రజల నడుపులో నడచెడివాడు. సంతత ధర్మప్రసంగశ్రవణముచే, దేవాలయదర్శనముచే హిందువు లందరికి అలవడు ధర్మబుద్ధి ఆయనకు అలవడినదే కాని వేఱుగా మతధర్మశిక్ష పొందినవాడు కాదు.

ఇక మాయమ్మను దలచికొన్నచో ఆయమ పరమ సాధ్వీస్వరూపము నా చిత్తమున వెలుగుచుండును. దేవపూజ చేసి

కాని ఆమె కుడువ నొల్లదు. నిత్యము విష్ణ్వాలయమును దర్శించి వచ్చుట తప్పదు. నా యెరిగినంతలో ఆయమ చాతుర్మాస్యవ్రతము మానినదిలేదు. ఆమె కఠోరనియమములు తాల్చి, పదియెట్లయినను, వానిని గొనసాగించెడిది; జబ్బుగానున్నదని నేమము సడలించుకొనుట గిట్ట దామెకు. చాతుర్మాస్యలలో నొకతూరి ఆమెకు జబ్బుచేసినను వ్రతమును మాత్రము విడనాడినదికాదు. రెండు మూడునాళ్లు వరుసగా నుపవసించుట ఆమె కొక లెక్కలోనిది కాదు. చాతుర్మాస్యలలో నేకభుక్తమున్నది చాలక ఆమె ఒకమారు దినము విడచి దినము నిట్రుపాసము లుండెను. మరియొకమారు సూర్యదర్శనము చేయక భుజింపనని వ్రతము పట్టెను. నడివానకారున ప్రొద్దుదేవర తరచు మొగము చూపడు. కావున ఆనాళ్ళలో పిల్లలందరము ప్రొద్దు పొడచూపగనే మాయమ్మకు తెలుపవలెనని మింటిదెస జూచుచు నిలిచియుండెడివారము. ప్రొద్దు తటాలున పొడకట్టినంత మే మింటిలోనికి పరుగున నేగి మాయమ్మకు దెలుపగా, నామె బిరబిర నేతెంచి తన కనుల జూచునంతలో భాస్కరుడు మఱుంగుపడిపోవును. అంతట నామె "నేడు నేను భుజించుట భగవానున కిష్టము లేదు కాబోలు" అని భుక్తి మానుకొని సంతోషముమై పనిపాటులు చూచుకొనబోవును.

మాయమ్మ మంచిచెట్టలను లెస్సగా నెరుగుటేకాక రాచకార్యములెల్ల బాగుగా ఆకళించుకొన్నది.

అట్టి జననీజనకులకు 2–10–1869 న సుదామపురి యను పోర్బందరులో ఈ నేను జన్మించితిని.

2

విద్యాభ్యాసము

నా శైశవము పోర్బందరులోనే గడచెను. నన్ను చదువులబడికి పంపుట జ్ఞప్తియందున్నది. నాకు ఎక్కములు లొంకపట్టుగ వచ్చినవికావు. తోడిబాలురతో గూడి అయ్యవారికి పేరులిడి ఎకసక్కెములాడుకొనుటతప్ప ఆనాళ్ళలో ఇతర మేమియు నేర్చినట్లు ఇపుడాదకు వచ్చుట లేదు.

నా యేడవ యేట మా తండ్రి పోర్బందరు వీడి రాజకోట ప్రవేశించెను. నేనచట ప్రెయిమరీ బడిలో చేరితిని. నా కప్పటి ముచ్చటలెల్ల జ్ఞప్తియందున్నవి. పోర్బందరు నందువలెనే ఇచటగూడ నా చదువునుగూర్చి చెప్పదగినది లేదు. ఆ బడినుండి సబర్బను స్కూలులో, అటనుండి హైస్కూలులో చేరునాటికి నాకు పండ్రెండవ యేడు వచ్చెను. ఆ కాలమున బడిపిల్లలతోగాని, అయ్యవార్లతోగాని నే నెన్నడు కల్లలాడి నట్లు లేదు. నాకు వల్లమాలిన బిడియ మగుటచే సావాసగాండ్ర నొల్లక నాపుస్తకములు, నా చదువే లోకముగా నుండెడివాడను. సరిగా గంట కొట్టువేళకు బడికేగుట, బడి ముగియగానే పరుగున నిలు సేరుట — ఇదియే నా కలవాటయ్యెను. త్రోవలో నెవరు పలుకరించిపోవుదురో యని బడినుండి యింటి కొక్కటే పరుగు. ఎవరేని గేలిసేయుదురో యనికూడ భీతుగా నుండెడిది.

కొని పలుమారు కన్నీటితో గుమారిలితిని. నేను హైస్కూలులో మందబుద్ధి ననిపించుకొనక, అధ్యాపకులకు ప్రీతిపాత్రుడగూడ నైతిని. బాలుర నడవడినిగూర్చియు, విద్యాసక్తినిగూర్చియు ఏఁటేట తలిదండ్రులకు ఉపాధ్యాయు లంపు పత్రములందు నన్నెన్నడు వారు చెడనాడినది లేదు. ద్వితీయ కక్ష్య దాటినది మొదలు నాకు పసదనములుకూడ ముట్టదొడగెను. ఐదవ కక్ష్యలో నాల్గును, ఆఱవకక్ష్యలో పదియు రౌప్యములు విద్యార్థి వేతనముగూడ గడించుకొంటిని. ఇందులకు గారణము నా యదృష్టమేగాని యోగ్యతగాదు. ఈ వేతనములు కాథియవాడునందలి సౌరాష్ట్రప్రాంతమునుండి వచ్చిన బాలురకే కాని అందరకు ఉద్దిష్టములు కావు. ఆ కక్ష్యలోని నలుబది యేబదిమంది బాలురలో సౌరాష్ట్రవాసు లెక్కువగా నుండరు కదా!

నా తెలివితేటలపట్ల అంతగా నమ్మక మున్నవాడగాను. కావున నాకు బహుమానములు, విద్యార్థివేతనములు లభించినప్పుడు నాలో నాకే అక్కజ మయ్యెడిది. నా నడవడిని మాత్రము మెలకువతో గాపాడుకొనుచుంటిని. అందు ఇసుమంత లోపము కల్గినచో నాకు గళ్ళనీళ్ళపర్యంత మయ్యెడిది. నావలన తప్పిద మున్నప్పుడును, ఉన్నదని అయవారెంచినపుడును నాకు దుఃఖము పొరలిపోయెడిది. అయ్యవారు న న్నొకపరి దండించిరి. దండించినందులకుగాదుగాని, నే నట్టి దండనకు యోగ్యుడనని యెంచిరికదా యని కడుపు చెరువుగా నేడ్చితిని. ఇది నేను మొదటి కక్ష్యలో నున్నప్పటి ముచ్చట.

ఏడవ కక్ష్యలో నుండగాగూడ నిట్టిదే మరియొకటి జరిగెను. శ్రీ దొరాబ్జీ యెదుల్జీ గిమి మా కపుడు ప్రధానాధ్యాపకులు. బోధనాపటిమచే, నిష్ఠాపరత్వముచే, నియమపాలనముచే ఆయన శిష్యజనరంజకుడయ్యెను. పై తరగతుల బాలురందరకు శరీర వ్యాయామము, క్రికెటు ఆటయు తప్పనిసరిగా ఆయన విధించెను. నా కీ రెండును గిట్టవు. దేహపరిశ్రమయు, క్రికెటు మున్నగు ఆటలు నా కంతకు మున్నలవాటు కానివి. నా బిడియమే నన్ను వీనికి దూరమొనర్చినది. ఆ యలవాటు చేసికొనమి దోసమని యిపుడు తెలిసివచ్చినది. దేహపరిశ్రమకు, విద్యాభ్యాసకు సంబంధము లేదని ఆరోజులలో అనుకొంటిని.

దేహపరిశ్రమ మానుటచే నాకు వచ్చిన నష్టమేమియు లేదనికూడ చెప్పవలసియున్నది. ఏలయన, గాలిబయలున చాలదవ్వు నడచుట మంచిదని నేను గ్రంథములందు చదివి, అట్లు నడచుట అలవాటు చేసికొంటిని. నేటికిని నేను దానిని విడువలేదు. ఆ యలవాటే నాకు దేహపాటవ మొసగినది.

ఇంటికడ మా యయ్యగారి పరిచర్య సలుపవలెనను తీవ్రాభిలాషయే నన్ను బడిలోని దేహపరిశ్రమకు విముఖుని గావించినది. బడి ముగియగానే పరుగున నింటి కేతెంచి జనకపరిచర్యకు దొడంగుచుంటిని. ఈ యుపచారపరతచే నాకు దేహపరిశ్రమ మెట్లును లభించుచునే యుండెను. జనకసపర్యకొరకు నాకు బడిలో నిర్బంధపరిశ్రమ మాన్పుడని శ్రీ గిమిని వేడికొన్నను ఆయన సమ్మతింపడాయెను. నే నొక శనివారపు టుదయమున బడి కేగి ఇంటికి వచ్చితిని. మధ్యాహ్నము బడి లేకున్నను

దేహపరిశ్రమకోసము నాల్గుగంటలకు మరల బడి కేగవలసి వచ్చెను. మింట మేఘములు క్రమ్మి నన్ను మోసగించెను. నాకు గడియారము లేకపోయెను. తీర, నేను బడికి చేరక మున్నే బాలురందరు వెడలిపోయిరి. మరునాడు శ్రీగిమి హాజరుపట్టీ చూచి "నిన్న నీ వేల రాలే?" దని యడిగిరి. నేను ఉన్న యథార్థము చెప్పగా ఆయన విశ్వసింపక, ఒండో రెండో (నా కిపుడు జ్ఞప్తిలో లేదు.) అణాలు జుల్మానా చెల్లింపుమనియెను.

నన్ను కల్లరీడననిరికదాయని ఎంతయేని వ్యథ చెందితిని. నేను నిజమాడితినని నమ్మించుట కుపాయము కనిపించక బిట్టు దుఃఖించితిని. సత్యవాది జాగరూకుడై మెలగవలయునని నా కపుడు తెలిసివచ్చినది. అది మొదలు నే నెన్నడు బడి పనులపట్ల అశ్రద్ధ చేసినది లేదు. ఆ జుల్మానాకూడ నాకు తిరిగి యిచ్చివేసినట్లు లీలగా జ్ఞప్తికి వచ్చుచున్నది. బడి వదలగనే మా పిల్లవాని నింటికి పంపుడని మా జనకుడు స్వయముగా శ్రీగిమికి వ్రాసి నాకు నిర్బంధ దేహపరిశ్రమ తప్పించెను.

శరీరవ్యాయామము మానుటచే నేను నష్టపడినది లేదు గాని, వ్రాలు కుదురకున్నను, విద్యావృత్తికి లోపము కలుగదని నా మనసులో నెట్లో పడుటచే నొదవిన లోపము నేటికి నట్లే యుండి తత్ఫల మనుభవించుచుంటిని.

నా చదువులబడినాటి ముచ్చటలు మరి రెండు చెప్ప దగినవి కలవు. నా వివాహముచే నొకయేడు చదువు చెడెను.

ఆ నష్టము కూడివచ్చుటకై అధ్యాపకుడు నన్ను పైతరగతిలో వేయుమనెను -- కష్టించి చదువు బాలురకీ సదుపాయము చేసెడివాడు. కావున మూడవ తరగతిలో నే నారు మాసములు మాత్రము చదివి. వేసవి సెలవులకు మున్ను జరపు పరీక్షల యనంతరము నాలవ కక్ష్యలో చేరితిని. నాలవ కక్ష్యనుండి పఠన పాఠనము లాంగ్లభాషలో నడచుటచే నా కది క్రొత్తయై, కొఱుకుపడుట కష్టమాయెను. క్షేత్రగణిత మొకటి క్రొత్తగా నేర్పదొడగిరి. నా కందు ప్రవేశము తక్కువగుటకు దోడుగా ఆంగ్లభాషాశ్రయ మొకటి వచ్చిపడి మఱియు గష్ట మనిపించెను. అయవా రెంతచక్కగా బోధించినను అది నా మది కెక్క దాయెను. రెండేండ్ల చదువు నొక్కయేటనే నే నెట్లు మ్రింగ నేర్తునని తరచుగా నధైర్యపడి, మరల మూడవ కక్ష్యలో చేరుట మేలనిపించెడిది. అట్లొనర్చినచో నా యవమానము నాకేగాక, నా తెలివితేటలను నమ్ముకొన్న యొజ్జలకుగూడ ఘటిల్లును. ఈ రెండు అపప్రథల కోడి నే నున్నచోటును వదల నిశ్చయించితిని. ఎట్లో కష్టించి యూక్లిడులో పదుమూడవ సూత్రమును చేరుసరికి నాకు గనువిప్పుగలిగి క్షేత్రగణితసౌందర్య మిట్టిదై గోచరించెను. కేవల బుద్ధిబలముచే సాధింప దగిన విషయ మేదియును నిజముగా నాకు గష్టము కాదు. అప్పటినుండి క్షేత్రగణితము సులభసాధ్యమై, దానియందు నాకు రుచి యేర్పడెను.

ఇక సంస్కృతభాష నాకు మఱియు గష్టమనిపించెను. క్షేత్రగణితమువలె గాక సంస్కృతము మొదటినుండి తుదివరకు

కంఠపాఠము చేయవలసినదిగా దోచెను. నాల్గవ కక్ష్యలోగాని సంస్కృతపాఠ మారంభము కాదు. ఆరవ కక్ష్య చేరుసరికి ధైర్యము చప్పగా గోలుపోతిని. సంస్కృతపుటొజ్జ యూ కా భాష నెల్లెనను నూరిపోయవలె నను అభిలాష కలవాడు. అసడ్డ నేమాత్రము సహింపడు. ఆయనకూ పారసీమున్షీకీ మధ్య కొంత స్పర్థ యుండెడిది. విద్యార్థులు పారసీకము నేర్చుట సులభమనియు, ఆ యుపాధ్యాయుడు మంచివాడనియు, మెత్తని వాడనియు చెప్పికొనుచుండెడివారు. ఆ భాషా సౌలభ్యమునకు లోగి నే నొకనాడు పారసీ నేర్చు బాలురతో ఆ పాఠమున కేగితిని. సంస్కృతపు టయ్యవారది యెంగి బాధచెంది, నన్ను జేరబిలిచి, 'నాయనా! మీ తండ్రిగారు వైష్ణవులుకదా, మరి నీ వా మతభాషను నేర్వవలదా? నీ కేమేని కష్టము తోచినచో నన్నడుగవచ్చునుగదా, నేను శక్తి వంచన సేయక మీకు బోధించుచుంటిని. ఈ భాషలో ఇంపైన విషయము లెన్నియున్నవో ముందు ముందు నీకే తెలిసి వచ్చును. అధైర్యమేల? మరల సంస్కృతపాఠమునకు రమ్మా, నా మాట విను' మని బోధించెను.

వారి దయారసముచే నాకు సిగ్గొదవెను. అయ్యవారి ఆదరమును త్రోసివేయుటెట్లు? ఆ కొలదిపాటి సంస్కృతమైన నే నానాడు నేర్వకున్నచో మన మతగ్రంథములపై ఆస్థకుదురుట దుష్కర మయ్యెడిది. ఆ భాషలో పాండితి సంపాదింపనైతినని నే నిపు డెంతయో వగచుచుందును. హైందవ బాలబాలిక లందరకు సంస్కృతమున మంచి ప్రవేశ ముండితీరవలె నని నా కిటీవల దెలిసివచ్చెను.

వ్యాసరచనకు

1. విద్యార్థిగా నున్నప్పటి గాంధిజీ సత్యప్రియత్వమునకు తార్కాణలు వర్ణింపుము.

2. శ్రావణ, హరిశ్చంద్రుల కథలు చెప్పి, వానిపై గాంధిజీకి ప్రీతి యేలకలిగెనో తెలుపుము.

3. గ్రంథములను వల్లించుటకంటె సచ్ఛీల మలవరచుకొనుట ఉత్తమముగా గాంధిజీ యెంచెను. వల్లెంచుట యుక్తమా? అగుచో ఎందువలన?

4. "సత్యప్రియునకు జాగరూకత వలయు" నని గాంధిజీ చెప్పెను. గాంధిజీ యభిప్రాయమును ప్రకరణోచితముగ విశదీకరింపుము.

3

వివాహము

నాకు పదుమూడవయేట వివాహమైనది. ఇది చెప్పుట బాధగా నున్నను చెప్పక తీరదు. ఇపుడు నాచెంత నా పాలన మందున్న ఈ బాలురను జూచి, ఈ యీడుననే నాకు పెండ్లి యగుట దలచికొన్నపుడు నాపై నాకు జాలి పొడముచుండును. నా దురవస్థ వీరికి వాటిల్లనందున వీ రదృష్టవంతు లనిపించును. లేతప్రాయపు వివాహములను నైతికముగా సమర్థించుట కుపపత్తులు కన్పింపవు.

పెండ్లి యనగా మంగళవాద్యములు, నూతన వస్త్రములు, ఊరేగింపులు, విందు లారగించుటలు, కొత్తసావాసకత్తె లభించుటయు నను సంబరమే కాని అంతకంటె నా కేమియు దెలియదు. మా యిరువురకు క్రమముగా పరిచితి యేర్పడెను. మాటలు కలిసెను. ఇరువురము నొక్క యీడు వారము. అయ్యో నేను వెంటనే పెనిమిటి పెత్తన మారంభించితిని.

నా యనుమతి లేనిదే భార్య యెచటికి బోరాదంటిని. కాని కస్తూరిబా చెంత ఈ పప్పు లుడుకలేదు. ఎచటికేని, ఎప్పుడేని తనయిచ్చమై నేగుటయే యామె పనిగా బెట్టుకొనెను. నేను నిర్బంధించినకొలది ఆమె స్వతంత్రింపదొడగెను. ఆమె స్వతంత్రించినకొలది నాకు గోపము రెచ్చిపోవుచుండెను. నూత్నవధూవరులమగు మాకు ఒండొరులకు మాటలు కట్టువడెను. పాపము. కస్తూరిబా అమాయికపు చిన్నది; నా యదుపును పాటింపమి యామె దోసముగాదు. సావాసకత్తెల యిండ్లకు, గోవెలకు బోరాదన్నచో ఆ యీడు బాలికలు మానుకొందురా? ఆమె నదుపుసేయు నధికారము నాకున్నచో నన్నును ఆమె అదుపు చేయవచ్చునుగదా! ఇది యంతయు నా కిపుడు తెలిసి వచ్చినదిగాని అపుడు పెనిమిటిమాట చెల్లితీరవలెనను పట్టుదల యొక్కటే తెలియును.

మా దాంపత్య మిట్లు కలహముతోనె దెల్లవారె నను కొందురేమో! కాదు. నే నామెపట్ల పారుష్యము వహించుటెల్ల ప్రేమపెంపుననే. ఆమె యిల్లాండ్రలో మేలుబంతిగా

నుండవలయునని నే నభిలషించితిని. ఆమె సుశీలయై, నా నేర్చినదెల్ల నేర్చి మనోవాక్కాయములచే నాతో నేకీభవింప వలెనని ముచ్చటపడితిని.

కస్తూరిబాయికిమాత్ర మట్టికోరిక యున్నట్లు తోచదు. చదువను, వ్రాయను నేర్చినది కాదామె. అమాయికత్వము, స్వాతంత్ర్యము, పట్టుదలయు నామెకు సాజములు. నాతో నించుక బిడియపడుచుండెడిది. విద్యావతిని కానైతినన్న విచార మామెకు లేదు. నా విద్యావ్యాసంగముచే నామె కట్టి వ్యాసంగముపై వాంఛయు జనింపలేదు.

వ్యాసరచనకు

కస్తూరిబా, గాంధీల నూతనదాంపత్యమును నీ సొంతమాటల వర్ణింపుము.

4

దుస్సాంగత్యము

హైస్కూలులో నాకున్న మిత్రులే కొలది; వారిలో వేర్వేరు సమయములం దిద్దరితో గాఢమైత్రి యేర్పడెను. అందు మొదటిది చిరకాలము నిలువలేదు. దానికై నను నేను వదలు కొనలేదు. రెండవ మిత్రముతోడి నా చెలిమి మొదటివానికి గిట్టక అతడు నన్ను విడనాడెను. చిరకాలము మనిన ఈ

రెండవ మైత్రిచే నా బ్రదుకు బండలాయెను. సంఘసంస్కార ప్రేరితుడనై నే నా స్నేహము చేసితిని.

ఈతడు తొలుత నా చిన్నయన్నకు స్నేహితుడు. వా రిరువురు సహాధ్యాయులు. ఆతని లోపము లెరిగియు, విశ్వాస్యుడని యెంచి చెలిమి చేసితిని. మా యమ్మయు, మా యన్నయు, నా భార్యయు 'నీ కీ దుస్సహవాసము వల' దని చెప్పిరి. ఆలిమాట నే నభిమానముచే సరకుసేయకున్నను మా యమ్మను, అన్నను కాదనలేను. వారిని సమాధాన పరచుటకై 'మీరు చెప్పిన దోషము లాతనిలో లేవనను గాని కొన్ని సుగుణములుగూడ ఆతనియం దున్నవి. నే నాతని చక్కదిద్దుటకై మైత్రి నెరపుచుంటిని గాన న న్నాతడు పెడ ద్రోవన బెట్టలేడు. మంచిదానికి వచ్చినచో ఆతనివంటి ఉత్తముడు మరియుండడు. కావున నాకై అలజడి చెందకుడు' అని చెప్పితిని.

ఈ మాటలు వారికి నచ్చకున్నను నాదారిని నన్ను బోనిచ్చిరి. ఆతనితో నాకు పరిచితి ఏర్పడునాటికి రాజకోటలో సంస్కారవాయువులు వీచుచుండెను. మా గురువులలో జాల మంది చాటుమాటున మద్యమాంసములు సేవించుచుండిరని ఆతడు నాతో జెప్పెను. రాజకోటలో మరికొందరు పెద్దలకు గూడ నీ యలవా టున్నదని వారిని పేర్కొనెను. మా హైస్కూలు బాలురు కొందరుగూడ నందు జేరి రని చెప్పెను.

ఈ మాటలచే నే నాశ్చర్య విషాద భరితుడ నైతిని. వా రిట్లు జేయుటకు గారణమేమి యని యడుగగా నాత డిట్లు

వచించెను. 'మాంసము తినకుంటచే మనము దుర్బలులమై పోతిమి. మాంసభక్షకులగుటచే ఆంగ్లేయులు మనకు పాలకులు గాగలిగిరి. నా దార్ఢ్యము నీ వెరుగుదువు. పరుగులో నా కెనరును దీటురారు. మాంసభక్షణమే ఇందులకు గారణము. ఎంచి తినువారికి కురుపులు పుట్టవు. పుట్టినను త్వరగా మాని పోవును. మాంసము తినుచున్న మన గురువులు, తక్కు పెద్దలు బుద్ధిహీనులు కారుగదా. దాని గుణ మెరిగియే తినుచుండిరి. నీవును తినిచూడుము. ప్రయత్నమువంటిది మరియొకటి కాదు. పిమ్మటపై నీకే తెలియును, అది యెట్టిబలము నొసగునో.'

ఈ హేతువులన్నియు ఒక్కనాడే చెప్పినవి కావు. తన మతము నాకు నచ్చుటకై ఎడపదడప నాతడు నాతో జెప్పుచు వచ్చిన మాటల సారమిది. అంతకుముందే యిందు దిగిన మా చిన్నన్న ఈతని వాదమును సమర్థించెను. మా చిన్నన్నయు నాతడును నిజమునకు దృఢకాయులు, బలశాలురు, సాహసులు. వారిముందు నాది పిట్టరూపు. ఈ స్నేహితుని సాహస కృత్యములు నన్ను ముగ్ధుని చేయుచుండెడివి. ఆతడు రివ్వున కడుదవ్వు పరుగిడగలడు. ఎత్తుగా నెగురుటలో, దవ్వు దుముకుటలో నాతని దండెవేసిన చేయి. ఆతని శరీర మెంతటి బాధనైన సహించును. ఆతడు తరచు తన వీరకృత్యములు నాకు జూపెట్టెడివాడు. తనకు లేని గుణము నితరులయందు చూచి నిచ్చవడుట సహజముగాన నేను నీ చెలికాని శక్తి కచ్చెరు వందితిని. నేను పరుగిడ లేను; దుముకను లేను. కావున నేనుగూడ ఆతనియంతవాడను గావలయునను వాంఛ నాకు గాటముగా జనించెను.

నేను వట్టి పిరికివాడను. దొంగలు, భూతములు, పాములు అన్నచో నాకు దగని భయము. రాత్రులందు గడప దాటి పోలేను. చీకటిలో నాకు ప్రాణము లెగసిపోవును. చీకటిలో పండుకొన్నచో ఆ మూలనుండి దొంగలో, ఈ దెస నుండి భూతములో, మూడవవైపునుండి పాములో వచ్చుచున్న వని మనసు ఆరాటపడుచుండును. కావున దీపములేని గదిలో నేను నిద్రపోలేను. నా యీ దౌర్బల్యమెల్ల నాత డెఱిఁగినదే. బ్రతికియున్నపాములను జేతబట్టుకొందుననియు, దొంగలనిన దనకు లెక్కలేదనియు, భూతములపై నమ్మకము లేదనియు నాతో జెప్పెడివాడు.

ఇక నేమున్నది? ఈ మాటలన్నియు చేయవలసిన పని చేసి, నన్ను లోగొన్నవి. మాంసాశనము మంచిదనియు, దానిచే నాకు ద్రఢిమయును, సాహసము చేకురుననియు, ప్రజ లందరు మాంసము దిన్నచో ఆంగ్లేయులను జయింపవచ్చు ననియు నాకు దోచసాగెను.

ఈ ఘనకార్య మొనర్చుటకై సుముహూర్తము నిశ్చ యించితిమి. నా జననీజనకులు వైష్ణవులు; నాకు వారియెడ నమితభక్తి. కావున ఈ పని చాటుగా జరుగవలెను. పలల భక్షణ మారంభించినచో నది నా తల్లిదండ్రుల మోసగించుటే యగునని నాకు దెలియదందునా? అటులేనుగాని 'సంస్కార' మను భూతము నన్ను బట్టుకొనెను. జిహ్వాచాపల్యముచే నే నిందు దిగినవాడనుగాను. మాంసము రుచిగా నుండుననియు నే నెరుగను. నేను దృఢశరీరుడను, ధీరుడను కావలయును;

నా దేశప్రజలెల్ల నట్టివారు కావలయును – ఇదియే నాకు బట్టిన సంస్కారావేశము. దీనిచే గ్రుడ్డినైపోయితిని. ఈ రహస్యము పొక్కదు గావున తల్లిదండ్రుల కనుమొరగుట సత్యవ్రత భంగము కాజాలదని సమాధాన పడితిని.

సుముహూర్తవేళ ఏటియొడ్డున ఏకాంతప్రదేశమున కేగితిమి. అచ్చట తొలిసారిగా నాకు మాంసము ప్రత్యక్షమైనది. కల్లురొట్టెగూడ దాని సరస నున్నది. ఆ రెండును నాకు రుచించినవికావు. తోలువలె బిరుసుగానున్న ఆ మేకమాంసము నేను నమలలేకపోతిని. ఓకిరింత జనించి వదలివేసితిని.

నాటిరేయి నా పడిన యవస్థ ఏమిచెప్పుదును? ఇంచుకంత కునుకు పట్టగనే కడుపులో మేక యరచుచున్నట్లు ఒకటే పీడకల. త్రుళ్ళిపడి లేచుటతో, చేసిన పాడుపని కేడ్చుటతో నాకు దెల్లవారెను. తెలివి వచ్చినపుడెల్ల మాంసాదనము విహితధర్మమని ఊరటచెందితిని.

నా మిత్రము తేలికగా వదలిపెట్టెడి ఘటము కాదు. కావున పలలముతో బలురకముల పిండివంటలు చేయసాగెను. ఏటియొడ్డున చాటుచోటు వదలిపెట్టితిమి. దివాణపు భవనమునందలి ముఖ్యపాచకుని నా స్నేహితుడు కూడగట్టుకొనుటచే అచటి కుర్చీలలో గూరుచుండి, మేజాబల్లపై భుజింపదొడగితిమి.

క్రమముగా గల్లురొట్టెపై నా యేవము జారిపోయెను; మేకలమీద జాలి సన్నగిల్లి, మాంసపు బిండివంటలు – తుదకు

మాంసమే రుచింప దొడగెను. ఈ రీతిగా నొక వత్సరము సాగినను మొత్తముమీద మాంసపువిందు లయిదారుకంటె అధికముగా జరుగలేదు. ఈ 'సంస్కారమును' విలుచుటకు నాచెంత సొమ్ము లేదుగాన నా నెయ్యుడే దానిని సంపాదింప వలసి వచ్చెను. అత డెచట దెచ్చెడివాడో నే నెరుగను. నన్ను పలలభక్షకుని జేయు పూన్కిమై నత డెట్లో సొమ్ము సంపాదించి తీరెడివాడు. అతని శక్తి కేనియు మితియుండును గావున కొంతకాలమున కావిందులు ఎడపదడప సకృత్తుగా నమర జొచ్చెను.

ఈ చాటు విందులు సాగిన నాళ్ళ నింటికడ తిండి తినుట అశక్యమయ్యెడిది. భుక్తివేళకు మాయమ్మ నన్ను బిలుచుటయు, 'ఏలతినవు' అని యడుగుటయు దటస్థించెడిది. 'నేడు జీర్ణశక్తి బాగుగా లేదు; ఆకలి యగుట లే' దని చెప్పెడివాడను. నే నసత్యమాడుచుంటిననియు, మా యమ్మతో నాడుచుంటిననియు నెరుగుదును. నేను మాంసఖాదినై తినని మా యమ్మకు, నయ్యకు దెలిసినచో వారికి గుండెలు వ్రయ్యలగు ననియు నెరుగుదును. ఈ యాలోచనతో నా మనసు కళవళ పడసాగెను.

'మాంసము తినుటయు దప్పదు. ప్రజల భోజన పద్ధతి సంస్కరించుటయు దప్పదు. నిజమేకాని, మాంసము మానుట గురుజన వంచనముకంటె అపరాధము కానేరదు. కావున వారు బ్రదికియుండగా మాంసము దినుట విడువదగును. వారి యనంతరమున నేను స్వతంత్రుడనైన పిమ్మట బహి

రంగముగనే మాంసము తిందును. అందనుక దాని జోలికి పోను' అని నిశ్చయించుకొంటిని.

నా చెలికానికి నిశ్చయ మెఱిగించితిని. తిరిగి నే నెన్నడు మాంసమును ముట్టలేదు.

వ్యాసరచనకు

1. మాంసభోజనము మంచిదని గాంధిజీ ఎంచుటకు గారణము లెవ్వి?

2. గాంధిజీ మాంసము నేల వర్జించెను?

3. ఆలోచింపక స్నేహము చేయరాదు. ఎందువలన? ఈ ప్రకరణము నందలి గాంధిజీ అనుభవములచే దీనిని తార్కాణింపుము.

5

చౌర్యము

నా వివాహమగుట కించుక ముందు వెనుకలుగా, ఈ మాంసభక్షణ సమయమందును, అంతకు బూర్వమందును నా యొనర్చిన తప్పిదములు మఱికొన్ని చెప్పవలసియున్నవి.

నా బంధు వొకడును, నేనును పొగ ద్రాగుటకై మనసు పడితిమి. పొగపీల్చుట మంచిదనియు గాదు, సిగరెట్టు వాసనపై ఇష్టముండియు గాదు, నోటినుండి పొగమబ్బులు కల్పించుట

సరదాగా నుండెడిది. మా పినతండ్రి పొగపీల్చుట చూచి మేమును మొదలుపెట్టితిమి. కాని, మాకడ పైకము లేదుగావున మా పితృవ్యుడు కాల్చి పారవైచిన సిగరెట్టు పీకలను సంగ్రహించుచుంటిమి.

ఆ పీక లెల్లప్పుడు దొరకెడివి కావు. దొరకినను వాని నుండి పొగవచ్చుట అంతంతమాత్రమగుటచే మేము చల్లగా మా నవుకరుల జేబులనుండి కానిడబ్బులు దొంగిలించి, నాటు చుట్టలు కొనసాగితిమి. వానిని దాచిపెట్టుట పెద్ద చిక్కయ్యెను. పెద్దలయెదుట పొగత్రాగ తగదాయెను. ఆ దొంగడబ్బులతో గొన్నాళ్ళట్లో గడపితిమి. ఇంతలో, గొన్ని మొక్కల దంట్లు సిగరెట్లవలె పీల్చవచ్చునని తెలిసెను. అంతట వానిని సంపాదించి పొగపీల్చసాగితిమి.

ఈ చాటు మాటు పొగపీల్పులు మాకు దృప్తినీయ వాయెను. మనకు స్వేచ్ఛ లేకపోయెగదాయని దుర పిల్లితిమి. పెద్దల యనుమతి లేకుండ నేమి చేయుటకును వలను పడమి దుస్సహ మనిపించెను. ఈ పరాధీనపు బ్రదుకుచే విసివి, తుదకు ఆత్మహత్యకు సిద్ధపడితిమి.

ఆత్మహత్య కుపాయమేది? మాకు విష మెచట దొరకును?—అని యాలోచించితిమి. ఉమ్మెత్తగింజలు తిని చావవచ్చునని వినియుండుటచే నడవిలోని కేగి వానిని సంపాదించి తెచ్చితిమి. సాయంసమయము సుముహూర్తమని యెంచి, ఆ వేళకు కేదారనాథుని మందిరమున కేగితిమి. అచట దీపారాధన మొనర్చి, స్వామిదర్శనము చేసికొని, ఒంటరి

పాటు చూచుకొంటిమి. తీర, సమయమునకు ధైర్యము చాలకపోయెను. ఒకవేళ ఈ విషము వెంటనే చంపకున్నచో నేమగును?—అను ఆలోచన పొడమెను. ఇంతకు ప్రాణములు దీసికొన్నచో నేమిప్రయోజనము? స్వేచ్ఛ లేకున్నచో నేమాయె?—అనుకొనుచు నెట్లో రెండు మూడు గింజలు మ్రింగితిమి. అంతకుమించి తెగింపలేకపోతిమి. చావనిన భయము పుట్టెను. అంతట నిరువురము రామస్వామి మందిరమున కరిగి, మనసు కుదుటపరచుకొని, ఆత్మహనన విచారము నుజ్జగించితిమి.

చేసేత ప్రాణములు దీసికొనుట చులకనగాదని నాకు దెలిసివచ్చెను. మా యాత్మహననయత్నమంతయు తుదకు ధూమపానమునకు, పరిచారకుల డబ్బులు దొంగిలించుటకు స్వస్తిచెప్పుటతో నంతమయ్యెను.

నాకు బుద్ధి తెలిసిన పిమ్మట మరల ధూమపానముపై గోరికపుట్టలేదు. పొగపీల్చుట అనాగరకము, హానికరము, అసహ్యము నని యెంచుకొంటిని. లోకమంతట నీ పొగపీల్పుపై నింతటివ్యసన మేటికో నాకు దెలిసినదికాదు. రైలు ప్రయాణములలో నందరు గుప్పుగుప్పున పొగపీల్చి వదలుచుండగా నా కూపిరియాడదు.

ఆ పిమ్మట నేను మరియొక ఘోరచౌర్యమున కొడిగట్టితిని. రాగిడబ్బులు దొంగిలునాటికి పదిరెండు పదుమూడేండ్లుకూడ నాకు లేవేమో. ఈ రెండవ చౌర్యము నాటికి పదునైదేండ్ల

వాడనైతిని. మాంసభక్షకుడగు మా యన్నచేతి కడియము నుండి చిన్న పైడిముక్క తెక్కలించుటకు పాల్పడితిని. ఈ యన్న పాతిక రౌప్యము లప్పు చేసెను. ఆతని చేతికి గట్టి బంగారు కడియ మున్నది. దానినుండి చిన్నముక్క తెగ గొట్టుటన్న నొక కష్టమైన పని గాదు.

ఆ పని యేమో జరిగెను. అప్పును తీరినది. కాని నా చేసిన పాడుపనిచే దుర్భర వేదన ఘటించెను. ఇక నెన్నడు తస్కరింపనని నిశ్చయము చేసికొంటిని. ఈ చేసిన పాపము మా తండ్రికి జెప్పివేయవలెననికూడ ఎంచితిని. కాని చెప్పుటకు ధైర్యము చాలలేదు. మా తండ్రి నన్ను దండించునను భీతిచేగాదు. ఆయన మాపై నెన్నడు చేయిచేసికొన్న వాడు కాడు. చెప్పినచో ఆయన హృదయ మెంతఘూర్ణిల్లునో యని భయపడితిని. ఏది యెట్లైనను చెప్పక తీరదనుకొంటిని. చేసిన పాపమునకు చెప్పుటయే నిష్కృతి యని నెంచితిని.

నే చేసిన పాపమంతయు తండ్రికి వ్రాసియిచ్చి వారి క్షమ నర్థించుటకు బూని, దాని నొక కాగితముపై లిఖించి, స్వయముగా జనకుని చేతి కిచ్చితిని. నా పాపము నొప్పికొనుటయే కాక, దానికి తగిన దండనము విధింపుడనియు, ఈ కుపుత్రుని యపరాధమునకు మీరు వ్యథ నొందకుడనియు నందు వారిని వేడికొంటిని. ఇకమీద నెన్నడు నిట్టి చౌర్యము చేయనని బాస చేసితిని.

ఆ కాగితము జనకున కొసగునపుడు నేను నిలువున వణకిపోతిని. వట్టిబల్లపై పండుకొని, కదలుట కశక్తుడై

యున్న తండ్రిచేతి కాచీటీ నొసగి ఎదురుగా గూరు చుంటిని.

దానిని చదువుసరికి వారి కనుల బాష్పములురలి, కాగితమును దడుపజొచ్చెను. ఆయన యొక్క నిమేషము నిమీలితనయనుడై యుండి ఆ చీటీని జింపివైచెను. దానిని చదువుటకై లేచి కూరుచున్నవాడు మరల వెనుక కొరగెను. నేనును ఏడువ జొచ్చితిని. జనకుని వ్యధ నా కనుల గట్టిన ట్లుండెను. చిత్రలేఖనము నేర్చియున్నచో నిపుడుగూడ ఆ దృశ్యమును జిత్రింపగలను. నా హృదయమున నేటికి నది యచ్చున గ్రుద్దిన ట్లున్నది.

ప్రేమపూరితములగు ఆ బాష్పములు నా హృదయమును కడిగివైచి, నా పాపమును క్షాళితమొనర్చెను.

సాజముగా మాతండ్రి ఇంతటి క్షమాశీలుడు కాడు. కోపపరవశుడై, పరుషోక్తులాడి, తలపై బాదుకొనును ననుకొంటిని. నేను పాపము నొప్పుకొనుటయే అపురూపమగు అంతటి శాంతిని వారికి గూర్చెను. దండించు నధికారిచెంత పాపము నొప్పుకొని, ఇక నెట్టి పని చేయనని మాటయిచ్చుటయే అచ్చమగు ప్రాయశ్చిత్తము. నా యీ ఒప్పుదలయే మా తండ్రికి నన్నుగూర్చిన చింత తీరిపోవుటయే కాక నాయెడ ప్రీతియు వారి కధికమయ్యెను.

వ్యాసరచనకు

1. పొగ త్రాగుటనుగూర్చి గాంధీ అనుభవమును వివరింపుము.

2. గాంధిజీ తన పాపము నొప్పికొనుటచే (ఎ) వారిజనకునిలో (బి) గాంధిజీలో కలిగిన మార్పులకు గారణము నీకు తోచినట్లు వ్యాఖ్యానింపుము.

3. గాంధిజీ ఆత్మహత్య కేల పూనెను? ఏల మానెను?

6

పితృవియోగము

నా కపుడు పదియారవ యేడు. మా తండ్రి అప్పటికే మంచమెక్కెను. మా యమ్మయు, నేనును, మా యింటి వృద్ధపరిచారికయు ఆయనకు పరిచర్య చేయుచుంటిమి. ఆయన కురుపునకు కట్టుకట్టుటయు, వేళ కౌషధ మిచ్చుటయు నా వంతు. రాత్రు లాయనకు నిద్రపట్టుదనుకను, లేచా, 'ఇక జాలునులె' మ్మను వరకును పాదములొత్తి, పిమ్మట నిదురించెడి వాడను. ఆ పరిచర్యయన్న నా కెంతో యిష్టము. దాని నెన్నడు మానినట్లు గురుతులేదు. నా నిత్యకృత్యములకు పోగా మిగిలిన కాలము బడిపనులకును, పితృసేవకును సరిపోయెడిది. ఆయనకు గొంచము తేలికగా నుండి, అనుజ్ఞ యిచ్చినచో నెపుడైన సంజవేళ వాహ్యాళి కేగి వచ్చెడివాడను.

ఆ కాళరాత్రి వచ్చెను. 10-30 లో 11 గంటలో ప్రొద్దుపోయెను. నేను పాదసంవాహన మొనర్చుచుంటిని.

వంతుమార్పిడికి మా పినతండ్రి రాగా నేను బోయి శయనించితిని. మరి అయిదారు నిముసములలో పరిచారకుడు వచ్చి నాతలుపు దట్టెను. నేను కళవళపడి లేచితిని. 'బాబయ్యగారికి బరువుగా నున్నది, రండు' అనెను. వ్యాధి అధికముగా నున్నదని నే నెరిగినదియే కాన 'బరువుగా నున్న' దనగనే అందలి యర్థము తెలిసిపోయినది. తటాలున మంచము డిగ్గనురికి 'ఏమైనది? చెప్పు' మని యడిగితిని. 'బాబయ్యగారు మరి లేరు' అనియెను.

అంతయు ముగిసినది. తుదివేళ చెంత లేకపోతినిగదా యని చాల దుఃఖించితిని.

వ్యాసరచనకు

గాంధిజీ తండ్రిగారి నే యే భంగుల సేవించెను?

7
ధర్మపరిచయము

దయ్యములు, భూతము లన్నచో నాకు భయమని మున్నే చెప్పితిని. రామనామము జపించినచో ఆ భయము పోవునని రంభయను నా దాది ఉపదేశించెను. రామనామ ప్రభావముపైకంటె రంభపై నా కెక్కుడు విశ్వాసము గావున భీతిహారణమునకై పిన్ననాటనే రామనామస్మరణ

మారంభించితిని. ఆ స్మరణము పెద్దకాలము నిలువలేదుగాని చిననాడు విత్తిన ఆ బీజము లూరక పోలేదు. ఆ యుత్తమురాలు, రంభ ఆనాడు నాటిన విత్తనమువలననే నేడు రామనామము నాకు తారకమంత్రమైనది.

వ్యాధిగ్రస్తుడగు మాయయ్య పోర్బందరులో కొంతకాల ముండెను. సాయంవేళల ఆయన రామాయణ శ్రవణ మొనర్చెడివాడు. రామభక్తుడగు పౌరాణికుడు చక్కని కంఠమెత్తి అభంగములు పాడుచు, రామకథావివశుడై వ్యాఖ్యానించుచుండ శ్రోతలు మైమరచెడివారు. అప్పటికి నాకు పదుమూడేళ్ళ వయసున్నదేమో. ఆయన పురాణకథనముచే నేను వివశుడ నగుచుంటిని. రామాయణమునెడ నా భక్తి కదియే మూలము. తులసీదాస రామాయణమువంటి ధర్మగ్రంథము మరిలేదని నేడు నే ననుకొందును.

హైందవ ధర్మమందలి భిన్న శాఖలను, ఇతర మతధర్మములను ఆదరణీయములుగ గనుట నాకు రాజకోటలో నుండగా అలవడెను. మా తలిదండ్రులు హవేలీకి, శివుని గుడికి, రాముని గుడికిగూడ నేగెడివారు. పిల్లలము మమ్ములను వెంట గొనిపోయెడివారు. జైన సన్యాసులు తరచు మా యయ్య కడకు వచ్చుచుండెడివారు. మేము జైనులము కాకున్నను వారు మాయింట భిక్ష గ్రహించుటయు గద్దు. వారు మా జనకునితో ధర్మప్రసంగము లొనర్చుటయు, ఇతర వ్యవహారములు మాటలాడుటయు గద్దు.

మిత్రులగు మునల్మానులు, పారసీకులును వచ్చి తమ తమ ధర్మములగూర్చి ప్రసంగించుచుండ మాయయ్య సగౌరవముగ, సాదరముగ వినెడివాడు. నేను ఆయనకు పరిచర్య సల్పుచు నొద్దనుండి ఆ మాటలు వినుట లభించెను. ఇది యెల్ల కారణముగా నాకు సర్వధర్మ సమాదరము అలవడెను.

క్రైస్తవమత మొక్కటే నాకు గిట్టకుండెడిది. దాని యెడ నా వైముఖ్యమునకు గారణమున్నది. ఆ కాలమున క్రైస్తవమత ప్రచారకులు హైస్కూలు చెంత నిలిచి హైందవులను, వారి వేల్పులను దెగనాడుచుండిరి. నేనది భరింపలేకపోతిని. సుప్రసిద్ధుడగు ఒక హైందవుడానాళ్ళలోనే క్రైస్తవమత ప్రవిష్టుడగుట వినవయ్యెను. మతస్వీకారవేళ అయన గోమాంసమును తిని, మధుపానమొనర్చెననియు, నాటినుండి తొల్లిటివేసము వదలి ఐరోపీయుల దుస్తులను, టోపీని ధరింపజొచ్చెననియు బజారువారెల్ల జెప్పికొనదొడగిరి. ఆ క్రొత్త క్రిస్తుగాడు అప్పుడే తన పూర్వధర్మములను, సంప్రదాయములను, స్వదేశమును గూడ చెడనాడ సాగెననియు వింటిని.

ఇట్టి సమయమునందు నా కిట్లు సమభావము ఏర్పడిన దప్పింతనే ఈశ్వరునియెడ్ల శ్రద్ధాభక్తులు కలిగినవని యెంచ గూడదు. ఈ సృష్టికి నీతియే మూలమనియు, సత్యమే సర్వ నీతిసారమనియు — ఈ విశ్వాసము మాత్రము నాలో వేరు దన్నికొన్నది.

గుజరాతి సుభాషిత మొకటికూడ నా మనసున నాటి కొన్నది. 'అపకారికి ఉపకారము చేయుము' అను నందలి సూత్రము నా బ్రదుకునకు చుక్కానై నది. దాని యర్థము నన్వేషింప తదనుగుణముగా చరించుటకై యత్నము లారంభించితిని.

ఇదిగో, ఆపద్య మిట నుదాహరించుచున్నాను.

పుడిసెడు నీళ్ళయ, కడుపెడన్న మొసంగు
అభివాద మొనరింప, నవని జాగిలి మ్రొక్కు
రాగిడబ్బియ, స్వర్ణము మారొసంగును
ప్రాణదాతకు నిజప్రాణమ్ము లర్పించు
గోరంత మేల్సేయ, గొండంత ప్రతిసేయు
నయవిదుడగువాని నడవడి యిద్ది
అందర నొకభంగి నరయు ధన్యాత్ము
డపకారికిం బేర్మి నుపకృతి సల్పు.

వ్యాసరచనకు

1. గాంధిజీ దాదియగు రంభ వారి కేమి ఉపదేశించెను? ఉత్తరవయస్సున వారి కది యెట్లు ఉపకరించెను?

2. రామాయణముపట్ల గాంధిజీ తలం పెట్టిది? చిన్ననాటనే వారి కా తలపు ఎట్లు కలిగెను?

3. అన్యమతములపట్ల చిన్ననాట గాంధిజీ తలపు లెట్టివి? అందులకు గారణము లెవ్వి?

4. జీవితపర్యంతము వారి కట్టి తలపే యున్నదా ? వారి ప్రార్థనలను, భజనలను గూర్చి నీకు దెలిసిన దానిని తారకాణ యొనర్పుము.

5. సార్వకాలికముగ ఆచరింపనగిన ధర్మసారమునుగూర్చి గాంధిజీ ఏమి చెప్పును ?

8

ఇంగ్లాండు ప్రయాణమునకు సన్నాహము

స్కూలు చదువు ముగిసినంతనే నన్ను గురుజనము కళాశాలలో చేరుమనెను. బొంబాయిలో, భావనగరములో కళాశాల లున్నవి. వానిలో రెండవదానియందు వ్యయము తక్కువగును గాన నేనందు శ్యామలదాస కళాశాలలో చేరితిని. ఆరునెలలు ముగియుసరికి నా కా చదువు గష్టమనిపించుటచే మానుకొని ఇల్లు చేరితిని.

మావుజీదేవు అను బ్రాహ్మణపండితు లొకరు మా కుటుంబమునకు చిరమిత్రము. ఆయన లోకజ్ఞుడు. మా తండ్రియనంతరముగూడ మా క్షేమ మరయుచుండెడివాడు. నేను సెలవులలో ఇంటికడ నుండగా ఆయన ఒకనాడు వచ్చి మా యన్నతో, అమ్మతో బ్రసంగించుచు నా చదువుసంధ్యలను గూర్చి విచారించెను. నేను శ్యామలదాస కళాశాలలో చేరితినని విని ఆయన యిట్లనెను : "కాల మిపుడు మునుపటి

హైస్కూలులో సభ కూడెను. నే నేవియో నాలుగు కృతజ్ఞతా వాక్యములు వ్రాసి చదువబోవగా నాకు నిలువెల్ల కంపము జనించి, తలత్రిప్పు పుట్టి, నోట మాట వెడలదయ్యెను.

మా యమ్మ యనుజ్ఞను, ఆశీర్వాదమును తలదాల్చి, పసిగ్రుడ్డు తోడి బాలెంతను నా యిల్లాలిని వీడ్కొలిపి, సంతోషముమై బొంబాయికి పయనమైతిని. బొంబాయికి చేరినంతట మా యన్న స్నేహితులు జూను, జూలై మాసము లలో దక్షిణమహాసముద్రము సంక్షుభితమై యుండునుగాన క్రొత్తగా సముద్రయానము చేయనున్న నన్ను నవంబరు నెలలోగాని పంపవలదని హితము చెప్పిరి.

ఇంతలో మా కులమువారు నా సముద్రయానమును గూర్చి గందరగోళము పడిరి. కులపెద్దలందరు రచ్చదీర్చి నన్ను బిలిపించిరి. నా కంతటి ధైర్య మెట్లుకలిగెనో ఎరుగను గాని నిర్భీకుడనై వారి యెదుట నిలిచితిని. సభాపతియగు సేటు మాకు దూరబంధువు, మా యయ్యకు గావలసినవాడు. ఆయన యిట్లడిగెను :

'మన కులస్థులు నీ సీమప్రయాణము అయుక్త మను చున్నారు. ద్వీపాంతరయానము మనకు నిషిద్ధము. అచటి కేగినపై కులభ్రష్టత తప్పదని మేము వింటిమి. తెల్లవాండ్రతో పంక్తిభోజనమును, పానమును అచట తప్పవట. ఇందుల కేమందువు ?'

నే నిట్లంటిని : 'సముద్రయానము మన మతమునకు విరుద్ధమని నాకు తోచుటలేదు. నే నచట చదువుకొనుట

కేగుచుంటిని. మీరు భయపడుచున్న మూటిని ముట్టనని మాయమ్మతో నే నింతకుమున్న శపథ మొనర్చితిని. ఆ శపథమే నన్ను గాపాడగలదు.'

అంతట నా సేటు 'నీ కచట మతభ్రష్టత తప్పదని మా యభిప్రాయము. మీ తండ్రి నాకు ఆప్తుడని యెరుగుదువు. నామాట విను' మనెను.

నేను 'మీరు మా యయ్య కాప్తులు, నాకు బూజ్యులు నని యెఱుగుదును. కాని నా సీమప్రయాణము తీర నిశ్చయ మైనపిమ్మట నిపు డేమి చేయగలను? మా తండ్రికి స్నేహితుడు, ఉపదేష్టయునగు బ్రాహ్మణ పండితుడు ఈ పనిలో దోషము లేదని చెప్పెను. మా యమ్మయు, నన్నయు గూడ నా కనుజ్ఞ యిచ్చి' రంటిని.

'నీ కొలమువారి యాజ్ఞను ధిక్కరింతు వన్నమాట?'

'నే నింతకంటె ఏమి చెప్పగలను? కొలమువారి కిందు జోక్యము తగదనుకొందును.'

సేటు కీ మాటలపై గోపమువచ్చెను. నన్ను నాలుగు తిట్టెను. నేను మిన్నక కూరుచుంటిని. అంతట సేటు 'ఈ కుఱ్ఱవానికి నేటినుండి కులమున వెలి. ఈతని సాగనంపు వారికి, ఆడుకొనువారికి తలకు రూపాయి పావులా దండుగ విధించుచుంటి' నని ఆంక్ష పెట్టెను.

ఈ ఆంక్షకు నేను జలింపలేదు. సేటువద్ద సెలవు గైకొంటిని. మఱి మా యన్న దీని కేమనునోయని కించ

పడితిని గాని ఆయనయు నా భాగ్యవశమున సుస్థిరుడై, 'సేటు అంతుల కేమిలెమ్ము. నీవు వెళ్ళుట కనుజ్ఞ నిచ్చు చున్నా' నని నాకు ధైర్యము చెప్పుచు లేఖ పంపెను.

శ్రీ త్ర్యంబకరాయ ముజుందారు అనెడి జునఘడ వకీలు గదిలో నాకును ఓడలో చోటు ముందుగనే మాటాడి నా స్నేహితులు కుదిర్చిరి. నన్ను గనుపెట్టియుండు డని ఆయనకు న న్నొప్పగించిరి. ఆయన లోకజ్ఞుడు, వయఃపరిపాకము, ననుభవము గలవాడు. లోక మన నేమో యెరుగని పదునెన్మి దేండ్ల కుఱ్ఱవాడను నేను. శ్రీ ముజుందారు కుఱ్ఱవాని కోసము బెంగవలదని నా స్నేహితులకు జెప్పెను.

సెప్టెంబరు నాలుగవదినమున ఎట్టకేలకు బొంబాయి నుండి పయనమై పోయితిని.

వ్యాసరచనకు

సీమప్రయాణమునకు ముందు గాంధిజీ పడిన యగచాట్లను వర్ణింపుము.

9

ఓడలో

నాకు ఆంగ్లమున ప్రసంగ మలవాటులేదు. మేమున్న రెండవ అంతస్థునందు శ్రీ ముజుందారు తప్ప నందరు

ఆంగ్లేయులే. వారు నన్ను బలుకరింపగా నాకు తిన్నగా నర్థమయ్యేడిదికాదు. వారికి బదులు పలుకుటెట్లు? ప్రతి వాక్యము మనసులో కూడబలికికొనక నోరు విప్పుట కుదుర దాయెను. కత్తులతో, ముల్లుగరిటెలతో తినుట యలవాటు లేక, చేసిన పదార్థములలో మాంసముకలియని వేవో తెలియక, అడుగుటకు ధైర్యము చాలక అగచాట్లుగా నుండెడిది. కావున పంక్తిలో మేజాపై నెన్నడుతినక, నాగదిలోనే కూరుచుండి, వెంటదెచ్చుకొనిన పండ్లతో, మిఠాయిలతో కాలము గడపుచుంటిని. శ్రీ ముజుందారు కిట్టి బాధలేదుగాక ఆయన అందరితో కలసిమెలసిపోయి, ఓడ పైతట్టున దిరుగుచుండ నేను పవలెల్ల నా గదిలోనే ఒంటరినై యుండి, జనము పలుచగానున్న సమయముచూచి తట్టుపై కేగుచుంటిని. శ్రీ ముజుందారు నన్ను అందరితో కలసి మెలసి మాటలాడుచుండు మని హెచ్చరించెను. లాయర్లకు వాచాలత లేకున్న సాగదనిచెప్పి, తన ప్లీడరీ యనుభవము నేకరువు పెట్టెడివాడు. అవసరమైనపుడెల్ల కొంకక ఆంగ్లమున ప్రసంగింపుమనియు, అన్యభాషగావున తప్పులు దొరలుట తప్పదనియు నుపదేశించెను. ఏమిచెప్పినను నా బిడియము నన్ను వదలదాయెను.

ప్రయాణికులలో నొక ఆంగ్లేయుడు, నాకంటె నయస్సున బెద్దవాడు, కలిపిగోలుతనమున నన్ను బలుకరించి 'నీ వెచటి కేగుచుంటివి, మీరెవరు, ఏమి తినుచుంటివి, నీ కింతటి బిడియమెందులకు?' అని ప్రసంగములోనికి దించి,

'మాతో కలిసి భుజింతువుగాని రమ్ము' అని పిలిచెను. 'నేను మాంసము తినను' అను నా పట్టుదలకు నవ్వెను. ఎఱ్ఱ సముద్రము చేరిన పిమ్మట నొకనాడు స్నేహపూర్వకముగా నిట్లు చెప్పెను: 'ఇందనుక ఎట్లో జరిగిపోయినదిగాని బిస్కే అఖాతము చేరినపై నీ పంతము సాగదు. ఇంగ్లండు చేరినపై నిక చెప్పెడి దేమి, ఆ చలిలో మాంసము దినకున్నచో బ్రదుకుటే దుర్ఘటము.'

నేను 'మాంసము మానియు నచట బ్రదుకవచ్చునని వింటినే' యంటిని. అతడు 'అవి కల్లమాటలు. నా యెరుకలో అచట నట్లు బ్రదుకువా రెవ్వరును లేరు. మరి యొకటి చూడుము. నేను మద్యము త్రాగుచున్నను నిన్ను త్రాగుమంటినా? మాంసము మాట వేరు. అది మానినచో బ్రదుకలేవు' అనెను.

'నా హితము గోరి చెప్పుచున్న మీ మేలు మరవలేను. నేను మాంసము ముట్టనని మా యమ్మకడ ప్రమాణము చేసితిని. కావున దాని జోలికేగను. మాంసము దినకుండ ఇచట బ్రదుకుట పొసగనిచో దిరిగి మా దేశమునకే పోదును' అంటిని.

బిస్కే అఖాతము ప్రవేశించిన పిమ్మట గూడ మద్య మాంసములతో నాకు అక్కర కలుగలేదు. మేము సౌదాంప్టను చేరినది శనివారమున నని జ్ఞాపకము. ప్రయాణము పొడవునను నేను నల్లని యుడుపులే ధరించితిని. ఓడ

దిగినపుడు తెల్లని దుస్తులు తాల్చినచో దగియుండునని యెంచి, నా స్నేహితులు కుట్టించి యిచ్చిన తెల్లని ఉన్ని దుస్తులతో ఓడనుండి బయల్వెడలితిని. అది సెప్టెంబరు నెల యగుటచే నేనుతప్ప మరి యెవరు నట్టి యుడుపులు ధరింప కుండుట గనుకొంటిని. ప్రయాణికు లందరును తమతమ సామానులు గ్రిండ్లే కంపెనీ వశమున విడిచి చనుచుండుట యరసి నేనును నా పెట్టెలు బేడలు తాళపుచెవులతోగూడ ఆ కంపెనీ కప్పగించి వెడలిపోతిని. లండనులో విక్టోరియాహోటలు అనుకూలముగా నుండునని ఓడలో కొందరు చెప్పగా విని నేనును శ్రీ ముజుందారును అచట బస చేసితిమి. ఇతరు లెవ్వరును ధరింపని ఆ తెల్లని డిరెసు (Dress) వలన నాలో నాకే సిగ్గు తలముక్క లగుచుండెను. గ్రిండ్లే కప్పగించిన మా సామానులు మరునాడాదివారము గాన, సోమవారమువరకు రావని హోటలులో దెలియవచ్చెను. ఇక నా దురవస్థ ఏమని చెప్పను !

సౌదాంప్టనునుండియే డాక్టరు మెహతాకు నేను తంతి వార్త పంపియుంటిగాన నాటిరేయి ఎనిమిదిగంటలవేళ కాయన వచ్చి నన్ను సాదరముగ బలుకరించెను. తెల్లని నా యున్ని వేషము గాంచి నవ్వుకొనెను. ఆయనతో మాటలాడుచు అనాలోచనగా ఆయన టోపీని చేతిలోనికి దీసికొంటిని. దాని మెత్తదనమునకు ఆశ్చర్యపడుచు చేతితో దానిపై ఎగదువ్వినంతట అందలి రోమరాజి వాలుదప్పి వాటము చెడెను. డాక్టరు మెహతా మొగము చిట్లించుచు నావంక గనుగొని ఆ పని

నుండి నన్ను వారించెను. కాని జరుగవలసిన పొరబాటేమో జరగిపోయినది. ఇకముందట్టి ఎడ్డెపనులు చేయకుండ నా ది మూదలింపైనది. "ఒరుల వస్తువుల నెన్నడు ముట్టకుము. క్రొత్తవారిని మనదేశమునందువలె ప్రశ్న లడుగకుము. బిగ్గరగా మాటలాడకుము. ఇచటివారిని మనదేశములోవలె 'అయ్యగారూ!' అని సంబోధింపకుము. ఇచట భృత్యులు మాత్రమే యజమానుల నట్లు పిలుతురు." ఇత్యాదిగా డాక్టరు మెహాతా నా కిచటి సదాచారముల నుపదేశించెను. ఈ హోటలు నివాసము అధికవ్యయ కారణముగాన ఎచటనైన గృహస్థులయింట నుండుట మంచిదియని కూడ ఆయన హితము చెప్పెను.

శ్రీ ముజుందారుకు, నాకుగూడ హోటలు నివాసము కష్టముగను, దండుగనూరిగను తోచినది. మాల్టానుండి మాతో గలిసి ప్రయాణముచేసిన సింధుదేశవాసితో శ్రీ ముజుందారునకు స్నేహమేర్పడెను. ఆయన లండనులో ప్రాతకాపగుటచే మాకు వేరుగా బస ఏర్పాటుచేయుదు ననెను. మేము వల్లె యంటిమి. సోమవారమున మా సామానులు వచ్చి చేరినంతనే హోటలుముడుపు చెల్లించి క్రొత్తగదుల కేగితిమి. హోటలుకు నేను మూడు పౌనుల ముడుపు చెల్లించితినని గురుతు. అంతటి సొమ్ము ఇచ్చునపుడు నాకు గుండెలావటించిపోయెను. నిజము నకు నా కచట నేమియు రుచింపమిచే, నే నా రెణ్ణాళ్లు ఉపవాసమే చేసితిని. నా కొక పదార్థము రుచింపక, మరి యొకటి అడిగినంతట ఆ రెంటికి నాపేర బద్దువ్రాసిరి. బొంబాయి

నుండి తెచ్చుకొనిన తినుబండములతోనే నేనచట పొట్టనింపికొనుటాయెను.

క్రొత్త గదులలో నివాసముగూడ నాకు సుఖముగా లేదు. మా యింటిపై, మా యమ్మపై నాకు బెంగ కలుగజొచ్చెను. రాత్రులు స్వగృహము తలపునకురాగా కన్నీరు గార్చుకొనుచు నిద్దురకు మొగమువాచిపోవుచుంటిని. నాయీ బాధ ఒరులతో జెప్పికొనుటెట్లు? చెప్పికొన్నను నాకీ బాధ ఆర్పుటకు, దీర్చుటకు నచట నెవరున్నారు? అచటి ప్రజలు, వారి యిండ్లు, నడవడి—అన్నియు నాకు క్రొత్తగా నుండెను. ఆంగ్లేయుల ఆచారకాండ నాకు సరిక్రొత్త యగుటచే నెప్పుడేమి పొరపాటు వచ్చునో యని గుండెలు బిదుకు బిదుకు మనుచునేయుండెను. దీనికిదోడు నా శాకాహార శపథ మొకటి. నేను తినదగిన పదార్థములుగూడ నాలుకకు రుచింపమిచే నాపని నూయియు గోయియు నన్నటు లుండెను. [illegible]ములో నివాసమూ, నాకు పడదయ్యెను; ఇంటికి మరలి పోవుటయూ, కానిపనియయ్యెను. 'తీర వచ్చితివికావున ఈ మూడేండ్లు కనులుమూసికొని గడపు' మని అంతరాత్మ ప్రబోధించెను.

ద్వితీయ భాగము: సీమలో విద్యాభ్యాసము

10

లండనులో

సోమవారమునాడు డాక్టరు మెహతా నాకొరకు విక్టోరియా హోటలు కేగెను. మే మటనుండి బస మార్చితిమని తెలిసికొని, మా క్రొత్తవసతి కేతెంచెను. నా గదిని, అందలి పరికరములను పరిశీలించి పెదవి విరిచెను. 'నీ కీ బస బాగుండ లేదు. మన మీ సీమకు వచ్చినది—విద్యాభ్యాసముమాట యెటులున్నను—ముఖ్యముగ నిచటి ఆచారవ్యవహారముల నలవరచుకొనుటకు. అందులకు ఎవరేని సంసారుల యింట నీ వుండవలయును. అట్టి యేర్పాటు కుదురులోపల నిన్నొక చోట నుంచెదను; నాతో రమ్ము' అనెను.

నేను 'మీదయ' యనుచు అందుల కంగీకరించి, ఆయన మిత్రుని గదులలోనికి బసను మార్చితిని. ఆ మిత్రుడు నన్ను మిగుల నాదరించి తన తమ్మునివలె చూచుకొనసాగెను. ఆంగ్లేయుల ఆచారవ్యవహారములను నాకు మప్పుచు. ఆంగ్లమున సంభాషించుట అలవాటుచేసెను. నాకు భోజనముతోడనే

పెద్దచిక్కు వచ్చిపడెను. తాలింపు వేయక, ఊరక ఉడికించిన కూరలు నాకు రుచింపవయ్యెను. ఏమిచేసిన నాకు హితమగునో ఆ యింటియామెకు తోచకపోయెను. ఉదయమున ఓట్లపిండితో జావ వండి పెట్టెడిది. దానితో కడుపు బాగుగా నిండుచుండెనుగాని మధ్యాహ్నము, రాత్రియు ఉపవాసప్రాయ మగుచుండెను. మాంసము తినుమని ఆ మిత్రము నాకు పదేపదే నచ్చజెప్పజూచెనుగాని నేను నా ప్రతిజ్ఞమాట చెప్పి మిన్నకుండెడివాడను. మధ్యాహ్నము, రాత్రియు నాకు కూరలు, రొట్టెతో మురబ్బాయు వడ్డించుచుండిరి. నేను మంచి భోజనపుష్టి గలవాడనుగాన వానితో కడుపు నిండెడిది కాదు. మారు వడ్డించుమనుట మరియాదకు లోపమనిపించెను. దానికి దోడుగా బన్ను రేయియు పాలు కరవయ్యెను. నా మిత్రుడీ యవస్థను జూచి పట్టజాలక ఒకనా డిట్లనియెను: 'నీవు నా సోదరుడవైనచో ఈపాటికి ఇంటికి పంపియుందును. ఇచటి స్థితిగతులు ఎరుగకముందు, చదువుసంధ్యలు లేని నీ తల్లితో చేసిన శపథమును పట్టుకొని కూరుచుండనేల? అది శపథమే కాదు. ధర్మశాస్త్ర మట్టి శపథమును పాటింపదు. అట్టి ప్రతినకై ఇట్టి పట్టు పట్టుట అజ్ఞానము. నామాట వినుము. ఈ పట్టు విడువవేని నీ విచట చేయునదియు సాధింపజాలవు. అవివేకముగా నీ వింతకుమున్ను మాంసము తింటివి. నీ కది రుచించెనంటివి. అక్కరలేని సమయమున నేమో మాంసము భుజించితివి. తినక తీరని దశ వచ్చినప్పుడేమో తినక మానుచుంటివి. నీ యభాగ్యము నేమందును!'

ఎంత చెప్పినను నేనుమాత్రము లొంగలేదు.

అహరహము నాతో నాత డిట్లు ఎంతగా వాదించినను నేను 'ససేమిరా' యనుచుంటిని. ఆతడు చెప్పుచున్నకొలది నేను బిర్రబిగియ జొచ్చితిని. దినదినము నీశ్వరుని వేడికొనుచు తదనుగ్రహపాత్రుడ నగుచుంటిని. నే నట్లు ప్రార్థించుట ఈశ్వరజ్ఞానముచే గాదు; ఏదియో భక్తి నాలో మెదల జొచ్చెను. చిననాడు నా దాది రంభ నాలో నాటిన బీజమే ఆ భక్తి.

నే నింకను తిన్నగా చదువు ధోరణిలో బడలేదు. స్వదేశమున నే నెన్నడు వార్తాపత్రిక చదివినవాడను గాకున్నను ఇచట క్రమముగా దాని నలవాటు చేసికొంటిని. పత్రికాపఠన మొక గంట లోపలనే ముగిసెడిది. పిమ్మట నగరమున దిరుగుచు శాకాహారశాలకొరకు వెదుకుచుండగా ఫారింగ్డను వీధిలో నది యగుపడెను. కోరిన వస్తువు చేతి కబ్బిన పసివానివలె నేను దానిని జూడగనే కొండ నెక్కితిని. లోన కేగుచుండ ద్వారముచెంత నద్దముల యరలో నున్న పుస్తకములు నా కంటబడెను. వానిలో సాల్టు అను నతడు శాకాహారమునుగూర్చి వ్రాసిన గ్రంథముం గాంచి ఒక షిల్లిం గిచ్చి దానిం గొని భోజనశాలలోని కేగితిని. సీమలో కడుగు పెట్టిన పిమ్మట నేను కడుపార భుజించిన దానాడే. పరమేశ్వరుడు నన్ననుగ్రహించెను.

సాల్టు రచించిన గ్రంథ మామూలాగ్రముగా జదివితిని. నా కది ఎంతయేని నచ్చెను. చేసిన బాసకొరకు మిన్నాళ్లు

దినుచున్న శాకాహారమును ఆ గ్రంథము చదివిననాటినుండి మనసారా వరించి కైకొనఁ జొచ్చితిని. మా యమ్మకు నేను మాట యిచ్చిన శుభదినము నా చల్లనివేళ స్మరించుకొంటిని. శాకాహార వరణమేమో జరిగినది కాన తత్ప్రచారమునకు నాటినుండి నడుము గట్టితిని.

11

ఆంగ్ల సభ్యతానుకరణము

నా మిత్రము నన్నుగూర్చి అలజడి చెందుచునే యుండెను. ఒకనాడు నాటకమును దిలకింతము రమ్మని నన్ను బిలిచెను. ప్రదర్శనము ప్రారంభమగులోపల హోల్బర్న్ హోటలులో భోజనమున కేగితిమి. అచట నేను బిడియము కొంటు పదార్థములనుగూర్చి ప్రశ్నలడుగకుండ భుజింతునని యనుకొని ఈ పన్నాగము పన్నెను. అచట చాలమంది భుజించుచుండిరి. మే మిరువురము నొక బల్లకడ గూర్చుంటిమి. ముందుగా 'సూప్పు' (పులుసు) వడ్డింపగా. అది దేనితో చేసిరో తెలియక, నా మిత్రుని ప్రశ్నించుటకు ధైర్యము చాలక, వడ్డించువానిని బిలచితిని. నా స్నేహితు డది కనుపెట్టి, కొరకొరలాడుచు 'ఎందుకు వానిని బిలిచెద' వనెను. నేను సంకోచించుచు 'ఈ సూప్పు శాకములతో చేసిరో, లేదో కనుగొనుటకు' అంటిని. అతడు 'నీవంటి ఎడ్డెమానిసి సభ్య

సమాజములో నుండదగడు. ఇచట మరియాదమై మెలగ నేరనిచో మరియొక హోటలులో భుజించి నాకొరకు వెలుపల వేచియుండు' మని కసరికొట్టెను. బ్రదుకు జీవుడా యనుచు నటనుండి వెడలి యేగితిని. ఆ ప్రాంతమున నున్న శాకాహారశాల మూసియుంటచే నాటిరేయి నా కుపవాసమే యయ్యెను. పిమ్మట స్నేహితుడు నేనును నాటకమున కేగితిమి. ఆతడు నా వెకలితనమునుగూర్చి ప్రసక్తి మరి తీసుకొనిరాలేదు. నాకుమాత్ర మేమిపని యని నేనును మిన్నకుంటిని.

మిత్రులమగు మా మధ్య నదియే తుదికలహము. దీనిచే మా మైత్రి కెట్టి పొరపొచ్చెమును కలుగలేదు. నాయెడ ప్రీతికతమున నేకదా ఆతడు నాకొరకు కింత ప్రయాసపడెనని గ్రహింపనివాడను గాను. మా తలపులలో, చేతలలో నున్న ఈ భేదముచే నా కాతనియెడ గౌరవ మతిశయించెను.

నేను శాకాహారియయ్యు, ఎడ్డెతనము నుజ్జగించి, సభ్యతా లక్షణముల నలవరచికొని నా చెలికానికి సంతోషముగూర్ప నెంచితిని. సభ్యజనమున పెద్దు గైకొనుటయను అశక్య కార్యమును సాధింప దొరకొంటిని.

బొంబాయిలో కుట్టించుకొన్న నా దుస్తులు ఆంగ్ల సమాజమున కనర్హములని యెంచి 'ఆర్మీ అండు నేవీ స్టోర్సు' లో క్రొత్తయుడుపులు గొంటిని. ఆ దినములలో విపరీతమగు వెలయిచ్చి 19 షిల్లింగుల కొక 'చిమ్నిపాట్' టోపీ విలిచితిని. అంతటితో తృప్తిచెందక లండనులో

నాగరజనావాసమగు బాండువీధిలో తయారుచేసిన సంజ యుడుపులకై పది పౌనులు పాడుచేసితిని. దాక్షిణ్యశాలియు, సుజనుడు నగు మా యన్నకడనుండి రెండుపేటల పైడి గొలుసును గడియారముకోసమై తెప్పించితిని. తయారు చేసిన కంఠబంధము (Neck-tie) ధరించుట మర్యాదాలోపము గావున దానిని స్వయముగా ముడివైచుకొను విద్య నభ్య సించితిని. స్వదేశమున మా యింటి మంగలి క్షురకర్మ చేయునపుడు మాత్రమే నాకు దర్పణ భోగము లభించెడిది. ఇచట బ్రతిదినము నిలువుటద్దము ముందు నిలిచి కంఠబంధము సర్దుకొనుటకు, పాపట చక్కదిద్దుకొనుటకు పది నిముసముల సేపు పదట గలియుచుండెను. నావి గరకు వెంట్రుక లగుటచే నవి చెప్పినట్లు వినవు. వానిని దువ్వెనతో (Brush) నణగ దువ్వుట కేనాటి కానాడు సదమద మగుచుంటిని. టోపీ తీసి నపుడు, ధరించినపుడెల్ల చేయి తనంతదా జుట్టును సర్దుకొన సాగెను. సభ్యజన మధ్యమున నున్నపుడెల్ల మాటిమాటికి చేతి కా పని తగులుచుండు సదాచారమునుగూర్చి మరి చెప్పెడి దేమి!

నాగరకముద్ర తాల్చుట కివి యన్నియు జాలవో యన్నట్లు ఆంగ్ల శిష్ట పంక్తికి నన్నర్హుని జేయుటకు వలయు నితరలక్షణములపై దృష్టి సారించితిని. నాట్యమును, పరాసు భాషను, వక్తృత్వమును నేర్చుట తప్పదని కొందరనిరి. పొరుగున నున్న పరాసు దేశమునందేకాక పరాసు భాష యూరపు ఖండమునం దంతట వాడుకలో నున్నది. యూరపునం దంతట సంచరించు నభిలాష నాకుండెను. నాట్యము నేర్చు బడిలో

చేరి మొదటి వాయిదా మూడు పౌనులు చెల్లించితిని. మూడు వారములలో నారు పాఠములు గాబోలు నేర్చుకొంటిని. కాని, తాళము తప్పకుండ నడుగులు వేయుట నా తలకు మించిన పనియని తేలిపోయెను. పియానో ననుసరింపలేకపోవుటచే తాళగతి నా కసాధ్యమాయెను. ఇక నా కేమి గతి? వెనుక నొక యోగి గోచిపాత నెలుకలు తినకుండ పిల్లిని పెంచెనట. పిల్లిపాలకై ఆవును పెంచెనట. 'కౌపీన సంరక్షణార్థమయం పటాటోపః' అని ఆ యోగి కిట్లు సంసారము పెరిగిపోయెనట. నాకును ఆ చందమే వచ్చెను. పాశ్చాత్య సంగీత రసజ్ఞతకై ఫిడేలు వాద్యము నభ్యసింపవలెనని నాకు దోచెను. అంతట మూడు పౌనుల కొక ఫిడేలు కొంటిని. తదభ్యాసమునకై ఇంచుమించు మరియంత సొమ్ము వ్యయ మొనర్చితిని. వక్తృత్వ మభ్యసించుటకై మూడవ గురువు నాశ్రయించి అవసర దక్షిణగా ఆయన కొక గినీ అర్పించితిని. బెల్ రచించిన 'స్టాండర్డు ఎలొక్యూషనిస్టు' అను గ్రంథము చదువుమని ఆయన చెప్పగా దానిని కొంటిని. ఆ గ్రంథమున 'పిట్టు' ఉపన్యాసము వల్లింపసాగితిని.

అంతట నాకీ శ్రమయంతయు దేనికి అను ఆలోచన పొడమెను.

నా బ్రతుకంతయు ఈ సీమలోనే తెల్లవారదుకదా. అట్టిచో ఆంగ్లభాషావాచాలతతో నా కేమిపని? నాట్యము నన్ను సభ్యజనుని చేయునా? ఫిడేలు స్వదేశముననే నేర్వ వచ్చునే! నేను విద్యార్జనకుగదా ఇచ్చటికి వచ్చినది? ముందు

బారిస్టరునగుట నాకు గర్తవ్యము. సచ్ఛీలము నన్ను శిష్టుని జేయగలదేని అది లెస్స. కాని నాడు నే నా యాస వదలుటే మేలు అనుకొంటిని.

ఇట్టి యాలోచనాపరంపరకు వశుడనై, వక్తృత్వోపాధ్యాయునకు నా తలపు దెలుపుచు నొక లేఖ వ్రాసి 'నా కింక ఆ పాఠములు వలదు ; నన్ను క్షమింపు' డంటిని. ఆయనకడ నేను రెండో మూడో పాఠములు మాత్రమే నేర్చితిని. నాట్యాచార్యునకుగూడ నట్టే లేఖ యంపితిని. ఫిడేలు గురువుచెంతకు నేనే వెళ్ళి నా ఫిడేలును వచ్చినంతకు అమ్మిపెట్టుడని చెప్పితిని. ఆమెకడ చనవుండుటచే నేను ఎండమావుల వెంటాడుచుంటినని తెలిసివచ్చె నంటిని. క్రొత్తదారి త్రొక్కవలయునను నా నిశ్చయము నామెయు బ్రోత్సహించెను.

ఆ వెఱ్ఱిలో మూడునెలలు కాబోలు పడియుంటిని. వేషమునుగూర్చిన పట్టింపు కొన్ని యేండ్లకుగాని వదలలేదు. అది మొదలు నేను విద్యార్థినైతిని.

12

మార్పులు

నేను నాట్యాదికము నభ్యసించునపుడు భోగపరాయణుడనై యుంటి ననుకొందురేమో! లేదు. అపుడు

గూడ నేను చేయుచుండిన వ్యయమును లెక్కచూచుకొనుచు మెలకువగనే చరించితినని పఠితలు గ్రహింపకపోరు.

జాగరూకతమై చరించుచుంటిని గనుకనే వ్యయకర్తనము తప్పదని తెలిసికొంటిని. వెంటనే సంసారుల యింట నుండుట మాని వేరుగా గదులు తీసికొన నిశ్చయించితిని. నా పనినిబట్టి వేర్వేరు చోటులకు బస మార్చుచున్నచో వ్యయము తగ్గి, లోకానుభవ మధికమగునని యెంచితిని. నాకు బనియున్న చోటికి బస దగ్గరగా నున్నచో బండ్లబాడుగ యుండదు. ఒక్క అరగంటలో నేను తేలికగా నడచిపోవచ్చును. ఆవరకెచటికేగినను బాడుగబండిమీదనే కావున కొంత దూరము నడచు నలవాటునకై వేరుగా తీరిక చూచుకొనుచుంటిని. ఇక నట్లుగాదు. వ్యయకర్తనమును, దినమున కేడెనిమిది మైళ్ళు నడచు వ్యాయామమును కలసివచ్చెను. చాలదూరమిట్లు నడచు నలవాటే సీమలోనున్న కాలమున నా యారోగ్యము గాపాడి. నన్ను దృఢగాత్రు నొనర్చెను.

పడుకకు, బనిపాటులకు సరిపడ రెండు గదు లద్దెకు దీసికొంటిని. ఇది యచటి రెండవదశ. మూడవ దశ ఇంకను ముందున్నది.

ఈ మార్పులచే ధనవ్యయము సగము తగ్గెను. ఇక కాలమును కూడ దీసికొనవలెను. బారిస్టరు పరీక్షకు జదువు శ్రమమంతగా నుండదని యెరుగుదును గాన దానికై కాలము పొదుపు జేసికొన బనిలేదు. ఆంగ్లభాషలో నాకు ప్రవేశము

ఎక్కువ. నా కది యెడతెగని బాధయైపోయెను. కావున లాయరు పరీక్షతోపాటు భాషాపండిత పట్టముగూడ సంపాదించుట మేలని యెంచితిని. ఆక్స్ఫర్డు కేంబ్రిడ్జి పరీక్షలను గూర్చి ఆలోచించితిని. స్నేహితులతో సంప్రదించగా — ఆ రెంటిలో నెచటికేగినను ధనవ్యయ మధికమగుటేకాక సీమలో నే ననుకొన్నదానికంటె ఎక్కువకాలము ఉండవలసి వచ్చునని తేలెను. 'నీ వేదేని గట్టి భాషాపరీక్ష ఈయనెంచినచో లండను మెట్రిక్యులేషన్ పరీక్ష యిచ్చుట యుక్త' మని ఒక స్నేహితుడు తెలిపెను. శ్రమ మధికమైనను వేరుగా ధనము వెచ్చింపకయే జ్ఞానసముపార్జనము లభించునుగాన ఇది బాగుగనే యున్నదనుకొని, పాఠ్యగ్రంథపట్టిక చూతును గదా, భీతి జనించెను. లాటినుభాషయు నొక నవీనభాషయు నేర్చుట తప్పనా పరీక్షకు. నేను లాటిను నెట్లు సాధింతును? ఒక మిత్రము 'లాటిను నేర్చుట లాయర్లకు ప్రయోజనకారి. ఆ భాష వచ్చినచో లా గ్రంథములు సులభముగా నన్వయించును. రోమన్ లా పరీక్షాపత్రమంతయు లాటిన్ మయమే. లాటిన్ నేర్చినవారికి ఆంగ్లభాష యనిన నల్లేరుపై బండిగా నుండును' అని బోధించెను. నా కా మాటలు నచ్చెను. ఎంతటి కష్టమైన నోర్చి లాటినుభాష సాధింప నిశ్చయించితిని. నే నెట్లును పరాసుభాష నేర్చుచుంటిని గాన నది నవీనభాషగా నుపయోగపడును. మెట్రిక్యులేషన్ విద్యను నేర్పు ఒక బడిలో చేరితిని. ఆరునెలల కొకతూరి జరిగెడి ఆ పరీక్షలకిక [illegible]నెలలే వ్యవధియుండెను. ఆ పని నా కసాధ్యముగా గనుపట్టెను. నేను వెంటనే విద్యాభ్యాసదీక్ష బూని

నిముషముగూడ వ్యర్థము గాకుండ కాలమును చదువునకై నియమించుకొంటిని. కాని, ఒకవంక లాటిను, ఫ్రెంచి భాష లభ్యసింపుచు, తక్కిన పాఠ్యవిషయములను సాధించుటకు నా బుద్ధిబలమును, ధారణాశక్తియు చాలవని తోచెను. తుదకు లాటిను పరీక్షలో భంగపడితిని. దానిచే కొంత దుఃఖము గల్గినను ధైర్యమును గోలుపోలేదు. లాటినుభాషపై అభిరుచి అలవడెను. పరాసుభాషనుగూడ మరొకతూరి చదువుట మంచిదే యనుకొంటిని. సైన్సు గణములో రసాయన శాస్త్రము నంతకుము న్నభ్యసించితినిగాని అందు ప్రయోగ భాగము లేమిచే నా కది రుచింపదాయెను. వస్తుతః ఆ శాస్త్రాభ్యాసము ప్రీతిజనకము కాదగినదే. స్వదేశమున తప్పనిసరయై చదివితినిగాన ఈ మెట్రిక్యులేషన్ పాఠ్యములలో దానిని వరించుటయ్యెను. రెండవతూరి పరీక్షకు దానిని విడచి కాంతిని, ఉష్ణమును పాఠ్యముగా వరించితిని. ఇవి తేలికగా నేర్వవచ్చునని వింటిని. ఆ మాట నిక్కమేయని తెలిసి కొంటిని.

ఈ నూతన యత్నమునకై ఇంకను పొదుపు చేయ సాగితిని. ఇచటి నా ధనవ్యయము మా సంసారపు టెత్తున కింకను మించియున్నట్లే కనుపించెను. నే నడిగినప్పుడెల్ల దాక్షిణ్యముమై సొమ్ము నంపుచున్న మా యన్న అచట నెన్నియగచాట్ల కగ్గమగుచుండెనో యని బాధపడితిని. ఇచట కొందరు నెలకు 8 మొదలు 15 పౌనులు దాక వెచ్చపెట్టువా రుండిరన్నచో వారికెల్ల విద్యార్థివృతు లేర్పడియున్నవి.

ACC. No. 7095
CLASS No. [illegible]
Date 26/8/97

LIBRARY

పొదుపుగా బ్రదుకుచున్నవా రిచట నెందరో యున్నారు. నాకంటెగూడ హీనముగా గడపికొను బీదవిద్యార్థు లెందరినో చూచితిని. పేదలుండు గూడెములో వారమునకు రెండు షిల్లింగుల బాడుగ కొక గదిలో నివసించుచున్నా డొక విద్యార్థి. 'లాక్ హారు' చవుక యంగడిలో రెండు పెన్నీల కింత రొట్టెదని, ఇంత కోకో త్రాగి యాతడు కాల మీదుచుండెను. ఆతనివలె నుండవలెనని కాదుగాని రెండు గదుల బదు లొకగదితోనే సరిపెట్టుకొని, కొంత సొంతవంట చేసికొనుట మంచిదని తోచెను. అట్లు చేసినచో నెలకు నాలుగైదు పౌనులు కలసివచ్చును. పొదుపరి బ్రదుకునుగూర్చిన గ్రంథములను నేను చదువుటయు దటస్థించెను. అంతట నొక్కగదియే అద్దెకు తీసికొని, కుంపటి నొకటి కొని, ప్రాతర్భోజనమును వండికొనసాగితిని. ఓట్లపిండి జావయు, కోకోకు నీటిని కాచుకొనుట కిరువది నిముసములకంటె ఎక్కువ వేళ పట్టదు. మధ్యాహ్నభోజన మెచటనేని చేయుచు, రాత్రులం దింటనే రొట్టె దిని కోకో త్రావుచుంటిని. ఈ విధముగా దినబత్తెమునకు 15 పెన్నీలు సరిపోవుచుండెను. ఆనాళ్ళలోనే శ్రమపడి చదువవలసి యుండెను; గాన నాకు కాల మధికముగా కలసి వచ్చుటచే పరీక్షలో విజయమందితిని.

ఈ పొదుపు జీవనముచే నేను గాసియపాలై తినని తలంపకుడు. ఈ మార్పులు నాకు హితమగుటేకాక మా సంసారపు బెత్తునకు గూడ తగియుండెను. తొల్లిటికంటె నా బ్రదుకు సత్యపూరితమై, ఆనందమున నోలలార్చెను.

ఈ పొదుపరతనమును, జీవనపద్ధతిలో మార్పును అవలంబించినపుడో, అంత కొక్కింత పూర్వమునో నా భోజనమున మార్పులు చేయ నారంభించితిని. ఇంటికడనుండి వచ్చు మిఠాయిని, తాలింపు దినుసులను వదలితిని. అంతకు మున్ను 'రిచ్మండు' లో నూరక యుడుకబెట్టిన ఆకుకూరలు సైపని నా కిపుడు మనసు మారుటచే తాలింపులపై నాస్థ వీడి పోయెను. ఇట్లు బహువార పరిశోధనము చేసినమీదట రుచి మనస్సులో నున్నదిగాని నాలుకలో లేదని తెలిసిపోయెను.

సొమ్ము పొదుపుచేయుటనుగూర్చికూడ నే నాలోచించుచునే యుంటిని. కాఫీ, టీ పానము చెరుపు చేయుననియు, కోకో మంచిదనియు నా కాలమున గొందరు చెప్ప దొడగిరి. దేహమునకు బుష్టినిచ్చు పదార్థమే తినవలయునను నిశ్చయము నా కేర్పడుటచే కాఫీ టీ లను నియమముమై వర్జించి కోకో త్రావుచుంటిని.

భోజనవిషయమున మరికొన్ని చిల్లర ప్రయోగములను గూడ సాగించి ఒకపుడు పిండిదినుసులు మానుచుంటిని. మరొకపుడు రొట్టెతో, పాలతో నుంటిని. ఇంకొకపుడు పాలతో, మీగడతో, గ్రుడ్లతో కాలక్షేపముచేసి చూచితిని. ఈ తుదిప్రయోగము పక్షముదినములకంటె నధికముగా నడవ లేదనుట గమనింపదగినది. పిండిదినుసులు మానదగునని చెప్పిన సంస్కారులు గ్రుడ్లను మిక్కిలిగా కొనియాడి, అవి మాంసములో చేరవని చెప్పిరి. అండభక్షణముచే జీవహింస

కలుగుట లేదని కనుపడుచుంటచే, నా ప్రతినను లక్షింపక, గ్రుడ్లను భక్షింప జొచ్చితిని.

ఈ నా ప్రతిజ్ఞాభంగము తాత్కాలికమే. నా చేసిన శపథమునకు క్రొత్తగా వ్యాఖ్యాన మొనర్చుట నాపని కాదు. ఈ ప్రతిన చేయించిన మా తల్లి వ్యాఖ్యానమే నాకు ప్రమాణము. గ్రుడ్లుగూడ మాంసమనియే ఆమె మతమని నే నెరుగుదును. నా ప్రతిన కిదియే యర్థమగు నని తట్టినంతనే గ్రుడ్లచే జీవించు పరిశోధనమును కట్టిపెట్టితిని.

క్రొత్త బిచ్చగాడు ప్రొద్దెరుగడన్న చందమున నే నీ శాకాహార ప్రచారోత్సాహముచే మా పేటలో నొక సంఘమును స్థాపించితిని. కొంతకాల మా సంఘము చక్కగా నడచినట్లే నడచి కతిపయ మాసములలో నస్తమించెను. మాటిమాటికి బసమార్చు నలవాటుచే నే నా పేటనుండి వెడలి పోవుటయు నొనగూడెను. స్వల్పకాలికమగు నీ యనుభవ లేశముచే నూతన సంస్థల నెలకొల్పి వానిని నడపు శిక్షణము నాకు లభించినట్లయ్యెను.

2990
M's. Junior College
BANGALORE-42

13

బిడియమే నా డాలు

శాకాహార సంఘమున నేనును కార్యనిర్వాహకుడనై సమావేశము లన్నిటికి హాజరగుచుంటినేకాని ఎన్నడు నోరు

విప్పిన పాపమునఁ బోలేదు. దక్షిణాఫ్రికాలో నన్ని బిడియము కొంత వదలినను పూర్తిగా నన్నది యెన్నఁడును విడువలేదు. ముందుగా వ్రాసిపెట్టుకొనకయే ఉపన్యసించుట నా కశక్యమై పోయెను. క్రొత్తవారియెదుట పెదవి విప్పుట కెపుడును నాకు సంకోచమగుటచే ఉపన్యసింపకుండ తప్పించుకొనుచుంటిని.

నలుగురిలో నపుడపుడు నగుబాటుపాలు సేయుటతప్ప ఈ బిడియమువలన నాకు వచ్చిన నష్టమేమియు లేదు సరిగదా నిజమున కది లాభదాయకమే యయ్యెను. ప్రసంగవేళ కలుగు ఈ సంకోచము తొల్లి చికాకు కలిగించినను నేఁడది సంతోషప్రదమైనది. భావములను నిగ్రహించుకొను అలవాటు నేర్పి నా కీ బిడియము మహోపకారమొనర్చెను. మితభాషి మాటలలో భావదారిద్ర్య మెన్నఁడు నుండదు. ప్రతి మాటయు నాతడు తూచి వాడును. కావున బిడియమే నా పాలిటికి డాలైనది. నాకది అంతఃపరిపాకము ఘటించి సత్యసాక్షాత్కారమునకు దారిచూపినది.

14

భిన్నమత పరిచితి

సీమలో నా నివాసమునకు రెండవయేఁడు నిండుతరియందు నా కిరువురు దివ్యజ్ఞాన సామాజికులు పరిచితులైరి.

వా రిరువురు నన్నదమ్ములు, బ్రహ్మచారులును. ఎడ్విను ఆర్నాల్డు రచించిన 'సాంగ్ సెలెస్టియల్' అను భగవద్గీతను వారు పఠించుచుండిరి. దాని మూలమును వారు నాతో చదువుమనిరి. మూలమునుగాని గుజరాతి గీతలుగాని నే నెన్నడు చదివినవాడనుగామి వా రట్లు కోరినంతట నా కెంతో సిగ్గు పొడమెను. ఉన్న నిజము వారికి వచించి, వారితో గీతలను పఠించుట నా కిష్టమే యంటిని. సంస్కృత ప్రవేశము నా కంతంతమాత్రమే యైనను, ఆంగ్లగ్రంథము మూలముతో నెచట భేదించునో గ్రహింపగల నంటిని.

ద్వితీయాధ్యాయమున—

'ధ్యాయతో విషయాన్ పుంస స్సంగ స్తేషూపజాయతే
సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోభిజాయతే

క్రోధాద్భవతి సమ్మోహ స్సమ్మోహాత్ స్మృతి విభ్రమః
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశా త్ప్రణశ్యతి'

అను శ్లోకములు రెండును నా మనస్సున నాటుకొని నేటికిని నా చెవులలో ప్రతిధ్వనించుచున్నవి. అమూల్యమగు నా గీతాశాస్త్రముపట్ల నానాట నాకు గౌరవము వృద్ధియై, సత్యదర్శనమున కట్టి గ్రంథము మరిలేదని నేటికి దృఢవిశ్వాస మేర్పడినది. చీకట్లు నన్నావరించిన ఘటికలందెల్ల నా గ్రంథము చేసిన మే లింతంత కాదు.

ఈ 'సాంగ్ సెలెస్టియల్' రచించిన ఎడ్విన్ ఆర్నాల్డు వ్రాసిన 'లైటాఫ్ ఏషియా' యను బుద్ధచరితమునుగూడ ఆ సోదరులు నన్ను జదువుమనిరి. అంతకుమున్నా గ్రంథము

నెరుగను. భగవద్గీతలపైకంటె నా కా గ్రంథముపట్ల ఎక్కువ మక్కువ జనించెను. దానిని చదువ మొదలిడి ముగించకుండ విడువలేనైతిని. శ్రీమతి బ్లావట్స్కి రచించిన 'కీ టు థియాసఫీ' అను గ్రంథమునుగూడ. ఆ సోదరులు చెప్పిరమీదటనే చదివి నట్లు ఆదకు వచ్చుచున్నది. ఆ గ్రంథపఠనముచే నాకు హిందూమత గ్రంథములు పఠించు నభిలాష జనించెను. హిందూమతము మూఢవిశ్వాసపూర్ణమని క్రిస్టియనుమత బోధకులు చేసిన బోధలెల్ల ఆ గ్రంథపఠనముచే పటాపంచలైనవి.

మాంచెస్టరువాసి యగు నొక క్రైస్తవ సుజనునితో నా కా కాలముననే శాకాహారగవసతియందు పరిచితి యేర్పడెను. ఆయన క్రైస్తవ మతమునుగూర్చి నాకు బోధించెను. నేనును రాజకోటయందలి నా యనుభవము నాయనకు వినిపించితిని. అది విని ఆయన చాల వ్యథచెంది, 'నేను శాకభక్షకుడను. మద్యము ముట్టను. క్రైస్తవులు చాలమంది మద్యమాంస ములు సేవింతురు, నిజమేకాని అవి శాస్త్రవిహితములుగావు. బైబిలు చదివిచూడుడు' అనెను. నేను వల్లె యనినంతట ఆయన నా కొక బైబిలుప్రతి నొసగెను. నే నది చదువ నారంభించితిని గాని 'పాత నిబంధన' (Old Testament) పూర్తిచేయుట నావలన గాలేదు.

క్రొత్తనిబంధన (New Testament) యట్లుగాక నా కాస్థాజనక మయ్యెను. అందలి 'పర్వతశిఖరోపదేశము' (Sermon on the Mount) నా హృదయము నట్టె కైవస మొనర్చుకొనెను. గీతలతో దానిని పోల్చి చూచితిని.

'పాపమునకు కెదురొడ్డకుడు. కుడిచెంపపై గొట్టినచో నెడమ చెంపను త్రిప్పుడు. మీకంచుకము హరించినవానికి పంచె గూడ నిచ్చివేయుడు. ఇది నా యుపదేశము.' ఇత్యాది వాక్యములు నా కపారానందము నొడగూర్చెను. 'పుడిసెడు నీ రిచ్చినవానికి కడుపెడు భోజన మిడు' మన్న శ్యామలభట్టు సుభాషితము నాకు జ్ఞాపకము వచ్చెను. గీతలు, లైటా ఫేషియా, సెర్మన్ ఆన్ ది మౌంటు — ఈ మూడింటి ఉపదేశములకు నా అకృతబుద్ధి ఏకవాక్యత ఘటింప దొరకొనెను. త్యాగమే పరమధర్మమని నా హృదయమునకు వచ్చెను.

నే నొకవంక పరీక్షలో నెగ్గవలసియున్నదిగాన మత గ్రంథములతో నా కప్పటి కింతకంటె గాఢపరిచితి కవకాశము లేకపోయెను. ఇంకను అట్టి గ్రంథములు పఠించి ముఖ్య మతము లన్నిటితో బరిచితి సంపాదించు ఆస్థమాత్రము నా కుదయించెను.

బైబిలులో ప్రాతనిబంధన, క్రొత్తనిబంధన యని రెండు భాగము లున్నవి. మొదటిభాగమున ఏసుక్రీస్తునకు పూర్వమందలి కాలమును దెలుపు అనేక గ్రంథము లున్నవి. ఏసుక్రీస్తునకు పిమ్మటి కాలపు గ్రంథములు రెండవభాగమున నున్నవి. వానిలో మొదటి నాలుగింటిని 'సువార్త' లందురు. ఏసుచరిత్రము, నుపదేశములు వానియందే యున్నవి. 'సెర్మన్ ఆన్ ది మౌంటు' మాథ్యూసువార్తలో 5 మొదలు 7 వ అధ్యాయములందు గలదు.

తృతీయ భాగము : ఇండియాలో బారిస్టరుగా

15

స్వ దే శా గ మ న ము

నేను పరీక్షలో నెగ్గితిని. 10-6-1891 న బారిస్టరు పట్టము పొందితిని. మరునాడు హైకోర్టులో చేరి, ఆ మరునాడు మాతృభూమికి బయలుదేరితిని.

విద్యార్జనము చేసితినన్న మాటయేకాని నా నిస్సహాయతకు, భీతికి మేరలేదు. లాయరుపని చేయుటకు నా కర్హత లేదని తోచెను. లా గ్రంథములు చదివితినేకాని కోర్టులో వాదించుట నేర్వలేదు. ఇంతకు, హిందూదేశమందలి హిందూ లా, మహమ్మడన్ లా నా చదివినవికావు. ప్లయింటు (నివేదన పత్రము) వ్రాయుటెట్లో నే నెరుగను. నాకు దారి తెన్ను తోచలేదు. ఈ వృత్తిచే మొదలు నా పొట్ట గడచునో, లేదో యను సంశయములో బడితిని.

నా పెద్దయన్న బొంబాయి రేవులోనికి నా కెదురు వచ్చెను. మా యమ్మ నెపుడు చూతునాయని నేను బెంగ పెట్టుకొంటిని. నేను సీమలోనుండగనే ఆమె మరణించెను.

విదేశముననుండగా నా కా దుర్వార్త వినుపింపదగదని మా యన్న నా కది తెలుపడాయెను. ఇది విని నా గుండెలు చెదరిపోయినవి. మా జనకుని మృతిచే నా కింతటి దుఃఖము కలుగలేదు. నేను పెట్టుకొన్న ఆశలన్నియు భగ్నమై పోయినవి. ఐనను నే నొడలుమరచి, వాదెరచి ఏడ్వలేను. కనుల నీరు కనుల గ్రుక్కికొంటిని. ఎప్పటి వలెనే లోకయాత్రలో బడితిని.

నా ద్వీపాంతరయాత్రచే మాకొలమున రేగిన చిచ్చు చల్లారనే లేదు. కొలమువారు రెండుగా చీలిరి. ఒకరు నన్ను తమలో గలిపికొని, రెండవారు వెలిగానే యుంచిరి. నన్ను వెలివేసినవారిలో జేరుటకు నే యత్నింపను లేదు; నన్నింత పెట్టిన ఆ కులస్వాములయెడ ఈసు వహింపను లేదు. వారు నన్ను నిష్టునిగా జూచుచున్నను వారి మనస్సుల కేమి నొప్పి కలుగునో యని నేను తొలగి మెలగుచుంటిని. వారి ఆంక్షలన్నిటికి నేను తలయొగ్గితిని. అత్తమామలు మున్నగు బంధువులుగాని, నా అక్కయు బావయుగాని తమ పంక్తిని నాకు భోజనమిడరాదు. వారి యిండ్ల నేను జలమేని ముట్ట దగదు. వీరందరు చాటుమాటున నన్నాదరింపనెంచిరి కాని బహిరంగముగ చేయుగూడని పని చాటుగా నొనర్చుట కే నంగీకరింపనైతిని.

నే నిట్లు జాగరూకతమై చరించుటచే కులమువారివలన నా కెట్టి యిక్కట్టును గలుగలేదు. నన్ను బహిష్కృతునిగా నెంచుచుండినవారుగూడ నాయెడ దాక్షిణ్యమునే వహించి

యుండిరి. కులమునకు నావలన గావగినది లేకున్నను వారు నా కుపకరించుచునే యుండిరి. కొలమునకు ఎదు రొడ్డకుండుట చేతనే ఈ సత్ఫలితము కలిగెనని నేను విశ్వసింతును. అట్లు కాక నాకు వెలిచెల్లదని. నేను వివదించినను నా పక్షమునకు గొందర ద్రిప్పుకొనుటకై కొలమున నింకను చీలికలు కల్పించి నను, కొలమువారికి ఆగ్రహము కల్పించినను వారు నాపై పగబట్టి ప్రతిక్రియ చేయుటయు, నే నీ కొట్లాట సుడిగుండము లలో జిక్కుకొనుటయు తటస్థించెడిది.

రాజకోటలో నేను ప్లీడరుపని చేయబూనినచో నవ్వులపా లయ్యెడివాడను. వకీలువృత్తి మొగమెరుగని నాకు మామూలు కంటె పదిరె ట్లధికముగా ఫీజు కావలెనన్నచో నాచెంతకు వచ్చుటకు కక్షిదారులు బుద్ధిహీనులు కారుగదా.

బొంబాయిలో కొంతకాల ముండి, హైకోర్టు వ్యవహార ముల నాకళించుకొని, హిందూదేశపు లా ను గ్రహించి, అచట నేమైన బేరము తగిలినచో రాబట్టుకొమ్మని స్నేహితులు కొందరు చెప్పిరి. ఆ ప్రకారము బొంబాయి కేగితిని గాని అచట నానాటికి పెరుగు వ్యయమునకు దగిన ఆయము గానక నాల్గయిదు నెలలు గడపుటే దుర్ఘట మయ్యెను. ఆనాళ్ళ లోనే మమిబాయి అనునామె నా కొక 'స్మాలుకాజ్' దావాలో వకాల్తా ఇచ్చెను. ఆ బేరము దెచ్చిన పొసుగుడు గానికి (Tout) కొంత సొమ్ము ముట్టజెప్పవలెననిరి. నేను ససేమిరా యీయనంటిని. వాని కేమియు నీయకయే ఆ దావా చేపట్టితిని. అది చాలా చిన్నదావా గావునను, ఒక

నాటనే తేలిపోవునది గనుకను ముప్పది రూప్యముల ఫీజు కోరతిని.

స్మాల్ కాజు కోర్టుకేగుట నా కదియే తొలిసారి. వాది సాక్షులను నే నడ్డుప్రశ్నలు వేయవలసియుండెను. అట్లు ప్రశ్నించుటకై లేచుసరికి నా కాళ్లు చల్లబడెను. నాకు తల త్రిప్పు జనించి, కోర్టంతయు గిర్రున తిరుగుచున్నట్లుండెను. అడుగుట కేమియు దోచుటలేదు. జడ్జి లోలోన నెంత నవ్వికొనెనో, తోడి వకీళ్ళు నా దురవస్థ కెంతగా నానందించిరో! నా కేమియు గనుపించలేదు. ఆసనమున గూలబడి ఆ వ్యవహారము నడపుట నావలన గాదనియు, శ్రీ పటేలుకు వకాల్తా యిమ్మనియు, నా కిచ్చిన సొమ్ము తిరిగి యిత్తుననియు ఏజెంటుతో చెప్పితిని. రు. ౫1 లు ఫీజిచ్చి శ్రీ పటేలుకు వకాల్తా యిచ్చిరి. ఆయన కా వ్యవహారము బాలక్రీడాప్రాయము.

నేను చరచర కోర్టు వెడలిపోతిని. ఆ దావా గెలిచెనో, ఓడెనో నా కది పట్టలేదు. నేను సిగ్గుచే మ్రగ్గిపోవుచుంటిని. దావాలు నడపుటకు దగిన ధైర్యము వచ్చువరకు మరి వకాల్తా పుచ్చుకొనరాదని నిశ్చయము చేసికొంటిని. నా కింగ్లీషులో మంచి ప్రవేశ మబ్బినది కావున ఏదైన స్కూలులో జేరి మెట్రిక్యులేషన్ చదువు బాలురకు ఇంగ్లీషు బోధించుట మంచి దని తోచెను. ఆ విధముగా కొంచెం సంపాదించినచో వ్యయభార మించుక తగ్గును. 'దినమున కొకగంట ఇంగ్లీషుబోధించు అధ్యాపకుడు కావలెను. జీతము రు. 7౫ లు' అను ప్రకటన మొకటి కనులబడెను. పేరుపొందిన హైస్కూలునుండి వెలువడిన

దా ప్రకటన. ఆ యుద్యోగమునకు విన్నప మంపుకొన్నంతట నాకు బిలుపువచ్చెను. నేను కొండంత యాసతో నేగితిని. నేను బి. ఏ. పట్టభద్రుడను గానని తెలిసినంతట ఆ స్కూలు ప్రిన్సిపాలు 'మీరు మాకు బనికిరారు' అని సవిచారముగ దెలిపెను.

'నేను లండను మెట్రిక్యులేషన్ పరీక్షలో నెగ్గితిని. లాటిన్ భాషలో పరీక్ష యిచ్చితి' నంటిని.

'నిజమేకాని మాకు పట్టభద్రుడు కావలెను' అనె నాయన.

ఇక చేసెడి దేమున్నది? భగ్నాశుడనై తిరిగి వచ్చితిని. మా యన్న మనసుగూడ కలతపడెను. బొంబాయిలో నిక కాలహారణము చేసి ప్రయోజనము లేదని యిరువురము కూడ బలికికొంటిమి.

అంతట బొంబాయికి నీళ్ళు వదలి, రాజకోట కేగి, అచట బల్ల కట్టి, సొంత ఆఫీసు పెట్టితిని. ఏదో కొంత మెరుగుగనే అచట కాలక్షేప మగుచుండెను. దరఖాస్తు విన్నపముల ముసాయిదాలతో నెలకు సగటున మున్నూరు రౌప్యములు రాలుచుండెను. దీని కంతకు గారణము నా ప్రయోజకత్వము కాదు. నా సోదరుని భాగస్వామి అచటి వకీళ్ళలో ప్రాతకాపు గావున ముఖ్యమైన అర్జీలు మున్నగునవి ఆయన పెద్ద పెద్ద బారిస్టర్లకు బంపుచున్నను పేదపార్టీల అర్జీలు నాకడకు బంపెడివాడు. అదియే నా రాబడికి మూలము.

16

ప్రథమాఘాతము

పోర్‌బందరు రాణావారు గద్దెనెక్కుటకు మున్ను మాయన్న వారికి సలహాదారుగా నుండి సాచివ్యము నెరపెను. రాణావారి కా కాలమున చెడుసలహా యిచ్చెనని యిపుడు మాయన్నపై దోషారోపణము జరిగెను. ఆ వ్యవహారమును విచారణచేయుచున్న పొలిటికల్ ఏజెంటుకు మాయన్నయెడ దుర్భావ మంకురించెను. సీమలో నున్నపుడా యేజెంటుకూ, నాకూ ఎరుకగలదు. నా కాయనకడ సీమలో కొంతచనవు గూడ ఏర్పడెను. ఆ యెరుకను పురస్కరించుకొని నే నా యేజెంటుచెంత కేగి మాయన్నపై నేర్పడిన దుర్భావమును తొలగించి మంచి చేసికొనుట యుక్తమని మాయన్న తలపోసెను. నా కిది మనస్కరించినది కాదు. ఆ యల్ప పరిచితిని నే నిట్లుపయోగించుకొనుట కూడనిపని. నా సోదరుడు దోషి యగుట నిక్కమేని నా పురస్కృతి యేమి చేయగలదు? అట్లుకాక నిర్దోషి యగునేని తగురీతిని విన్నప మంపికొని ఏమి కానున్నదో ఎదురు చూడవలెను. మా యన్నకు ఈ నా వైఖరి నచ్చలేదు. 'నీకు లోకానుభవము చాలదు. కథియవాడను నేమనుకొంటివో; ఇచట పలుకుబడి లేనిదే పనులుగావు. నాకు తమ్ముడవై యుండి, నీ కెరుక యున్న అధికారితో నాకొరకు కొంత మంచిమాట చెప్పక తప్పించుకొనుట యుక్తము కాదు' అనెను.

ఆయనమాట కాదనలేకపోతిని. ఈ పనిబూని ఆ యధికారిచెంత కేగుట తగదని యెఱిగియు, నా గౌరవమునకిది లోపమని తెలిసియు, ఆయన యెదుట బడితిని. ముందుగా ప్రాతపరిచయము దిరుగవేసితిని. వెంటనే నా కిది యుంగ్లండు గాదు, కథియవాడ యని తెలిసివచ్చెను. సెలవులతరి ఆయన సీమలో నుండుటకు, నిచట అధికారపీఠమున నుండుటకు భేదమున్నదని గ్రహించితిని. మా పూర్వపరిచితి నాతడు కాదనలేదుగాని దాని నాదకు తెచ్చుటచే బిఱ్ఱబిగిసెను. 'ఆ పరిచితిని దుర్వినియోగము సేయవచ్చితివా ?' యను భావ మాతని మోమున అచ్చుగ్రుద్దినట్లు వ్రేలుచు. ఆ బిఱ్ఱబిగియుటను వ్యాఖ్యానించుచుండెను. అట్లయ్యు, నేను వచ్చిన పనిని గూర్చి చెప్ప నారంభించితిని. నే చెప్పుదానిని కడముట్ట విను నోపికలేక ఆతడు 'మీ యన్న నట్టి తంత్రగొట్టు. నే నింక నేమియు విననొల్లను. వినుటకు దీసుబడియు లేదు. మీ యన్న చెప్పికొనవలసిన దేమేని యున్నచో దగు మార్గమున జెప్పికొనవచ్చును' అనెను. నా కా మాటలు చాలును. జరుగవలసిన శాస్తియే నాకు జరిగెను. స్వార్థపరత గ్రుడ్డిది కాన నేనింకను నేమో చెప్పదొడగినంతట ఆతడు లేచి, 'మీ రింక వెళ్లవచ్చు' ననెను.

'నన్ను పూర్తిగా చెప్పనిండు' అంటిని. ఆయన మండిపడుచు నౌకరును బిలిచి నన్ను వెలుపలికి బంపుమని చెప్పెను. నే నింకను వెనుకముందాడుచుండగా నౌకరు నా బుజముపై చేతులువైచి గది వెలుపలికి బంపెను.

ఏజెంటు సాహెబు, నౌకరు నటనుండి వెడలిపోయిరి. నేనును సెగలు పొగలు గ్రక్కుచు వెడలిపోతిని. 'మీరు నన్ను అవమానించితిరి. మీ నౌకరుచే నన్ను గెంటించితిరి. దానికి పరిహారము సేయనిచో మీమీద తగు చర్య జరుపవలసి యుండును' అని చీటివ్రాసి పంపితిని.

వెంటనే ఒక అశ్వికునిచే నాతడిట్లు బదులువ్రాసి పంపెను :

'మీరు విరసముగా వర్తించితిరి. నేను వెడలిపొమ్మన్నను పోకుంటిరి. నేను చేయునది లేక నౌకరును పిలిచి మిమ్ము బయటికి పంపుమంటిని. ఆతడు 'వెడలిపొం'డని చెప్పినను మీరు కదలలేదు. కావున నాతడు తగుమాత్రము ఒత్తిడిచేసి మిమ్ము వెలుపలికంపెను. మీ చిత్తమువచ్చిన చర్య జరుపవచ్చును'

ఈ ప్రత్యుత్తరము నందుకొని, లజ్జాభిహతుడనై యింటికేగి జరిగినదంతయు మా యన్నకు వినుపించితిని. ఆయనయు బాధపడెను. నా కెట్టియూరట చెప్పుటకు ఆయనకు దోచలేదు. ఏజెంటు సాహెబుపై జరుపదగిన చర్యను మిత్రులగు వకీళ్ళతో సంప్రదించి చూచెను. ఆ సమయముననే శ్రీ ఫిరోజిషా మెహతా బొంబాయినుండి రాజకోట కేదో పనిమీద వచ్చియుండెనుగాని క్రొత్తబారిస్టరగు నేనాయన దర్శనమునకేగ సాహసించుటెట్లు? బొంబాయినుండి వారిని తీసికొనివచ్చిన వకీలుచేతికి నా వ్యవహారపత్రము లిచ్చి శ్రీ మెహతా ఏమి ఆలోచన చెప్పునో కనుగొనుడని పంపితిని.

'చాలమంది వకీళ్ళకు, బారిస్టర్లకు నిట్టివి క్రొత్తవికావు' అని గాంధితో చెప్పుము. 'ఆతడు క్రొత్తగా ఇంగ్లండునుండి దిగినవాడు గావున ఇంకను క్రాగి చల్లారలేదు. బ్రిటిషు అధికారుల వైఖరి ఆతడెఱుగడు. ఏదో ఇంతసంపాదించుకొనుచు సుఖముగా నిచట నుండదలచినచో ఈ కాగితములు చించివైచి అవమానమును దిగమ్రింగుట మంచిది. ఏజెంటు సాహెబుపై చర్య జరిపినచో నది యెదురుతిరిగి తనకే చెరుపు ఘటించునని చెప్పుము. ఆతని కింకను లోకానుభవము చాలదు' అని శ్రీ మెహతా చెప్పి పంపెను.

శ్రీ మెహతా చెప్పిన సలహా విషప్రాయమైనను మ్రింగక తప్పదయ్యెను. నాకు ప్రాప్తించిన ఈ యవమానమూరకపోక నాకు లాభమే చేకూర్చెను. 'ఇక నెన్నడు ఇట్టి అనుచితమున కొడిగట్టి మైత్రిని దుర్వినియోగము చేయను' అని ప్రతిన బూనితిని. దాని నెన్నడు నింతవఱకు భంగము చేయలేదు. ఈ యాఘాతముతో నా జీవితము క్రొత్తదారి బట్టెను.

మొదలు నే నా యధికారిచెంత కేగుట దోసమే కాని ఆత డంత దురహంకృతిని, అసహనమును తాల్చదగినవాడు కాదు. నన్ను వెలుపలికి గెంటించుట బొత్తిగా కూడనిపని. తెలవారినది మొదలు నాకున్న వ్యవహారమంతయు ఆయన కోర్టులోనే. కాని ఆయన యనుగ్రహము నే సంపాదింప నొల్లను. నీపై చర్య జరుపుదునని ఆయనను బెదరించి మిన్నకుండను నేరను.

ఈ లోపల కథియవాడునందలి రాచకార్యముల నాకళించుకొన నారంభించితిని. కథియవాడు చిన్న చిన్న సంస్థానముల కూడలి యగుటచే నది కుతంత్రముల కాలవాలముగా నుండెను. సంస్థానపతులందరు పరాధీనజీవనులై, కొండెగాండ్రకు, బట్టుపాగడ్తలకు చెవి యొగ్గుచుండిరి. ఏజెంటుసాహెబు నౌకరునుగూడ వారు మంచి చేసుకోవలసినదే. ఇక శిరస్తాదారుమాట చెప్పెడిదేమి? సాహెబు కంటె నాతడే మేటి. సాహెబు కాతడే కనులు, చెవులు నై దుబాసిగా వ్యవహరించును. ఆతని చిత్తమున కెదురు లేదు. సాహెబు రాబడికంటె ఆతనిదే అధికమని ప్రతీతి. ఇందతిశయోక్తి కొంతయున్నను ఆతని జీతమునకు, అనుభవించు రాచభోగమునకు బొత్తు లేదు.

ఈ విషవాయువుల మధ్య నే నెట్లు మనగలనో తోచలేదు. నే నెట్లు దిగులుపడి కూర్చుండుట మా యన్న గ్రహించెను. ఏదైన యుద్యోగము దొరికినచో నే నీ కుతంత్ర జంజాలమునుండి బైటపడవచ్చునని మేమిద్దరము నసుకొంటిమి. మంత్రిత్వమో, న్యాయాధిపతిత్వమో కావలెనన్నచో కుతంత్రము కావలెను. పోనీ. ప్లీడరు వృత్తినే చేకొందుమనిన ఏజెంటు సాహెబుతో వైరమాయెను. ఎటు జూచినను దారిలేదు.

ఇంతలో పోర్బందరునందలి మేమన్ వర్తకులు మా యన్న కొక జాబు వ్రాసిరి: 'దక్షిణాఫ్రికాలో మాకొక వ్యవహార మున్నది. మాది పెద్ద వ్యాపారము. 40,000 పౌనుల

సొమ్ము రాబట్టుకొనుటకు అచటి కోర్టులో మాది ఒక దావా చిరకాలమునుండి నడచుచున్నది. అచట పెద్ద వకీళ్ళకు, బారిష్టర్లకు వకాల్తా యిచ్చితిమి. మీ తమ్ముని అచటి కంపినచో ఆయనకు, మాకుగూడ ఉపయోగ ముండును. మా వ్యవహారము నచటి లాయర్ల కాయన మాకంటె బాగుగా విప్పి చెప్పగలడు. క్రొత్తదేశములు చూచి, క్రొత్తపరిచితుల సంపాదించుకొనుట కాయన కిది యదను.'

నే నంతట వారిని 'నే నచట నెంతకాలము ఉండ వలెను? నా కేమి యిత్తురు?' అని యడిగితిని.

వారు 'అచట నొకయేడున్నచో జాలును. మొదటి తరగతి ప్రయాణవ్యయము, అచటి సకలవ్యయములు భరించి 105 పౌను లిచ్చెద' మనిరి.

నేను దీనికి సమ్మతించి వెళ్లుట ఆ వ్యాపారుల నౌకరుగా వెళ్లుట యగునే కాని బారిష్టరుగా వెళ్లుట కాజాలదు. మరి యీ దేశమును వీడిపోవలెనన్నచో మార్గాంతరము లేదాయెను. క్రొత్తసీమలు చూచి, నూతనానుభవము గడించవచ్చునుగదా యని మనసు వేగ పెనలాడెను. అదియునుగాక నేను 105 పౌను ఇంటికి పంపవచ్చును. దానిచే మాయన్నకు సంసారభారము కొంత తగ్గును. కావున వారితో మరి బేరసారములకు దిగక, సమ్మతించి మూట ముల్లె కట్టి ప్రయాణమునకు సిద్ధమైతిని.

చతుర్థ భాగము : దక్షిణాఫ్రికాలో

17

దక్షిణాఫ్రికా చేరుట

నేటాలు భూమికి దర్బాను రేవుపట్టణము. దానిని నేటాలు రేవనుటయు గద్దు. సేట్ అబ్దుల్లా రేవులో నా రాక ప్రతీక్షించుచుండెను. నూతనాగతులకోసము ఓడలోనికి వచ్చినవారిని చూడగా, అచటివారికి హిందూదేశస్థులయెడ గౌరవ మంతగా లేదని తెలిసివచ్చెను. సేట్ అబ్దుల్లా నెరిగియున్నవా రాయనను చిన్నచూపుగా జూచుట నా కన్నుల బడినంతనే నా మనసు చివుక్కు మనెను. అబ్దుల్లా కది అలవాటైపోయెను. 'ఈత డెవ్వడా?' యని కొందరు నాయెడ వింతచూపులు బరపుచుండిరి. అచటి భారతీయుల వేషమునకంటె నాది విలక్షణముగా నుండెను. నేను ఫ్రాకు కోటు ధరించి, వంగదేశపు పగ్రీ వంటిది తలకు జుట్టుకొని యుంటిని.

నేను చేరిన రెండు మూడు నాళ్ళకు అబ్దుల్లా నన్ను దర్బాను కోర్టుకు దీసికొనియేగెను. అచట చాలమందికి

న న్నెరుకపరచి తన లాయరు (Attorney) చెంత నన్నాసీను నొసర్చెను. మాజిస్ట్రేటు కొంతసేపు నావంక తేఱిపాఱజూచి తుదకు నన్ను తలపాగ తీసివేయుమనెను. నేను నిరాకరించి, వెడలిపోతిని.

ఇచటగూడ నాకు కలహము తప్పదుగాబోలు ననుకొంటిని. ఈ తలపాగ వృత్తాంతమునుగూర్చి పత్రికలలో ప్రకటించితిని. కోర్టులో నేను దానిని ధరించుట యుచితమే యని అందు సమర్థించుకొంటిని. ఈ విషయమై పత్రికలలో సందడి రేగెను. పత్రికలు నాకు 'పిలువని చుట్టము' అని పేరు పెట్టెను. ఈ రీతిగా దక్షిణాఫ్రికాలో నే నడుగిడిన కొలది నాళ్ళకే ప్రసిద్ధుడనైతిని. ఆ దేశమును నేను విడిచివచ్చునందనుక నేను తలపాగను విడువలేదనియే చెప్పవచ్చును.

18

ప్రిటోరియాకు

'దావా వ్యవహారము సిద్ధము చేయుటకు మీరుగాని, మీ ప్రతినిధి గాని వెంటనే ప్రిటోరియాకు రావలసిన' దని సేటు అబ్దుల్లా కచటి లాయర్లు జాబు వ్రాసిరి. అబ్దుల్లా ఆ జాబు నాచే చదివించుకొని 'మీరు వెళ్ళుదురా ?' యని అడిగెను. 'దావానుగూర్చి నా కింకను ఆకళింపు కాలేదు. దాని

స్వభావమునకు ముందు నివసింపు' డంటిని. సేట్జీ యంతట తన గుమాస్తాచే న్యూసపేపరునంతయు ఆకళింపు చేయించెను.

సత్కారము చేసిన పదునెనిమిది దినములకే మరల పయన మైతిని. నాకు మొదటి తరగతి టికెట్టు కొనిరి. మరి 5 షిల్లింగు లిచ్చి పడుకకుగూడ ఏర్పాటు చేయుదునని అబ్దుల్లా చెప్పగా పట్టుదలచే, అభిమానముచే 5 షిల్లింగులు పొదుపుచేయు లోభముచే నాకు పరపు వలదంటిని. అబ్దుల్లా 'మీ రీపటి పద్ధతు లెరుగరు. ఇది ఇండియా కాదు. నామాట వినుడు. వ్యయమగునని మీరు వెనుదీయకుడు. సొమ్మునకు మాకు లోపము లేదు' అని చాలదూరము చెప్పెను నేను 'నా కొరకు అలజడి చెందకుడు' అని ఆయన హితోక్తి విననైతిని.

రాత్రి 9 గంటల వేళ మా ట్రెయిను నేటాలు రాజధాని యగు మారిట్స్‌బర్గ్ చేరెను. కావలసినవారి కిచట పడుకకు పరపు లిత్తురు. రైల్వే యుద్యోగి యొకడు వచ్చి 'మీకు పరపు కావలెనా?' యని నన్నడిగెను. 'నాచెంత పరపున్నది లెమ్ము' అంటిని. అతడు వెడలిపోయెను. పిమ్మట నొక ప్రయాణీకు డేతెంచి నన్నెగాదిగ బరికించెను. నేను నల్లని వాడనగుట చూచి చిడిముడిపాటున దిగిపోయి, ఒక రిద్దరు ఉద్యోగుల వెంటబెట్టుకొని వచ్చెను. వారు కొంతసేపు మిన్నకయున్నంతట మరి యొక యుద్యోగి యేతెంచి, నాతో 'నీవు సామానుల పెట్టెలోనికి బోయి కూర్చుండు' మనెను.

'నాది మొదటి తరగతి టికెట్టు' అంటిని.

ఆతడు 'కావచ్చును. నువ్వు సామానుల పెట్టెలో కూర్చుండవలెనని చెప్పుచుంటిని గదా' యనెను.

'దర్బానులో నన్నీ పెట్టెలో ఎక్కనిచ్చిరి. నే నిందు లోనే వెళ్ళవలయు' నని బదులాడితిని.

'అట్లు వీలుపడదు. నీ వీ పెట్టెనుండి దిగిపోవలెను. లేనిచో పోలీసులచే నిన్ను గెంటింతును.'

'అట్లే చేయుడు. నా యంతట నే దిగిపోను.'

పోలీసుకానిస్టేబులు వచ్చెను. నా చేయి పట్టుకొని బయటికి లాగెను. నా సామానులుగూడ దింపివేసెను. నేను మాత్రం మావలిపెట్టె నెక్కుటకు నిరాకరించి అచటనే యుంటిని. రైలు వెడలిపోయెను. నా సామాను లక్కడనే విడిచి, చేసంచితో వెయిటింగు గదిలోని కేగి కూరుచుంటిని. రయిల్వే అధికారులు నా సామాను తమ యధీనమునం దుంచికొనిరి.

అది చలికాలము. దక్షిణాఫ్రికాలోని ఆ యున్నత భూములలో చలిగాలి పండ్లు కొరుకుచుండెను. నా చలికోటు పెట్టెలలో నున్నది. దానిని తీసికొందుననిన చో మరల నవమానింతురేమో యను సంశయముచే నట్లే వణకుచు ముడిచికొని కూరుచుంటిని. ఆ గదిలో దీపముగూడ లేదు. నడిరేయివేళ నెవరో ప్రయాణికుడు గదిలోనికి వచ్చి నన్ను బలుకరించెను గాని నే నాతనితో సంభాషించెడి స్థితిలో లేను.

ఇపుడు కర్తవ్యమేమి? ఇచట నా హక్కులకొరకు బోరాడుదునా, వచ్చినదారనే ఇండియాకు మరలిపోదునా?

ఈ యవమానములను లెక్కింపక, ప్రిటోరియా వెళ్ళి, అచట నా పని ముగించుకొని పిమ్మట స్వదేశమున కేగుదునా? నేను వచ్చినపని పూర్తిచేసికొనకుండ ఇండియాకేగుట పిరికితన మని పించుకొనును. నా కిచట దాపురించిన యగచాట్లు, ఇచటి వారికి మేనిలో జనించిన వర్ణవిద్వేషవ్యాధికి బాహ్యలక్షణములు మాత్రమే. చేతనైనచో నేను కడగండ్ల కోర్చి ఈ వ్యాధిని నిర్మూలింపవలెను. ఈ వర్ణద్వేషముచే గొన్ని నష్టకష్టము లొదవుచున్నవి. వానిని దొలగించుకొన్నచో జాలును.

తరువాత రానున్న రైలుబండిలో ప్రిటోరియా కేగ నిశ్చయించితిని. రైల్వే సర్వాధికారికి మరునాడుదయమున పెద్ద తంతివార్త పంపి, ఆ విషయము సేట్ అబ్దుల్లాకుగూడ దెలిపితిని. వెంటనే అబ్దుల్లా ఆ యధికారిని కలిసి మాటలాడెను. రైల్వే అధికారి తన యుద్యోగుల చర్యను సమర్థించి, గాంధిని గమ్యస్థానము చేర్చు ఏర్పాటు చేయవలసినదిగా స్టేషన్ మాస్టరుకు ఆజ్ఞ యిచ్చితినని అబ్దుల్లాకు తెలియజెప్పెను. అబ్దుల్లా యంతట మారిట్స్‌బర్గులోని భారతీయ వర్తకులకును, ఇతర ప్రదేశములందున్న మిత్రులకును గాంధిని గలిసికొని, వారి సౌకర్యములు విచారింపుడని తంతివార్త లంపెను. ఆ వర్తకులు స్టేషనులో నన్ను జూడవచ్చిరి. ఇటువంటి కష్టములు తామందరు ననుభవించినవే యనియు, నేను క్రొత్త వాడనియు నాకు ఊరడింపు మాటలు చెప్పిరి. ఒకటి రెండు తరగతులలో ప్రయాణముచేయు భారతీయులకు తెల్ల బాటసారులచే, రైల్వే యుద్యోగులచే నిట్టి కష్టము లున్నవే యనిరి. ఆ కష్టగాథా

శ్రవణముచే బవలు గడచినంతట రైలుబండి వచ్చెను. అందు నాకొరకు జోటు ప్రత్యేకించి యుంచిరి. దర్బానులో వలదని నిరాకరించిన పడుక యేర్పాటునకిచట టికెట్టు కొంటిని.

తెలవారుసరికి రైలు చార్లెస్టవును చేరినది. అట నుండి జొహాన్సుబర్గు కప్పటికి రైలుమార్గము లేదు. అంచె బండ్లలో ప్రయాణము చేయవలెను. ఆ బండి త్రోవలో స్టాండర్టనునందు రాత్రివేళ ఆగును. అంచెబండికి నావద్ద టికెట్టు కలదు. మారిట్జుబర్గులో నొకదినము ఆగిన కారణమున నా టికెట్టు రద్దుకాలేదు. చార్లెస్టవునులో అంచెబండ్ల యేజెంటుకుగూడ అబ్దుల్లా తంతివార్త పంపెను.

ఆ యేజెంటు ఏదియో మిషతో నన్ను వారించు వాడై, నా క్రొత్తవాలకమును గనిపెట్టి 'నీ టికెట్టు రద్దయి పోయినది' అనెను. నేను తగురీతి బదులు చెప్పితిని. ఇంతకు, బండిలో జోటులేక కాదు; అతడట్లు చెప్పుటకు కారణము వేరుగా నున్నది. బాటసారులు బండిలో కూర్చుండవలెను. నేను 'కూలీని' క్రొత్తవాడను గావున బండిలో తెల్ల వాండ్రతో గలసి కూర్చుండ దగదని శకటపాలకుడగు తెల్ల వానికి దోచెను. బండి తోలెడివాడు కూర్చుండు చోటున కిరువైపుల రెండు ఆసనము లున్నవి. అందొకదానిపై ప్రతి దినము గూర్చుండు శకటపాలకుడు తా నానాడు లోపల గూర్చుండి, తన చోటు నా కొసగెను. ఇది అన్యాయము, అవమానము నని యెరిగియు, నేను మిన్నకుండుటే మేలని కొంటిని. నేను బలాత్కారముగ లోపల జొరబడలేను. కాదు

కూడదని జగడమునకు దిగుదునేని బండివాడు బండి నన్ను విడిచి వెడలిపోవును. మరల నొకదినము వృథాగా గడచి పోవును. ఆ మరునాడు మరల నేమి మునుగునో దైవమునకే యెరుక. కావున లోలోపల గుమిలిపోవుచు బండితోలెడివాని చెంత గూరుచుంటిని.

మూడు గంటలగునటికి బండి పార్దకాఫ్ చేరెను. శకటపాలకునకపుడు పొగ ద్రాగుటకు, గాలి పోసికొనుటకు నా చోటు కావలసి వచ్చెను. బండివాని నడిగి మురికి గోనె గుడ్డ తీసికొని, దానిని పాదములుంచుకొనుచోట పరచి, శకట పాలకుడు నాతో 'సామీ! నీ వా గోనెగుడ్డపై గూర్చుండుము. నేను బండివానిచెంత గూరుచుందు' ననెను. ఆ యవ మానము భరింపలేక, భయముచే నిలువున కంపించుచు, 'లోపల గూరుచుండవలసిన వానిని నీవే మొదలిచట గూరు చుండ బెట్టితివి. నే నా యవమానము సహించితిని. నీ విప్పుడు పొగ ద్రాగవలసి నన్ను నీ పాదములచెంత గూలబడుమను చున్నావు. వలసినచో లోని కేగుదునుగాని ఇచట గూరు చుండ' నంటిని.

ఈ వాక్యము లతికష్టముమీద నా నోట వెడలుచుండ గనే యతడు నామీదికి వచ్చి నా గూబ లదరునట్లు నెడపెడ వాయింప జొచ్చెను. నా జబ్బ పట్టుకొని క్రిందికి లాగ దొడగెను. నేను బండి చువ్వలను గట్టిగా పట్టుకొని, మణికట్టు యెముకలు విరిగినను సరియే, ఆ పట్టు విడువగూడదని నిశ్చయించుకొంటిని. వాడు నన్ను దుర్భాష లాడుచు.

పడలాగుచు, గొట్టుచుండ నేను కదలక అట్లే యుంటిని. ప్రయాణికు లిది యెల్ల మిన్నక చూచుచుండిరి. వాడేమో బలశాలి, నేను దుర్బలుడను. బాటసారులలో గొందఱికి జాలి పుట్టి 'ఓయీ! ఆతని వదలుము. ఎందు కట్లు కొట్టెదవు? ఆతనివలన దోసములేదు. ఆత డన్నది యథార్థమే. అచట గూరుచుండలేనిచో ఆతని లోనికి రానిమ్ము' అని కూకలిడిరి. వాడు 'ప్రమాదమేమియు లేదు' అని యఱచెనుగాని ఇంచుక సిగ్గుపడి నన్ను గొట్టుటమాని, నా చేతిని వదలిపెట్టెను. నన్ను మరల గొన్ని దుర్భాషలాడి బండివానికి రెండవదెస గూరుచున్న హాటెంటాటు నౌకరును క్రింద గూరుచుండనిడి, తాను వాని చోటునకేగి ఆసీనుడయ్యెను

బాటసారు లెవరిచోటునకు వారేగిరి. ఈలవైచినంతనే బండి సాగిపోయెను. నా గుండెలు దడదడ కొట్టుకొనుచుండెను. ప్రాణములతో గమ్యము చేరుదునో. లేదో యనుకొంటిని. వాడు ఎడనెడ నా దెస చురచుర జూచుచు, తర్జని ఝళిపించుచు, 'స్టాండర్టను చేరనిమ్ము. నిన్నేమి చేయుదునో' అని గుసగుస లాడుచుండెను. పరమేశ్వరా! నన్ను రక్షింపుమని వేడుకొనుచు నేను మాఱుపలుకకుంటిని.

స్టాండర్టను చేరుసరికి చీకటిపడెను. అచట కొన్ని భారతీయ ముఖములు కనుపించినంతట 'బ్రదుకుజీవుడా' యనుకొంటిని. నేను బండి దిగగానే వారు 'మేము మీకొఱకే వచ్చితిమి. అబ్దుల్లాదాదా తంతివార్త పంపెను. ఈసాసేటు

దుకాణమునకు కేగుదము రండు' అనిరి. నేను సంతోషముపై వారి వెంట సేట్ ఈసాహాజీసుమార్ దుకాణమునకు కేగితిని.

అంచె బండ్ల కంపెనీ యేజెంటుకీ వ్యవహారము దెలుపుట మంచిదని యెంచి, జరిగిన దంతయు నొక జాబున లిఖించి 'మీ వ్యవహర్త నన్నిట్లు బెదరించె' నని కూడ తెలియజేసితిని. మరునాడు మరల బండి బయలుదేరునపుడు అందరితోపాటు నన్ను లోపల గూరుచుండ నిచ్చునట్లు మాటయిుండని కోరితిని. ఏజెంటు నాకిట్లు జవాబు వ్రాసి పంపెను: 'స్టాండర్టను నుండి పెద్దబండి బయలుదేరును. నిన్నటి మానిసి యచట నుండడు. క్రొత్తవాండ్ర యధీనమున బండి సాగును. అందరితోపాటు మీరు బండిలోనే కూరుచుండు ఏర్పాటు చేయుదుము.' దీనిచే నాకు కొంత యూరట లభించెను. నాపై చేయి చేసికొన్న వానిపై చర్య జరుపు ఆలోచన నాకు లేదు గాన ఆ యత్యాచార కథ యంతటితో ముగిసెను.

వేకువనే ఈసా సేటు తమ వారిలో నొకనిచే వెంట నంప బండికడ కేగితిని. నాకు మంచిచోటే చూపించిరి. ఆ రాత్రికి సుఖముగా జోహాన్సుబర్గు చేరితిని.

స్టాండర్టను చిన్న పల్లె. జోహాన్సుబర్గు పెద్దపట్టణము. అబ్దుల్లా అచటికిగూడ తంతివార్త పంపెను. మహమ్మదు కాసిం కమ్రుద్దీను దుకాణమునకు కేగుమని నాతో చెప్పెను. కమ్రుద్దీను సేటు నాకొరకు తన మనిషి నంపెను గాని నన్నాతడు, ఆతని నేను గురుతింపనైతిమి. అచట హోటళ్ళ

పేర్లు నే నెరుగుదును గాన అం దొకచో బసచేయ నెంచి గ్రాండు నేషనల్ హోటలుకు గుఱ్ఱపుబండి మాటలాడుకొంటిని. అచటి కేగి హోటలు యజమానితో నా కొక గది ఇమ్మంటిని. ఆత డొక్క క్షణము నా దెస నిదానించి చూచి, 'గదులు నిండి పోయినవి. ఏమి చేతు' నని నొచ్చుకొనుచు నన్ను సాగ నంపెను. నే నంతట బండివానిని సేట్ కమ్రుద్దీను దుకాణము నకు బండి పోనిమ్మంటిని. అచట నాకొఱకు కనుపెట్టుకొని యున్న అబ్దుల్లనీసేటు నన్ను మిగుల నాదరించెను. హోటలులో జరిగిన ముచ్చట దెలుపగా విని ఆయన 'హోటలులో మీకు బస యిత్తురని ఎట్లనుకొంటి' రని పిఱుగబడి నవ్వెను.

'ఎందుకీయ' రంటిని.

'నెమ్మదిమీద అంతయు మీకే తెలియును.'

అనుచు సేట్జీ 'ఇటు వినుడు. రేపు మీరు ప్రిటోరియాకు వెళ్ళవలసియున్నది. మూడవతరగతి బండిలోనే పోవలసి యుండును. ట్రాన్సువాల్ స్థితిగతులు నేటాలుకంటె పాడుగా నుండును. ఒకటి రెండు తరగతుల టిక్కెట్లు భారతీయులకు మొదలే ఈయరు' అని తెలిపెను.

రైల్వే నిబంధనలు తెప్పించి వానిని పరిశీలించి చూడగా నందొకించుక పొరసందు కనిపించెను. ట్రాన్స్వాల్ ప్రా శాసనములలోని భాష అస్పష్టముగా దోషజుష్టముగా నుండును. రైల్వే నిబంధనల భాష అంతకంటె అధ్వాన్న ముగా నుండును.

నే నంతట సేట్జీతో 'నాకు మొదటి తరగతిలోనే పోవలెనని యున్నది. వీలుకానిచో గుఱ్ఱపుబండి చేసికొని పోవుదును. ప్రిటోరియా యిచటికి 37 మైళ్లేకదా' యంటిని.

బండి ప్రయాణ మాలస్య మగుననియు, అధిక వ్యయ కారణ మనియు చెప్పి సేట్జీ మొదటి తరగతి రైలు ప్రయాణమునకే సమ్మతించెను. స్టేషన్ మాస్టరు కంతట నొక చీటి వ్రాసి పంపితిమి. నేను బారిస్టరు ననియు, మొదటి తరగతి ప్రయాణ మలవాటనియు నందు వ్రాసితిని. నేను వెంటనే ప్రిటోరియా చేరవలసి యున్నది గాన జవాబు వచ్చువరకు వేచియుండజాల ననియు, స్టేషనులోనే మాటలాడుదు ననియు, మొదటి తరగతి టికెట్టు ఇత్తురని నమ్ముచుంటి ననియు ఆ లేఖలో తెలిపితిని. స్టేషనులో స్వయముగా మాటలాడుదునని వ్రాయుటలో నొక రహస్యము మున్నది. స్టేషనుమాస్టరుకు బదులు వ్రాయుట కవకాశమిచ్చినచో, నేను కూలీబారిస్టరును గాన 'లేదు' పొమ్మని వ్రాయును. నేను అప్పుడు టింగ్లీషు దొర వేషముతో నెదుటబడి మాటలాడినచో ఆతడు మొదటితరగతి టికెట్టు ఇచ్చునని నే నాలోచించితిని. ఈ యాలోచనతో నేను ఫ్రాక్‌కోటును, గళబంధమును దాల్చి స్టేషనుమాస్టరు చెంత కేగి బంగారు కాసును బల్లపై నిడి, మొదటితరగతి టికెట్టు నిం డంటిని.

'ఆ చీటి యంపినది మీరలేనా?'

'అవును. నేడే నేను ప్రిటోరియా చేరవలెను. టికెట్టు ఇచ్చినచో నాకు మహోపకారము చేసినవా రగుదురు.'

ఆతఁడించుక జాలిచెంది, చిరునవ్వు నవ్వి, 'నేను ట్రాన్సువాల్ మానిసిని కాను. నాది హోలండు. మీ మనోవేదనను గ్రహించుకోగలను. మీయెడ నాకు సానుభూతి కలదు. మీకు టికెట్టు ఇత్తును గాని గార్డు వచ్చి మిమ్ము మూడవ తరగతిలోనికి బొమ్మన్నచో. రైల్వేకంపెనీతో మీరు వివాదమునకు దిగినయెడల నది నా కంఠమునకు జుట్టుకొనును. నాకు చిక్కు తెచ్చిపెట్టనని మాట యిండు. మీరు సత్పురుషులు. మీ ప్రయాణము సుఖముగా సాగుగాక' అనుచు టికెట్టు నిచ్చెను. ఆతఁడు కోరినట్లు మాటయిచ్చి నాకు మేలు చేసితి రంటిని.

సేట్ అబ్దుల్‌గనీ నన్ను సాగనంపుటకై స్టేషనుకు వచ్చెను. నేను టికెట్టు సంపాదించినందులకాయన సంతోషము. నాశ్చర్యమును చెందియు నిట్లనెను. 'మీరు ప్రిటోరియాకు సుఖముగా చేరగలిగినచో సంతోషమే కాని గార్డు మిమ్ము ఉన్నచోట ఉండనీయడేమో. అతఁడూరకయున్నను ప్రయాణీకులు ఊరక యుండ'రనెను.

నేను మొదటి తరగతిలో నాసీనుడనైతిని. బండి బయలుదేరెను. జెర్మిస్టనువద్ద టికెట్లు పరీక్షించుటకై గార్డు వచ్చెను. అచటనున్న నన్నుగాంచి కోపించుచు మూడవ తరగతిలోనికి వెంటనే లేచిపొమ్మని తర్జనితో సన్న చేసెను. నా మొదటి తరగతి టికెట్టు చూపెట్టితిని. 'దానికేమిలే. ముందు మూడవ తరగతికి నడువు' మనెను.

ఆ పెట్టెలో ఇరువురమే పయనించుచుంటిమి. రెండవ యాత్రికు డాంగ్లేయుడు. ఆతడు 'ఆయన నేల ఇబ్బంది పెట్టెదవు? మొదటితరగతి టికెట్టు చూపించెనుగదా? ఆయన ఈ పెట్టెలో నుండుటకు నా కెట్టి యాక్షేపము లేదు' అని గార్డును మందలించి, నావంకకు జూచి 'మీరు సుఖముగా కూరుచుండు' డని పలికెను. గార్డు 'కూలీ సరసను కూర్చుండుట మీ కిష్టమైనచో నా కేమి పోయిన' దని గొణిగికొనుచు వెడలిపోయెను.

రాత్రి ఎనిమిది గంటలకు ప్రిటోరియా చేరితిని.

19

ప్రిటోరియాలో మొదటి దినము

1893 నాంటి ప్రిటోరియా స్టేషనుకు 1914 నాంటి దానికి పోలికయే లేదు. దీపములు మసక మసకగా వెలుగుచుండెను. బాటసారులును పెక్కురు లేరు. బాటసారులందరు వెడలిపోయిన పిమ్మట స్టేషన్ మాస్టరును నా టికెటు నిచ్చి చిన్న హోటలులో బస దొరకునేమో అడుగుదమని వేచియుంటిని. బస దొరకనిచో ఆ రేయి నేను స్టేషన్‌లోనే గడప వలసి వచ్చును. ఈపనా ప్రశ్నమేని అడుగుటకు — ఎచట అవమానించిపోవునో యని — నాకు లోపల భయముగానే యుండెను.

ప్రయాణికులు వెడలిపోయిరి. స్టేషన్ మాస్టరుకు టికెట్టు నిచ్చి, బస విషయమై ప్రస్తావించితిని. ఆయన మర్యాదగనే మాటలాడెను గాని తన కేమియు దెలియ దనెను. అపుడు చెంతనున్న అమెరికన్ నీగ్రో యొకడు మా సంభాషణలో గల్పించుకొని, 'మీరు క్రొత్తవారువలె నున్నారు. ఇచట నెవరును స్నేహితులు లేరుకాబోలు. నే నెరిగిన అమెరికా దేశస్థుని దొక చిన్న హోటలున్నది. నావెంట రండు. అతడు మీకు బస యొసగు' ననెను.

నాకు లోపల సంశయము పీడించుచునే యున్నను 'మంచిది. అటులే కాని'మ్మంటిని. జాన్స్టన్ అను కుటుంబికుని బస కాతడు నన్ను వెంట నిడికొని యేగెను. జాన్స్టన్‌తో ఏకాంతముగా మాటలాడెను. ఆతడు నే నా రేయి అచట నుండవచ్చుననియు. భోజనము మాత్రము నా గదిలోనే చేయవలెననియు చెప్పెను.

'చూచితిరా, నా కిచటి పట్టింపులు లేకున్నను, ఈ యురోపీయుల ఆచారము ననుసరింపక తీరదు. తమతో సపంక్తి భోజనము మీ కిడినచో వారికి కష్టముగా దోచి. వెడలిపోదు రేమో యని సంశయించుచుంటి' నని ఆతడు వచించెను.

'దాని కేమి. ఈ రాత్రికి బస యిచ్చితివి. నా కదియే పదివేలు. కొంచెమో, గొప్పయో ఇచటి పరిస్థితులు, నీ యిబ్బందియు నెరుగుదును. నాగదిలోనే భుజింతును. నేటికి మునిగిపోయిన దేమున్నది? రేపు మరియొక బస చూచుకొందు' నంటిని.

అతడు చూపిన గదిలో నొంటరిగా నేదో ఆలోచించుచు గూర్చుచుంటిని. ఆ హోటలులో భుజించువారు పెక్కుమంది లేనిగాన నౌకరు వెంటనే నాకు భోజనము గొనివచ్చు నను కొనుచుండగా జాన్సుటనే నా గదిలోనికి వచ్చెను. 'మిమ్ము మీ గదిలోనే భుజింపుడనుట నాకు జాల గష్టముగా నుండి యితర అతిథులతో ప్రస్తావించి చూచితిని. ఏక పంక్తిని భుజించుటకు వారి కాక్షేపము లేదు. మీ కిష్టము వచ్చినన్నాళ్లు ఇచట నుండవచ్చుననిరి. కావున భోజనశాలలోనే భుజింపవచ్చును, రండు. మీ చిత్తము వచ్చినంత కాల మిచట నుండు' డనియెను. ఆతని సుజనత్వమును గొనియాడుచు భోజనశాల కేగి యచట బదిమందితో గడుపార భుజించితిని.

ప్రిటోరియాలో శ్రీ ఎ. డబ్లియు. బేకరు మా వ్యవహార్త. మరునా డుదయమున ఆయనను జూడనేగితిని. అబ్దుల్లా సేటు ముందుగనే నాతో వర్ణించి చెప్పినట్లుగనే శ్రీ బేకరు నన్ను ప్రియముగా నాదరించెను. నా యోగక్షేమములు విచారించిన పిమ్మట 'మీ రిచట బారిస్టరుగా వ్యవహరింప బనిలేదు. మేము ముందే సమర్థుడగు లాయరును మాటాడి యుంచితిమి. ఈ వ్యవహారము చిక్కులతో నిండి, చిరకాలముగా సాగుచున్నది. దీనినిగూర్చిన వివరములు నాకు మీరు చెప్పుచున్నచో నది చాలును. నేను ఈ విషయము లన్నియు వాదులవలన తెలిసికొనుటకంటె మీ ద్వారమున తెలిసికొనుచున్నచో నెక్కువ వీలుగా నుండి మా పని సుకరము కాగలదు. ఇక మీకు బస యొకటి చూడవలసి యున్నది. మిమ్ము

గలసికొన్న పిమ్మటనే బస చూడవచ్చునని ఇన్నాళ్లు నూరక యుంటిని. ఇచట ప్రబలిన వర్ణద్వేషము మూలమున మీవంటి వారికి బస దొరకుట కష్టమే. నే నెరిగిన పేదరా లొకతె యున్నది. ఆమె భర్త రొట్టెల వ్యాపారి. మీకు తమ యింట భోజనాది వసతులు కల్పించుటచే నామెకు గొంత కూడివచ్చునుగాన అంగీకరించు ననుకొందును. రండు. వారి యింటి కేగుద ' మనెను.

ఇరువురము నచటికి వెళ్ళితిమి. ఆమెను చాటునకు బిలిచి (శ్రీ) బేకరు నావిషయమై మాటలాడెను. వారమునకు 35 షిల్లింగులు పుచ్చుకొని నాకు వసతియు, భోజనము నొసగుట కామె సమ్మతించెను.

20

భారతీయుల కష్టనిష్ఠురములు

ట్రాన్సువాలులోను, ఆరంజి ఫ్రీస్టేటులోను నివసించు భారతీయుల ఆర్థిక సాంఘిక రాజకీయ ప్రతిపత్తినిగూర్చి నేను ప్రిటోరియాలో నుండగా సాకల్యముగా విచారించి తెలిసి కొంటిని. తరువాతి కాలమున నా కివె మిక్కిలి యుపకరించు నని నే నపు డెరుగను.

అప్పటికి సవరణ పొందిన ధర్మశాస్త్రము ట్రాన్సువాలులో ప్రవేశించు భారతీయులకు మూడు పౌనుల తలపన్ను విధించు చుండెను. కొన్ని ప్రదేశములలో దక్క వారు భూమి సంపాదింపగూడదు. ఆ భూమికూడ వారికి సంక్రమించుట లేదు. వారికి వోటుగూడ లేదు. ఇవి యన్నియు ఆసియా వాసులకొరకు నిర్మించిన శాసనములు. రంగుజాతులవారి కొరకు నిర్మించిన శాసనములు ఆసియావాసులకుగూడ వర్తించును.

రంగుజాతుల శాసనములో రాచబాట ప్రక్క భారతీయులు నడవగూడదనియు, రాత్రి 9 గంటల పిమ్మట అనుమతి పత్రము లేకుండ ఇలు వెడలగూడదనియు నిషేధము కలదు. శ్రీ కోట్సు అనే మిత్రముతో నేను తరచు రాత్రులు సికారు కేగి 10 గంటల వేళ వచ్చుచుంటిని. ఆ సమయమున పోలీసులు నన్ను నిర్బంధించిపోవుదు రేమోయను సంశయము నన్నును, నాకంటె అధికముగా శ్రీ కోట్సును బాధించుచుండెడిది. వారు నీగ్రోనౌకర్ల కిచ్చినట్లు అనుమతిపత్రములు ఆయన నా కీయజాలడుగదా! ఆ పత్రములను యజమానులు నవుకర్ల కిచ్చుచుందురు. నా కట్టి పత్రముతో బనికలిగి, దాని నిచ్చుట కాయన కభ్యంతరము లేకుండినను నే నాయనకు నవుకరును గాను కావున అది దట్లొసగుట మోస మనిపించుకొనును.

ఈ పెడద మాన్పుటకై ఆయనయో, ఆయన మిత్రుడో నన్ను సర్కారు వకీలుచెంతకు గొంపోయెను. డాక్టరు క్రాజ్ అను నా వకీలుచెంత కేగునరికి ఆయనయు, నేనును సతీర్థులమని

తేలెను. రాత్రు లిల్లువదలుటకు నాకు అనుమతిపత్రము కావలసివచ్చెనే యని డాక్టరు క్రాజ్ చాల నొచ్చుకొనెను. నా దురవస్థకు దానును వగచి, రాదారి చీటికి బదులుగా నా కొక చేయుత్తర మొసగెను. అది చెంత నున్నచో ఏవేళయందేనియు బోలీసులు న న్నాటంక పెట్టలేరు. ఇల్లు కదలినపుడెల్ల ఆ యుత్తరము నాతోనే యుండెడిది. దానితో నా కెన్నడు అక్కర కలుగకపోవుట అదృష్టవిశేషముచేతనేగాని మరి యొకటి కాదు.

కాలిబాటపై చరింపరా దను నిషేధము నా పాలిటికి దారుణముగా పరిణమించెను. ప్రెసిడెంటు వీధిగుండ నావలి మైదానమునకు సికారు పోవుట నా కలవాటు. ప్రెసిడెంటు క్రూగరు భవన మా వీధిలోనే యున్నది. అచటి చక్కని యిండ్లవలెనే దానికిని దోటయు, దొడ్డియు మున్నగు నాడంబర ములు లేవు.

ఆ గృహ మధికారుల దనుటకు గురుతుగా నొక పోలీసు మాత్రము వాకిట కావలి యుండెడివాడు. నే ననుదినము కాలిబాటవెంట నా కావలివానిని దాటి యేగుచుంటిని. న న్నెవరు నడ్డగించినది లేదు.

ఆ కావలివాండ్రు వంతుల చొప్పున మారుచుందురు. ఒకనా డచటి కావలివాడు, తొలగిపొమ్మని హెచ్చరించుటయేని చేయక, ఉన్నట్లుండి నన్ను దన్ని వీధిలోనికి బడద్రోచెను. నేను డిల్లవడి చూచుచున్నంతలో ఆ త్రోవవెంట అశ్వముపై నేగుచున్న శ్రీ కోట్సు 'గాంధి' యని నన్ను బలుకరించి,

'నే నంతయు జూచితిని. వీనిపై నీవు కోర్టులో చర్య జరుపుదువేని నేను సాక్ష్యమిత్తును. ఈతడు నీయెడ నెరపిన దౌష్ట్యమునకు జింతించుచున్నా' ననెను.

నేను 'ఇందు మీరు చింతింపవలసినది లేదు. పాప మాత డేమియెరుగును! నల్లనివారందరు నాతని కొక్కటియే. నిగ్రోలపైగూడ నీత డిట్లే చేయు నేసికొనుచుండునుగాబోలు. స్వవిషయమునై గోర్టుకు వెళ్ళగూడదని నియమము చేసికొంటిని. కావున గోర్టులో వీనిపై చర్య జరపను' అంటిని.

అంతట (శ్రీ) కోట్సు 'నీ వెప్పుడు నింతే. అయినను ఆలోచించి చూడుము. ఇట్టివాండ్ర కొకపరి బుద్ధి గరపుట మంచిది' అనెను. పిమ్మట నా పోలీసువానిని గట్టిగా మందలించెను. అతడు బోయరు జాతివా డగుటచే వా రరువురి డచ్చిభాష నాకు దెలిసినది కాదు. ఆ పోలీసు నన్ను క్షమాపణ వేడెనుగాని అంతటి పని యక్కరయేలేదు. నేను వాని నంతకుమున్నే క్షమించితిని.

మరల నెప్పుడు నే నా వీధిలో నడుగుబెట్టలేదు. ఈ తూరు కావలి యున్నవానికీ వృత్తాంతము దెలియదుగాన వాడును ఇట్లే చేయ మిగులునేమో, వాని తన్నులకు బాల్పడ నేల యని మరియొకదారి చూచికొంటిని.

అభిమానవంతుడగు భారతీయునకు దక్షిణాఫ్రికాలో చోటులేదు. దీని కేమి ప్రతిక్రియ చేయవలెనా యను ఆలోచన నన్ను విడువదాయెను. కాని దాదా అబ్దుల్లా సేటు వ్యవహారమే నా కప్పుడు ప్రస్తుత మాయెను.

21

అబ్దుల్లా దావా

దావాలో పూర్వ సందర్భము లన్నియు శ్రీ అబ్దుల్లాకే అనుకూలముగా నున్నవి. ధర్మశాస్త్రముకూడ మా కనుకూలింపక తీరదు. కాని ఈ వ్యవహారమునందు వాది ప్రతివాదు లిరువురు బంధువులు, ఏకనగర వాసులును. వ్యవహారమును సాగలాగినచో నిరువురు నష్టముపాలై పోవుదురు. వ్యవహార మెప్పటికి అంతమొందునో తెలియదు. నాకు జూడగా నీ యిద్దరిని సమాధాన పరచి, సఖ్యమొనగూర్చుట యుక్తమని తోచెను. పడగల పాట్లన్నియు బడి సమాధానము సాధించితిని.

ఇరువురు నిందులకు సంతోషించిరి. ఇరువురిని లోకము కొనియాడెను. నా సంతోషమునకును మేరలేదు. తగవు దిద్దుటయే నిజమునకు లాయర్ల ధర్మము. నేను దానిని నిర్వర్తించితిని. ప్రజల మంచితనమును పసిపట్టి హృదయములను గరగించు నేర్పు నా కలవడెను. వివాదల పాలయిన యిరువాగు నేక మొనర్చుటే లాయర్ల విధి యని గ్రహించితిని. ఇది నాకు అస్తిగతమైపోవుటచే నేను లాయరుపని చేసిన ఇరువదేండ్లు వందలకొలది వివాదలను కోర్టుకెక్కకుండ తీర్చి దిద్దుటతోనే సరిపోయెను. దీనిచే నాకు సొమ్ము నష్టములేదు సరిగదా, ఆత్మనష్ట మసలేలేదు.

22

తానొకటి తలప దైవమొకటి తలచెను

వ్యవహారము ముగియుటచే ప్రిటోరియాలో నా కింక పనిలేదు కావున దర్బానుకు దిరిగి యేగి ఇంటికి జను సన్నాహము సల్పుచుంటిని. అబ్దుల్లా సేటు న న్నట్లు ఊరక పోనిచ్చునా ? పెద్దపెట్టున సన్నాహముచేసి సిడెన్‌హాములో వీడ్కోలుపు విందు చేసెను.

ఆనాడచట గన్పించిన వార్తాపత్రికలు దిరుగవేయుచుంటిని. వానిలో నొకచో 'భారతీయుల వోటుహక్కు' అను పేరనున్న కొన్ని పంక్తులు కంటబడెను. నేటాలు శాసన నిర్మాణ సభలో సభ్యుల నెన్నుకొను అధికారము భారతీయులకు లేకుండ జేయుటకై అపుడు సిద్ధమగుచున్న శాసనమునుగూర్చిన వార్త యది. అట్టి శాసన మొకటి పెట్టుచున్న వార్త నేనుగాని, ఆ విందునకు దరుదెంచినవారుగాని మున్ను విన్నదికాదు.

అబ్దుల్లాసేటు వినెనేమోయని ఆయన నడిగితిని. ఆయన 'వ్యాపారపు గొడవలేకాని యిట్టివి మాకు బట్టవు' అనెను. ఈ వార్త నా మనసు నించుక కలచెనుగాని ఒకవంక ప్రయాణమునకు జెప్పులలో గాళ్లు పెట్టుకొనియున్న నా కిది యేల యని సంశయించుచునే శ్రీ అబ్దుల్లాతో 'ఇది శాసనమైనచో నిచట మన యునికి చాల ఇరుకున బడును. ఇది మన యభిమానమునకే గొడ్డలిపెట్టు' అంటిని.

అచటి యతిథు లెల్లరు మా సంభాషణ నాస్థమై విను చుండిరి. అం దొకరు 'దీని కొక్కటియే మందు. మీ రొక నెలదినములు ప్రయాణము గట్టిపెట్టి మాకు దారి చూపితిరా, మేము దీని యంతు తేల్చికొందుము' అనిరి. తక్కినవారందరు 'మేలు మే' లని ఆ మాటను సమర్థించిరి.

ఇక నే మున్నది? నా ప్రయాణము సాగుట వట్టిది యాయెను. అచటి భారతీయ మిత్రులు నన్ను చుట్టుముట్టి 'మీ రిచటనే ఉండిపొండు' అనుచు అనురోధము సల్పిరి. నే నంతట నేటాలువాసి నైపోతిని. ఊపిరి సలుపకుండ ఆందోళన సాగింపనిచో సీమలోనున్న వలసమంత్రికి చీమ కుట్టదు. ఈ కార్యసాధనకై సుస్థిరమైన సంఘ మొకటి యుండుట మంచి దని తోచెను. శ్రీ అబ్దుల్లా మున్నగు స్నేహితులతో సంప్ర దింపగా వారు సమ్మతి జూపిరి. అంతట మే నెల 22-వ దినమున 'నేటాలు ఇండియన్ కాంగ్రెసు' అను ప్రజా సంస్థను నెలకొల్పితిమి.

23

మూడు పౌనుల పన్ను

నేటాలువాసులగు ఐరోపీయు లచట చెరకుపంట కాను కూల్య మున్నదని గ్రహించిరి. అందులకు కూలివాండ్రు

కావలసి వచ్చిరి. చెరకు పండించుట కేమి, చక్కెర చేయుట కేమి నేటాలులోని జూలు కూలివాండ్రు పనికిరారు. కావున నేటాలుప్రభుత్వము భారతప్రభుత్వముతో సంప్రదించెను. మన దేశపు కూలివాండ్రను నేటాలుకు దీసికొనిపోవుటకై భారతప్రభుత్వ మనుమతించెను. నేటాలుకేగిన మన కూలివాండ్ర చట నైదేండ్లు పనిచేసితీరవలెను. ఆ పిమ్మట నచట భూమి పుట్రలు సంపాదించుకొనిరి. ప్రాత కాపులు గావచ్చునని ఆసలు చూపి మన ప్రజ నటకు గొనిపోయిరి.

ఈవిధముగా నిటుల వచ్చిన భారతీయులు తమకు జెప్పిన పని చేసి యూరకొనక అధికముగా బరిశ్రమించిరి. స్వదేశమునుండి క్రొత్త విత్తనములు దెచ్చి కూరగాయలను కొల్లలుగా బండింప సాగిరి. అచటి విత్తనములనుగూడ చవుకగా బండింప జొచ్చిరి. మామిడియంట్లు దెచ్చి నేటాలులో నాటిరి. కర్షకవృత్తితో నాగక కొందరు వర్తకము చేయనారంభించి, భూములగొని యిండ్లు కట్టికొనిరి. కూలికి నాటి కేగుట మాని క్షేత్రస్వాములు, గృహస్వాములు నైరి. భారతదేశమునుండి కొందరు వణిజులుగూడ నిచటి కేతెంచిరి.

కూలికై కొనితెచ్చిన భారతీయు లిట్లు క్షేత్రస్వాములు, వర్తకులు నగుట గర్వోన్నత తెల్లవర్తకులకు గన్నుగుట్ట దొడగెను. వేరు రంగములలో భారతీయుల నైపుణ్యమును గాంచి వారు కళవళపడిరి. పొలము సేద్య మొనర్చుకొన్నచో సహింప నగునుగాని సొంతవ్యాపారమునుగూడ భారతీయులు సాగించినచో సహించు టెట్లు?

భారతీయులయెడ నీ విధముగా నాటుకొన్న ద్వేష బీజములకు మరికొన్ని సందర్భములు తోడై దోహదము సలిపెను. అంతట, వ్యవసాయపు గట్టుబడికై వచ్చిన భారతీయు లందరికీ తలపన్ను విధించు శాసనరూపమున ఈ ద్వేషబీజములు ఫలించెను.

మేమీ తలపన్నుపై కత్తిగట్టి ప్రతిఘటించితిమి. ప్రజ లీ పోరాటమున వెనుకంజ యిడి చాలించినను, కాంగ్రెసు సంఘము ఈ పని మన కింక వదలని దానికి తలయొగ్గినను— కట్టుబడి కూలీల కీ తలపన్నుపీడ నేటికినీ అట్లే యుండి, దక్షిణాఫ్రికా భారతీయులకే కాక, యావద్భారతభూమికి దలవంపు గూర్చుచుండెడిది.

దక్షిణాఫ్రికాలో నా కప్పటికి మూడేండ్లు గడచినవి. అచటి ప్రజలు, నేను నొకళ్ళ కొకరు ప్రాబడి బంధువులమైతిమి. ఆ దేశమున ప్రాతకాపునై పాదుకొంటినని స్పష్టపడిపోయినది. అచటి నా వకీలువృత్తి కొంత మెరుగుగానే యుండెను. నా యునికి అచటివారికి తీరని యక్కరయైపోయెను. కావున 1896 లో ఆరుమాసములపాటు స్వదేశమున కేగివచ్చుటకు వారి యనుమతి గొంటిని. నా యాలుబిడ్డలతో దిరిగివచ్చి యచటనే యుండిపోవుట మంచిదనుకొంటిని. భారతభూమి కేగినచో మరియొక మేలును చేకూరును. దక్షిణాఫ్రికా భారతీయుల కష్టనష్టములను భారతీయులకు వివరించిచెప్పి వారి సానుభూతిని, సహాకారమును సంపాదింపవచ్చును.

పంచమ భాగము : స్వదేశాగమనము

24

ఇండియాలో

నేను బొంబాయిలో ఆలసింపక హుటాహుటిగా రాజకోట కేగితిని. దక్షిణాఫ్రికాలో స్థితిగతులను వివరించు చిన్న పొత్తమును రచింప బూనుకొంటిని. గ్రంథరచనకు, దాని ప్రచురణకు ఒక్క నెల పట్టెను. పైనున్న ఆకుపచ్చని కాగితముచే దానికి ఆకుపచ్చపొత్తమని పేరువచ్చెను. అందు దక్షిణాఫ్రికా భారతీయుల దురవస్థను ప్రయత్నపూర్వకముగ తగ్గించి చిత్రించితిని. పదివేల ప్రతు లచ్చొత్తి దేశములోని వార్తాపత్రికలకు, పెద్దలకు నందజేసితిని. ఆ గ్రంథసారమును 'రాయిటరు' సీమకు బంపెను. దాని నింకను వడియగట్టి లండనునుండి నేటాలు కంపిరి. మూడు పంక్తులకు మించని ఆ సారసంగ్రహములో నేను రచించిన మాటలు లేకపోగా, నేను చిత్రించిన నేటాలు భారతీయుల దురవస్థ అంతా పెక్కు మడుగులుగా చిత్రితమాయెను. దానిచే నేటాలులో నెట్టి ఫలితము కలిగెనో ముందుముందు తెలియనగును. ఈ లోపల పలుకుబడి గల వార్తాపత్రిక లన్నియు నా గ్రంథముపై దీర్ఘ వ్యాఖ్యలు ప్రచురించెను.

ఈ పదివేల ప్రతులను దేశములో బలుతావులందున్న పెక్కుమందికి బంపుట సుకరముగాదు. వీనిని పోస్టులో వేయుటకు మరల సంచులుగట్టి, పోస్టుబిళ్ళ లంటించవలెను. చిరునామాలు వ్రాయవలెను. ఇది యంతయు ధనసాధ్యమని చింతించి, నే నొక యుపాయము చేసితిని. విద్యార్థుల గొందరిని ప్రోగుచేసి వారికి బడి లేనివేళలందు, దినమునకు రెండు మూడు గంటల చొప్పున వారిచే నీ పని యంతయు జేయించితిని. వాడిన పోస్టుబిళ్ళలు నాకడ నున్నవి వారి కిచ్చెద నంటిని. వారిని దీవింతు నంటిని. ఆ బాలురు సంతోషపూర్వకముగ ఆ పని యంతయు నింతలో చేసిపెట్టిరి. మంచి మాటలతో నేను బాలురచే పనిగొనుట కదియే మొదలు. ఆ విద్యార్థులలో నిరువురు నేడును నాతో గలిసి పనిచేయుచుండిరి.

దక్షిణాఫ్రికానుగూర్చి పట్టణములలో సభలు సమకూర్చి వివరించుట యుక్తమని యెంచి తొలుత బొంబాయిలోను, పిమ్మట పూనాలోను ఉపన్యసించి. పదపడి మదరాసుకు, అటనుండి కలకత్తాకు నేగితిని. ఆ నగరమం దుండగనే దర్బానునుండి 'జనవరిలో పార్లమెంటు ఆరంభ మగును. వెంటనే బయలుదేరుడు' అని కేబుల్ (నిస్తంత్రీవార్త) వచ్చెను.

కావున డిసెంబరు మాసారంభమున మరల దక్షిణాఫ్రికాకు బయలుదేరితిని. నాభార్యను. ఇరువురు కొమరులను, పితృహీనుడగు నా మేనల్లుని వెంట గొంపోతిని. మా

యోడతోపాటు 'నదేరి' యను మరియొక నావ దర్బానుకు బయలుదేరినది. దాదా అబ్దుల్లా కంపెనియే ఆ రెండునావలకు ఏజెంట్లు. రెంటిలోను మొత్త మెనిమిది వందలమంది బయలుదేరిరి. వారిలో సగపాలు ట్రాన్సువాలు చేరవలసిన వారే.

షష్ఠ భాగము : మరల దక్షిణాఫ్రికా

25

తుపాను

18-వ డిసెంబరున మా యోడలు దర్బాను రేవులో లంగరు వైచెను. వైద్యులు వచ్చి పరీక్షింపకుండ దక్షిణాఫ్రికా రేవులలో ప్రయాణికు లెవరును దిగరాదనిరి. ఓడలో అంటు జబ్బువా రెవరేని యున్నచో ఆ యోడను గొన్నాళ్ళు విడిగా నుంచవలసి యుండును. మేము బయలుదేరునపుడు బొంబాయిలో ప్లేగురోగ ముండెనుగాన మా యోడ కేకాంత వాసము తప్పదనుకొంటిమి. వైద్యుడు వచ్చి పరీక్షించి మాకు ఐదునాళ్ళేకాంతవాసము విధించెను. ప్లేగురోగము 23 నాళ్ళకుగాని బయటబడదు. మేము బయలుదేరి 18 నాళ్ళయినది. కావున మఱియైదు దినము లేకాంతముగా నున్నచో ననుమానము తీఱిపోవును. మమ్మిట్లు విడిగా నుంచుటకు కారణ మొక్క ప్లేగు భయమే కాదు; దీనికి వేఱె కథ యున్నది.

దర్బానులోని తెల్లవాండ్రు మమ్ము వెనుకకు త్రిప్పి పంపవలసినదని ప్రభుత్వమునకు ఒత్తిడి కల్పించుచుండిరి.

మమ్ము నోడ దిగనీయమి కిదియొక కారణము. దాదా అబ్దుల్లా కంపెనీనుండి నగరములోని వార్తలు మా కేనాటి వానాడు అందుచునే యుండెను. తెల్లవాండ్రనుదినము నీవిషయమున సభలొనర్చి అలజడి కల్పించుచుండిరి. నిర్భాగ్యులగు భారతీయులు, వారియండను కొలదిమంది ఆంగ్లేయులు నీవంక; ఇక నావంక నున్న తెల్లవాండ్రన్ననో, మంది, మార్బలము, ఆయుధములు, ఐశ్వర్యములతో దుర్నిరీక్ష్యులు. వారికి సర్కారు పెద్ద యండయై చాటు మాటులు లేక నిలిచినది.

ఓడలలో నున్న ప్రయాణికు లేవో ఆటపాటలతో గాలక్షేప మొనర్చుచుండిరి. నేనును వారితో వినోదించుచుంటినే కాని నా మనసంతయు దర్బానులో రేగిన పోరాటముపై నుండెను. శత్రువులకు నేనే లక్ష్యముగావున నాపై రెండు బాణములు సంధించిరి:

1. నేను భారతభూమియం దున్నపుడు నేటాలు తెల్లవారిపై లేనిపోని నిందలు మోపితిని;

2. నేటాలును భారతీయులతో ముంచివేయుటకై రెండు నావలనిండ జనమును గొనితెచ్చితిని—అని.

నిజమునకు నే నేపాప మెరుగను. నే నెవరిని నేటాలుకు రండని పిలుచుకొని రాలేదు. ఓడలో నెక్కిన ప్రయాణికులు నా కపరిచితులు. ఒక రిద్దరు బంధువులవి తప్ప ఓడలో నెక్కిన పందలాది ప్రయాణికులలో ఒక్కరి యూరును పేరును

గూడ నే నెరుగను. ఇండియాలోనున్నపుడు నేటాలు తెల్లవాండ్రనుగూర్చి నేను క్రొత్తగా ఆడిపోసికొన్నదియు లేదు. అంతకుమున్ను నేటాలులో జెప్పిన మాటలనే తిరిగి ఇండియాలో జెప్పితిని. అవియేనియు నేను నిరాధారముగ జెప్పిన మాటలు కావు.

ఒక్కొక్క దినమే దీర్ఘదీర్ఘమై గడచిపోవుచుండెను.

ఇట్లు ఇరువదిమూడు దినము లేగినపిమ్మట ఓడలను రేవులోనికి రానిచ్చి, ప్రయాణికులు దిగుట కనుమతించిరి.

నా తోడిప్రయాణికు లొకరొక్కరే దిగి యేగుచుండిరి. ఇంతలో ఓడ కప్తానుకు నేటాలు మంత్రిమండల మందలి శ్రీ ఎస్కాంబ్ నుండి వార్త వచ్చెను. 'ఇచటి తెల్లవారు గాంధిపై మండిపడుచున్నారుగాన ఆయన ప్రాణముల కపాయము గల్గును. చీకటిపడినపిమ్మట ఆయన సకుటుంబముగా దిగినచో, రేవుసూపరింటెండెంటు శ్రీ టాటమ్ వారిని తన వెంటగొనిపోయి ఇంటికి జేర్చును.' కప్తాను నాకీ వార్త అందింపగా నే నట్లే కానిండంటిని. మరి అరగంటలోపల, దర్బాను భారతీయులకు మిత్రము, వకీలు నగు శ్రీ లాటన్ కప్తానుకడ కేతెంచి, 'గాంధి సమ్మతించినచో ఆయనను నావెంట గొంపోదును. దాదా అబ్దుల్లా కంపెనీకి వకీలునగు నా మాటపై మీరు శ్రీ ఎస్కాంబ్ పంపిన వార్త నుల్లంఘింపవచ్చును' అని చెప్పెను. పిమ్మట నావెంత కేతెంచి 'మీరు సాహసించి నావెంట రండు, మీ కుటుంబమును బండిలో రుస్తుంజీ ఇంటి కంపి మన మిరువురము నడచిపోవుదము. రాత్రి

వేళ దొంగవలె మీరు నగరము సొచ్చుట నాకు నచ్చలేదు. మీకు నేమియు నపాయమురాదు. తెల్లవారందరు చెదరపోయిరి. నగరమంతట సద్దుమణగినది. ఏది ఎట్లయినను మీరు దొంగవలె నగరప్రవేశ మొనర్చుట మాత్రము తగదు'— ఇది నాతో చెప్పిన మాటలసారము. నేను వెంటనే సమ్మతించితిని. నా భార్యయు, బిడ్డలును నిరపాయముగా రుస్తుంజీ ఇల్లు చేరిరి. కప్తాను అనుమతిగొని నేను శ్రీ లాటన్‌తో బయలుదేరితిని. రుస్తుంజీ గృహ మచటికి రెండు మైళ్ళ దవ్వు.

నేను ఓడ దిగి యొడ్డు చేరగనే కొందరు బాలురు నన్ను గురుతించి, 'గాంధి గాంధి' యని కేకలిడినంతనై దాకుగురు పెద్దవాండ్రు పరుగున నేతెంచి తామును కేకలిడ సాగిరి. గుంపు క్రమముగా పెద్ద దగునని భయపడి శ్రీ లాటన్ రిక్షావాని బిలిచెను. రిక్షాపై నెక్కుట కెన్నడు నా కిష్టము లేదు. తొలిసారిగా రిక్షా ఎక్కవలసి వచ్చెను. కాని ఆ బాలురు నన్ను దానిపై నెక్కనీయక రిక్షావాని బెదరించినంతట వాడు పారిపోయెను. మే మల్లే నడచి యేగుచుండ గుంపు పెద్దదై మాకు ముందుకు నడుగిడుట కష్టమై పోయినది. ఆ మూక ముందుగా శ్రీ లాటనును ముట్టడించి మ మ్మిరువురను వేరుచేసెను. పిమ్మట రాళ్ళను, ఇటుకముక్కలను, కుళ్ళిన గ్రుడ్లను నాపై ప్రయోగించెను.

ఇం దొకడు నా తలపాగ లాగివైచెను. కొందరు నన్ను గాళ్ళతో దన్ని, చేతులతో మోదుచుండిరి. నాకు స్మృతి

తప్పిపోవుచుండ చేరువనున్న యింటి పెండెపుచువ్వ లాటంబ ముగా నిండ్రొక్కికొని ఊపిరికై పెనగులాడుచుంటిని. అంతట నేని ఆ మూక విడువక నన్ను గ్రుద్దుచు, బాదుచు బాధించు చుండ నాకు నిలుచుట అశక్యమాయెను. పోలీసు సూపరింటెం డెంటు భార్య కన్నెరుగును. ఆమె యా దారి నేగుచు, సాహసించి నన్ను దరియ నేతెంచి, అపు డెండ లేకున్నను తన గొడుగును విప్పి, మూకకు నాకు నడుమ నిలిచెను. ఆమె శ్రీమతి అలెగ్జాండరు. ఆమెకు దగులకుండ నన్ను గొట్టుటకు వీలుగామి నా మూకకు గాక యించుక వెనుకాడెను.

ఇదీ యంతయు గాంచిన కుఱ్ఱ భారతీయు డొకడు పోలీసు స్టేషనుకు బరుగిడి చెప్పినంతట, నన్ను పొదివికొని ఇంటికి చేర్చుటకై సూపరింటెండెంటు కొందరిని సాయ మంపెను. వారు సమయమున కేతెంచిరి. పోలీసు స్టేషను మే మేగు త్రోవయందే యున్నది. మే మచటికి జేరగానే సూపరింటెండెంటు నన్ను స్టేషనులో దలదాచుకొమ్మని చెప్పెను. నే నందుల కియకొనక 'వీరు తమ తప్పు దా మెరిగినంతనే శాంతి చెందుదురు. వీరు తప్పొప్పు లెరుగని వారు కారని నాకు నమ్మకమున్న' దంటిని. పోలీసుల సాయముతో నిట్లు మరి యేబాధకు గురిగాక రుస్తుంజీ గేహ మును జేరుకొంటిని. ఒడ లెల్ల చీరుకొనిపోయినదే గాని ఒక్కచో దక్క పుండ్లేమియు బడలేదు. అచటనే యున్న మా యోడ వైద్యుడు శ్రీ దాదిబర్జార్ నాకు వలసిన చికిత్స గావించెను.

ఇంటిలో నిమ్మకు నీరెత్తిన ట్లున్నను ఇంటి వెలుపల దెల్లవాండ్రు చుట్టుముట్టి యుండిరి. మసక మసక చీకట్లతో రాత్రి యగుచుండెను. 'ఏడీ గాంధి! గాంధిని బయటికంపు' డనుచు నింటిచుట్టు మూగిన మూకలు కేకలిడుచుండెను. అద నెరిగి పోలీసు సూపరింటెండెంటు అచటికి కేతెంచి, మూకలను బెదరింపక, చల్లని మాటలు చెప్పి అదుపులో నుంచుచుండెను. కాని ఏటుపోయి యెట్లువచ్చునో యని దక్కుగా నుంటచే నా కిట్లు కబురంపెను: 'మీ స్నేహితుని యింటికి, ఆస్తికి, మీ కుటుంబమునకు అపాయము దప్పింప నెంతురేని, నా యాలోచన విని, మారువేసమున ఇలు దాటి పొండు.'

ఆయన మాటనొప్పుక నేను భారతీయ పోలీసు దుస్తులను, శిరోవేష్టనమును దాల్చితిని. ఇద్దరు గూఢచారులు నా వెంటనుండిరి. అం దొకరు భారతవర్తకుని వేసమునుదాల్చి, మొగమున రంగు బూసికొనిరి. రెండవయాతని మారువేస మెట్టిదో మరచితిని. సందుదారిని బడి, పొరుగునున్న దుకాణము జొచ్చి, అచటి గిడ్డంగిలోని గోనెసంచుల మధ్యగా వాకిటి కేతెంచి, జనసమూహమున బడితిమి. వీధి చివర నాకొరకు నిలిపియుంచిన బండిసెక్కి, అంతనుము న్నెచట తలదాచుకొన నిరాకరించితినో, ఆ పోలీసుస్టేషను కేగితిమి. ఆ రహస్యచారులతో, సూపరింటెండెంటుతో 'మీ పుణ్యమా యని బ్రతికితి' నంటిని.

మే మట్లు తప్పించుకొని యేగుచుండ శ్రీ అలెగ్జాండరు

పిమ్మటనే వ్రాయవచ్చును. దోషులపై కోర్టు చర్యను మీరు జరుపకుండుటకే నిశ్చయింతురేని—ఉన్న మాట చెప్పు చున్నాను—ఇచట శాంతి నెలకొల్పు పని నాకు సుకర మగుటేకాదు; మీ కదె ప్రతిష్ఠాకరము గూడ నగును' అనెను.

నేను 'సంతోషము. నే నెవరిని సంప్రదింప బనిలేదు. మీకడకు రాకమున్నే అట్లు నిశ్చయించుకొంటిని. నన్ను గొట్టినవారిపై కోర్టుచర్య జరపదగదనియే నా దృఢాశయము. నే నా మాటలిపుడే వ్రాసి యిత్తు' నంటిని.

వెంటనే అట్లు లిఖించి యిచ్చితిని.

ఓడ దిగిననాడు 'నేటాలు అడ్వర్టయిజరు' పత్రికా ప్రతినిధి నాచెంతకేతెంచి కొన్ని ప్రశ్నము లడిగెను. నే నన్నిటికి సదుత్తరములిచ్చి, నాపై మోపిన నిందల కాధారము లేదని స్పష్టమొనర్చితిని.

ఆ ప్రశ్నోత్తరములవలనను, నన్ను బాధించినవారిపై చర్య జరుప నిరాకరించుటవలనను నా మంచితనము దర్బాను లోని తెల్లజాతివారి హృదయములకు వచ్చెను. తా మొనర్చిన పనికి దలలు వంచికొనిరి. పత్రికలు నేను నిరపరాధినని పొగడి, అల్లరిమూకల దుశ్చర్యను తెగడెను. నేను పొందిన శరీరక్షోభ మిట్లు నాకు, అనగా నా యుద్యమమునకు, శుభముగా పరిణ మించెను. దక్షిణాఫ్రికా భారతీయుల ప్రతిష్ఠ దీనిచే హెచ్చి, నా పూనిన పని సుకరమాయెను. పిమ్మట మూడునాలుగు దినములకు నా యింటిలో విడిసితిని. ఈ యలజడి యంతయు గొన్నాళ్ళకు జల్లారెను.

26

పొదుపరి జీవనము

మాకు చాకలి ఖర్చు అధికమయ్యెను. ఆ చాకలి అనుకొన్న సమయమునకు రాడు. కావున చొక్కాలు, కాలర్లు రెండుమూడు డజను లున్నను చాలవాయెను. దిన దినము కాలరును, దినము విడిచి దినము చొక్కాయు మార్చక తప్పదు. ఇందువలన నగు ఇబ్బడివ్యయము అక్కరమాలినదని నాకు దోచెను. అంతట బట్టలు బాగుచేయు పనిముట్లు కొని, తద్బోధకమగు గ్రంథమును జదివితిని. ఆ విద్యను నా భార్యకు గూడ నేర్పితిని. దీనిచే నాకు పని యధికమైనను అందలి క్రొత్త యొక వింతసంతోషము గూర్చుచుండెను.

స్వయముగా నుదికికొన్న మొదటి కాలరు కథ నాకు మరపునకు రాదు. దానికి గంజి యెక్కువగా బెట్టితిని. ఇస్త్రీ పెట్టెకు వేడి చాలలేదు. కాలరు కాలిపోవునోయని పెట్టెతో జక్కగా నొక్కనైతిని. కాగా, కాలరుకు బిరుసుదనము తగుమాత్ర మెక్కినది కాని అదనపు గంజి పొడిపొడిగా రాల దొడగెను. దానిని ధరించి కోర్టు కేగినంతట తోడి బారిష్టర్లకు నవ్వు పంట దొరకెను. కాని, ఒరులు నవ్విపోదురను చలి నా కప్పటికే వదలిపోయెను.

నా పరిహాసమునకు 'నేను సొంతముగా కాలరు నుదికి కొనుట నా కిదే మొదలు గావున గంజి యెక్కువై రాలు

చున్నది. అంతమాత్రముచే పోయినది లేకపోగా, మీ కందరకు వినోదము గూర్పగలిగితినికదా' యని బదులాడితిని.

వారిలో నొక మిత్రము 'చాకళ్ళకిచట కరవు వచ్చెనా?' యనెను. నేను 'చాకలి కయ్యెడి ఖర్చు నా తలకు మించి పోయినది. కాలరు మూల్యముతో దాని యుతుగుడుకూలి సరితూగుచున్నది. అది యటులుండ చాకలివాని దయకు జేతులొగ్గుటకంటె సొంత చాకిరమే మేలుగా దోచిన' దంటిని.

చాకలిచెర వదల్చుకొన్నట్టే మంగలిచేతినుండికూడ నేను విడివడితిని. సీమకు వెళ్లివచ్చినవారందరకు ముఖక్షౌరమలవాటగునుగాని తలవెండ్రుకలు కత్తిరించుకొనుట యలవడినట్లు నేను వినలేదు. నే నదికూడ నేర్వవలసి వచ్చెను. నే నొకపరి ప్రిటోరియాలో మంగలిదుకాణమున కేగగా నాతడు నన్ను చిన్నచూపు చూచి కేశఖండన మొనర్ప నిరాకరించెను. నా మనస్సు చివుక్కుమనెను. అంత నొక కత్తెర కొనితెచ్చి, అద్దముముందు నిలిచి కత్తిరింప నారంభించితిని. ముందల కత్తిరింపు కొంత మెరుగేకాని వెనుకదెస బొత్తుగా చెడిపోయెను. ఆ కత్తిరింపు సొబగు గాంచి కోర్టులో స్నేహితులు కడుపుబ్బ నవ్వికొని 'గాంధి! అదియేమి, నీ తల యటులున్నది? ఎలుకలు కొరుకలేదుకదా!' యనిరి.

'లేదు, తెల్లమంగలి నా నల్లతల ముట్టననెను. కావున బాగుగనో, ఓగుగనో నేనే కత్తిరించుకొంటి' నంటిని.

ఆ మాట వారి కాశ్చర్యము గూర్పలేదు.

నాకు క్షౌరమొనర్ప నిరాకరించుటలో మంగలి చేసిన దోషముగూడ నాకు గన్పించలేదు. నల్లవాండ్రకు వపన మొనర్చినచో వాని కూడు పడిపోవును. మన మంగళ్లు అస్పృశ్యసోదరులకు క్షౌరమొనర్ప మనముమాత్రము సమ్మతింతుమా? దీని ఫలమే దక్షిణాఫ్రికాలో పలుమారు లనుభవించితిని. పాపఫల మనుభవింపక తీర దనుకొని కోపము బారికి దప్పితిని.

27

స్మరణము — ప్రాయశ్చిత్తము

నేను దర్బానులో న్యాయవాదిగా నున్నపుడు నా గుమాస్తాలుగూడ తరచు మాయింటనే వసించుచుండిరి. వారిలో గుజరాతి హిందువులును, తమిళ క్రైస్తవులును గలరు. వారిని బంధువులుగా నెంచుకొంటినే కాని మరొక విధముగా జూచి నట్లు గురుతులేదు. ఆ గుమాస్తాలలో అస్పృశ్యకులజు డగు నొక క్రైస్తవుడుగూడ నుండెను.

నేమున్న ఇల్లు బంగాళా పంపిణి దగుటచే గదులనుండి మురుగునీరు వెలికేగుటకు దూములులేవు. అన్ని గదులలోను మూత్రోత్సర్జనమునకు పాత్రలుండెడివి. ఆ పాత్రలు బాగు చేయుటకు పనిచాకరులను బెట్టక నేనో, నా భార్యయో

చూచుకొనుచుంటిమి. ఇంటిలోని వాడుకగా మెలగుచున్న గుమాస్తాలు తమ పాత్రలు తామే బాగుచేసికొనుచుండిరి. ఈ క్రిస్టియను గుమాస్తాకు గ్రొత్తయగుటచే ఆతని గదిలోని పాత్రను మేమే బాగుచేయవలసివచ్చెను. ఒక్కొకవారి మూత్రపాత్రలను బాగుచేయుచుండిన నా యిల్లాలికి అస్పృశ్యునిపాత్ర బాగుచేయుట రోత యనిపించెను. అదే మా యాలుమగల మధ్య కీచులాటకు గారణమైనది. నేనే ఆ పాత్ర శుద్ధిచేయుదునన్న అందుల కామె మనసొప్పదు. తాను చేయుటకు నొప్పికొనదు. కోపముచే నెఱ్ఱవారిన నేత్రములతో, చెక్కిళ్ల డిగజారు కన్నీటితో నన్నాడిపోసి కొనుచు విధిలేక యా పాత్రను చేబూని మేడమెట్లు దిగుచుండిన యాపె రూపము నేటికి నా కనుల గ్రేలుచున్నది. మరి నేను కఠోరదయాళువు నగు భర్తను కావున ఆమెకు గురుత్వమును నామీద వేసికొని, ఆమెయందలి ప్రీతియే నన్నంధుని గావింప ఆ యిల్లాలిని కడగండ్లపాలొనర్చితిని.

మూత్రపాత్ర నామె యెట్లో కైకొని పోవుటతో తృప్తి జనింపక ఆ పనిని సంతోషముమై చేయవలెనని పట్టుపట్టి 'నా యింట ఈ వెఱ్ఱివేషములు సాగనీయ' నని బిగ్గరగా అరచితిని.

ఆమె హృదయమున ఈ మాట లమ్ములై నాటెను.

ఆమెయు 'మీయింటిని మీరే దాచుకొనుడు. నే పోవుచుంటిని' అని అరచినంతట, నేను కోపవివశుడనైతిని. నాలోని దయార్ద్రగుణము ఇంకిపోయెను. నిస్సహాయయగు

నామె చేయి పట్టికొని, మేడ మెట్ల కెదురుగా నున్న వీధి గుమ్మముచెంతకు జరజర లాగికొనిపోయి, తలుపు దెరచి, బయటికి గెంట నుంకించితిని. బొటబొట నొడియు కన్నీ రైరై పారి నామె 'మీకు సిగ్గేలలేదు? ఇంత ఒడలెరుగని సినమా? నే నెచటకు బోవుదును? నా కిచట తలిదండ్రులా, బంధువులా? నన్నేవ రాదరింతురు? మీ భార్య నైనందుకు మీచే దాపులు, దన్నులు దినవలెనుగాబోలు? మీ పుణ్య మారామె: నిప్పటికేని ఒడలెరిగి ఆ తలుపులు మూయుడు. ఇరుగు పొరు గీ కీచులాట చూచి నవ్వి పోదురు' అనుచు హెచ్చరించెను.

సిగ్గున గ్రమ్మగ్గిపోవుచు నేను లేని గాంభీర్యము దెచ్చు కొని తలుపులు మూసితిని. ఆమె నన్ను విడనాడలేనిచో నేనుమాత్ర మా యిల్లాలిని వీడగలనా? మేమిట్లు పలు మారు జగడ మాడుకొనియు దుదకు శాంతించుచుంటిమి. సాటిలేని తాలిమిపెంపున ఇల్లాలే నా కెపుడును గురుత్వము నెరపుచుండెను.

28

బోయరు యుద్ధము

1897, 1899 సంవత్సరముల మధ్యకాలమునందలి ఇత రానుభవములను విడిచిపెట్టి బోయరు యుద్ధమునుగూర్చి యెత్తికొందును.

యుద్ధము పొసగినంతనే నా మన స్సెట్లు ఉఱియాడెనో 'దక్షిణాఫ్రికా సత్యాగ్రహ చరిత్ర' యను గ్రంథమున వివరించితిని. కుతూహల మున్నవా రందు చూడగలరుగాన నా విషయ మిచట మరల నడపను. బ్రిటిషు ప్రభుత్వము పట్ల నాకు గల విశ్వాసము పెంపుననే నేను ఆ యుద్ధమున బ్రిటిషుపక్షము నవలంబించితిని. బ్రిటిషు సామ్రాజ్య పౌరుల హక్కులు నాకు గావలెనని ఒకవంక గోరుచున్న నేను ఆ సామ్రాజ్యరక్షణమునకు నడుముగట్టుట విధాయకము.

1100 మంది యున్న మా దళములో నలుబదిమంది నాయకు లుండిరి. ఆ యుద్ధసమయమున మేము దినమునకు 20, 25 మైళ్లు క్షతగాత్రులను మోసికొనుచు తిరుగుచుండెడి వారము. శ్రీ వుడ్ గేటు సేనానివంటి వారినిగూడ అట్లు మోసెడిభాగ్యము మాకు లభించినది. మొత్తము ఆరు వారములు మాత్రమే మా దళము పనిచేసినది.

మా సల్పిన యీ యల్పసేవ యపుడు ప్రస్తుతిపాత్రమై, భారతీయుల ప్రతిష్ఠయు నధికమయ్యెను.

29

వెలగల కానుకలు

యుద్ధసేవనుండి విడుమర కలుగగానే నాపని యిక భారతభూమిలోనేగాని దక్షిణాఫ్రికాలో గాదని తోచెను.

మాతృభూమియందలి మిత్రములు నన్నింటికి దిరిగిరమ్మని అనురోధము సల్పుచుండిరి. స్వదేశము నాకు మిక్కిలి ఉపకరింతు నని నాకును దోచినది. కావున నన్నిక విడిచిపెట్టుడని నా సహచరుల నడిగితిని. వా రొకపట్టున నియ్యకొనరైరి. సంవత్సరములోపల వారికి నాతో అక్కఱపడినచో నేను వెంటనే తిరిగి వత్తునని ఒడంబడిన పిమ్మట వారు నా పోకకు సమ్మతించిరి. ఊరూర వీడ్కోలు సభలు జరపి నాకు వెలలేని పసదనము లిచ్చిరి. అందు వెండి, బంగారు నగలు, రత్నభూషణములుగూడ నున్నవి.

ఈ బహుమతుల భారముచే నా కా రాత్రి నిదురపట్టినది కాదు. పడుకగదిలో నిటు నటు ఆందోళితమనస్కుడనై తిరిగితినేకాని ఉపాయము తోచలేదు. వేలకొలది విలువగల ఆ కానుకలను విడిచిపెట్టుట యొక కష్టము; దాచికొనుట అంతకంటె గష్టము అనిపించెను.

నేను వాని నంగీకరింతునే చూడుడు; మరి నా బిడ్డల మాట యేమి? నా భార్యమాట యేమి? ఇన్నాళ్లు వారిని సేవావ్రతదీక్షితులుగా శిక్షించితిని. ప్రతిఫలము గోరని సేవయే సేవయని వారికి జెప్పితిని.

ఇంటిలో మాకు నగలు నాణెములు లేవు. నానాట మేము పొదుపుగ బ్రదుకును గడుపుచుంటిమి. అట్టి మా కీ రత్నాంగుళీయకములు, పైడి గడియారములు, గొలుసులు నేటికి? భూషణములపై మోహము తగదని నే నప్పటికే

ఇతరులకు బోధించుచుంటిని. ఇపుడు నామీద వచ్చిపడిన యీ భూషణభారము నేమిచేతును ?

వాని నుంచుకొనఁ గూడదనియే తుదకు మనసు తెంపు చేసికొంటిని. ఆ నగల నన్నిటిని ధర్మనిధిగా నేర్పరచి, దాని వినియోగమునకు పార్సీ రుస్తుంజీ మున్నగువారిని ధర్మకర్తలుగా నియమించుచు నొక లేఖ వ్రాసితిని. తెలవారిన పిమ్మట నా యాలుబిడ్డలతో సంప్రదించి ఎట్టకేల కా బరువు వదల్చుకొంటిని.

నా బిడ్డ లిందుకు సమ్మతించుటలో జిక్కు కలుగదనియు, నా భార్య కొన్ని అడ్డదిడ్డములు చెప్పక మానదనియు నేను ముందుగనే యెరిగినవాడను గాన నా తనయులచేతనే ఈ వ్యవహారము నడిపింప నిశ్చయించితిని.

వారు నా కోర్కెకు వెంటనే తలయూచిరి. 'ఈ నగలు మన కెందులకు? ఇచటి ప్రజాసంఘమునకే ఇచ్చివేయుదము. మనకు నగలు కావలసివచ్చిననాడు సులభముగా విలిచికొనవచ్చు' ననిరి.

నేను పరమానందభరితుడనై 'మీ యమ్మతో జెప్పి యొప్పింపు' డంటిని.

వారును 'అట్లే చేయుదుము. ఆ భారము నాది. ఆమె ఈ నగలు పెట్టుకొనదు. మాకొరకు దాచి యుంచవలెననియే మక్కువ చెందును. మేము మా కక్కరలేదని చెప్పినచో అమ్మ ఎందులకు అడ్డము చెప్పును' అనుకొనిరి.

మరి అనుకొనినంత తేలిక పని కాదిది.

ఆమె నాతో 'ఇవి మీకక్కర లేకపోవచ్చును. మీబిడ్డలకు మీరు పాడించెదే పాటగాన, వారికి నక్కర లేకపోవచ్చును. వీనిని నేను పెట్టుకొనుటకు మీరు సమ్మతింపరని ముందే యెరుగుదును. మరి నా కోడండ్రమాట యేమందురు? వారికి నగలుండక తప్పదుకదా! రేపేమగునో ఎవరి కెరుక? అంత ప్రీతితో నిచ్చిన బహుమానములను వదలుకొనుట మాత్రము నావలనగాదు' అనెను.

వాద ప్రతివాదములు కొంతదూర మిట్లు ఎడతెగక నడచినపిమ్మట కన్నీటిప్రవాహముగూడ నందులకు దోడయ్యెను. నగలను వదలుకొనవలెనను నా పట్టు నేను విడువలేదు. తుద కెట్లో ఆమె నొప్పించుసరికి దేవతలు దిగి వచ్చిరి. 1896, 1901 సంవత్సరములనాటి కానుక లన్నియు నిచ్చివేసితిని. నాదిగాని, ధర్మకర్తలదిగాని యభీష్టము చొప్పున ప్రజాహితకార్యములకు వినియోగించుటకై ఆ సొమ్మును బాంకులో దాచుటకై ధర్మనిధి పత్రము వ్రాసితిని.

ఈ పని చేసినందులకు పిమ్మట నే నెన్నడు వగచినది లేదు. ఇందలి యౌచితిని నా భార్యయు క్రమముగా గ్రహించుకొనెను. ఈ పని పదపడి న న్నెన్నియో లోభములకు బాచి ప్రోచినది.

ప్రజారాధకుడు విలువగల కానుకలను పట్టదగదనియే నా దృఢాభిమతము.

సప్తమ భాగము: మరల భారతభూమిలో

30

నా మొదటి కాంగ్రెస్

మాతృభూమి చేరినపిమ్మట గొంతకాలము దేశ సంచార మొనర్చితిని. అది 1901-వ సంవత్సరము. కాంగ్రెసు మహాసభ కలకత్తాలో సమావేశమయ్యెను. శ్రీ (పదపడిసర్) దిన్షా వాచా ఆ సభ కధ్యక్షులు. నే నా సభకు వెళ్ళకుండు టెట్లు? నా కదియే కాంగ్రెసు ప్రథమ దర్శనము.

కాంగ్రెసుకు దారి యడిగి ఒక స్వచ్ఛంద సేవకుని వెంట రిపన్ కళాశాల కరిగితిని. కాంగ్రెసు ప్రతినిధు లచట చాల మంది విడిసియుండిరి. స్వచ్ఛంద సేవకులు గజిబిజిపడుచు, నొకరి నేదేని అడిగినచో నింకొకరికడ కంపుచు, వారు మరి యొకని చెంతకు బంపుచు నుండిరి. ఇక ప్రతినిధులంటిమా, వారి కొక నెల వనుచు లేదు.

ఎచట జూచినను మురికి కూపముగా నున్న దా స్థలము. అంతటను నీరు నిలిచి చితచితలాడుచుండెను. మరుగుదొడ్లు కొన్ని యున్నవి కాని వానిని దలచికొన్నచో నేటికి నోక

రింతలు తప్పవు. స్వచ్ఛంద సేవకుల నీ కళ్మలతనుగూర్చి ప్రశ్నింపగా 'ఆపని మాది కాదు; పాకీవాండ్రది' అనిరి. నా కొక చీపురిండంటిని. వారు నావంక తెల్లబోయి చూచిరి. చీపురు సంపాదించి మరుగుదొడ్డి బాగుచేసితిని. ఆ బాగుచేత నాకొరకు చేసికొంటినేకాని తక్కినవారి మాటయేమి? ఆ మహాజనమునకు జాలినన్ని దొడ్లు లేవుగాన వానిని మరల మరల బాగుచేయవలెను. అది నా తలకు మించిన పని.

మరి రెణ్ణాళ్ళకు గాని సభారంభము కాదు. కాంగ్రెసు కార్యాలయములో నాకేదేని పని దొరకినచో కొంత యనుభవము కలుగును గదా యని యెంచితిని. శ్రీ గోసాలుబాబు, భూపేంద్రనాథబాసులు కాంగ్రెసు కార్యనిర్వాహకు లగుటచే వారిలో భూపేంద్రబాబును 'నాకేదేని పని చెప్పుడు' అని యడిగితిని. ఆయన నన్ను తేరి కన్గొని 'నా చెంత పని యేమియు లేదు. గోసాలుబాబునొద్ద నున్నదేమో కనుగొను' మనెను.

గోసాలుబాబు నడిగితిని. ఆయన నన్ను పారజూచి, 'నా యొద్ద గుమాస్తాపని యున్నది. చేయుదురా?' యనెను.

'ఓహో. నా శక్తికి మించని పని యేదేని చేయుదు' నంటిని.

గోసాలుబాబు చొక్కాకు గుండీలను నౌకరే తగిలించెడి వాడు కావున అదిగూడ నేను చేయుచుంటిని. పెద్దలయెడ నా కెప్పుడును గురుభావమే. పిమ్మట వారికిది తెలిసినను నాచే నిట్టి పని చేయించుకొనుచున్నందుకు వా రన్యథా ఎంచుకొనలేదు.

వారి కిది యెంతయు సంతోషజనకముగూడ నయ్యెను. ఈ పరిచర్యచే నాకు గలిగిన లాభ మింతంత యని చెప్పజాలను.

కొలదినాళ్ళలో కాంగ్రెసువ్యవహారమంతయు నాకళించు కొంటిని. చాలమంది నాయకుల పరిచితియు నాకు లభించెను.

దక్షిణాఫ్రికానుగూర్చిన కార్యనిశ్చయము (Resolution) నేను ప్రస్తావించుటకు సర్ ఫెరోజిషా మెహతా సమ్మతించిరి. కాని ప్రస్తావనిర్ణాయక పరిషత్తు (Subjects Committee) కెవరు, ఎపుడు దాని నెరుకపరతురా యని నే నక్కజమందు చుంటిని. ప్రతిప్రస్తావమును బెద్ద లొకరు చేపట్టకతీరదు. ఒక్కొక్క ప్రస్తావమునుగూర్చి ఆంగ్లమున సుదీర్ఘములగు ప్రసంగములు దొరలిపోవుచుండెను. ఒకవంక చీకటిపడు చుండుట యరసి నాకు దడ జనించెను. సభనుండి వెడలి పోవుట కందరు తొందరపడుచుండిరి. రాత్రి 11 గంట లయ్యెను. తెగబడి ప్రసంగించుటకు నాకు ధైర్యము చాల లేదు. నా ప్రస్తావమును శ్రీ గోఖలే అంతకుమున్నే చూచి యుండిరి కావున నేను వారిని సమీపించి 'నా సంగతి కొంచెము చూడరా?' యని చెవిలో మనవిచేసితిని.

ఇంతలో శ్రీ ఫెరోజిషా మెహతా 'పని పూర్తి యైనట్లేనా?' యనిరి.

'లేదు లేదు. దక్షిణాఫ్రికాప్రస్తావ మట్లే యున్నది. దానికై గాంధి వేచియున్నాడు' అని శ్రీ గోఖలే కేకవైచిరి.

'మీ రా ప్రస్తావమును జూచితిరా ?' యని శ్రీ మెహతా ప్రశ్నించిరి.

'చూడకేమి ?'

'మీకు నచ్చినదా ?'

'చాల బాగుగా నున్నది.'

'ఇక నేమి, గాంధి ! కానిమ్ము.'

వణకిపోవుచు నేను ఆ ప్రస్తావము జదివితిని.

శ్రీ గోఖలే దానిని సమర్థించిరి.

'ఏకగ్రీవముగా' అని యందరు నరచిరి.

శ్రీ వాచా 'గాంధి! ఐదు నిముషములపాటు నీ వా ప్రస్తావమును వివరింపు' మనిరి.

ఈ వ్యవహారమంతయు నా కించుకేని నచ్చదాయెను. ఆ ప్రస్తావమునుగూర్చి తెలిసికొను ఆసక్తి అం దెవరికిని లేదు. వెడలిపోవుటకు దొందరపడుచుండిరి. శ్రీ గోఖలే చూచిరి కదా యని సంతుష్టి చెందుటేకాని ఆ ప్రస్తావమును చూచి గ్రహించుకొనగోరువా రెవరును లేరు.

కాంగ్రెసు సభ దాని నెట్లో ఆమోదించుటే కావలసిన దని నేను సంతుష్టి చెందితిని. కాంగ్రెసు ఆమోదించుట దేశ మంతయు నామోదించినట్లే యని యెరిగినవారికి సంతోషము గాక మరి యేమి ?

31

బొంబాయి నగరములో

నేను బొంబాయిలోనే ఉండి లాయరువృత్తి చేసికొనుచు ప్రజాహితకార్యముల దమకు దోడ్పడుచుండవలెనని శ్రీ గోఖలే అభిలషించిరి. అనుకొన్నదానికంటె నా రాబడి కొంత మెరుగుగానే యుండెను. దక్షిణాఫ్రికాయందలి నా స్నేహితులు తమ పనులు నా కప్పగించుచుంటచే నాకు గొంత వెసులుబాటు చిక్కెను.

నే నచటనే ఉండిపోనెంచి కొంచెము కాలు నిలద్రొక్కుకొనుచున్నంతలో దక్షిణాఫ్రికానుండి ఆకస్మికముగా కేబుల్ వార్త వచ్చెను. 'శ్రీ చాంబర్లెయిను ప్రధాని ఇచటి కరుదెంచుచున్నారు. తొందరగా దయచేయుడు' అను నా వార్త చూచుకొని, అచటి వారికి నే నిచ్చిన మాటను స్మరించి, 'సొమ్ము పంపిన వెంటనే బయలుదేరుదు' నని ప్రత్యుత్తర మంపితిని. వారు ఆలసింపక సొమ్ము పంపిరి. లాయరుపని కట్టిపెట్టి దక్షిణాఫ్రికాకు పయనము గట్టితిని.

అష్టమ భాగము : మరల దక్షిణాఫ్రికాలో

32

మరల దక్షిణాఫ్రికా

నేను దక్షిణాఫ్రికా చేరుట కొక్కదిన మాలస్యమైనచో దర్శనము మించిపోయెడిదే. పనియంతయు నెచటిదచటనే ఉండిపోయెను. చాంబర్లెయిను మంత్రిని దర్శించు **ముహూర్త**మేమో నిశ్చితమయ్యెను. ఆయనకు సమర్పింపవలసిన విన్నపమును సిద్ధముచేసి నేనుగూడ ఇతరులతోపాటు ఆ మంత్రి చెంతకు రాయబారము పోవలసియున్నది.

చాంబర్లెయిను మంత్రి మమ్మంతగా నాదరింపక, 'మీ రెఱుగుదురుకదా — ఈ వలవరాజ్యములు స్వతంత్రములని. సామ్రాట్ప్రభుత్వపు టదుపాజ్ఞలలో నివి మెలగవు. మీకు అన్యాయము జరుగుచున్న మాట నిజమనియే కన్పించుచున్నది. నాచేతనైనదేమో చేయుదును. కాని మీ రీ ఐరోపియనుల మధ్య నుండవలసినవారుగాన వారిని మంచిచేసికొనుట మేలు' అనియెను.

ఈ మాటలతో మాకు కాళ్సేతులు చల్లబడినవి. నాకును ఆశాభంగము కలిగెను. మా కనుల గ్రమ్మిన పొర లంతట వీడి

పోయెను. మా వ్యవహారమంతయు మరల మొదటికి వచ్చెను. ఉన్న విషయమంతయు మావాండ్రకు దెలియజెప్పి 'మీకడ దాపరిక మెందులకు? నన్ను మీరు పిలిపించినపని యింతట ముగిసినట్లే. కాని, ఇంటికేగుటకు మీరు నన్ననుమతించినను, సాధ్యమైనంతవట్టు ట్రాన్సువాల్ లోనే నే నుండిపోవుట మేలని తోచుచున్నది. తొల్లిటివలె నేటాలునుండికాక ఇచటనే యుండి నేను పనిచేయవలెను. ఇంకొక సంవత్సరమువరకు నే నింటికేగుట పడదు. కావున ట్రాన్సువాల్ సుప్రీము కోర్టులోనే నేను లాయరువృత్తి సల్పుదును. ఈ క్రొత్త ప్రభుత్వశాఖతో వ్యవహరింపనేర్తునను ధైర్య మున్నది నాకు. మన మిప్పు డూరకయున్నచో మన కీ దేశమునుండి ఉచ్చాటన తప్పదు' అని వివరించితిని.

వెంటనే కర్తవ్యమునకు గడంగి, ప్రిటోరియాలో, జోహాన్సుబర్గులోనుండు భారతీయులతో సంప్రదించి జోహాన్సుబర్గులో ప్లీడరువృత్తి ప్రారంభించితిని.

33

గీతాధ్యయనము

గీతలన్నచో నా కాసక్తి మెండు. నా కప్పటికే వానిపై భక్తి కుదిరెను. వాని నింకను లోతుగా తరచి చూడవలసి

యున్నదని నే నిపుడు తెలిసికొంటిని. మూలగ్రంథమును, నాకడ నున్న ఒకటి రెండు భాషాంతరీకృతుల సాయమున అర్థముచేసికొనుచు దినమునకు ఒండో, రెండో శ్లోకములను కంఠపాఠము చేయ సంకల్పించితిని. ప్రాతస్స్నానవేళలం దాపని చేయదొడగితిని. పలుదోమికొనుటకు పదునేను, స్నానమునకు నిరువదియు నిముసములు పట్టునుగాన ఆ పనులు చేయునపుడు—శ్లోకలిఖిత పత్రముల నెదుటి గోడ కంటించి, ఎడనెడ వానిని వీక్షించుచు వల్లెవేసెడివాడను. ఏనాటి శ్లోకము లానాడు వల్లించుటకు, ప్రాతవి నెమరువేసికొనుటకు ఆ సమయము సరిపోయెడిది. ఈ విధముగా బదుమూడధ్యాయములు కాబోలు వల్లించితిని.

గీత నాకు శీలోపదేష్ట. నిత్యము సందేహాపదములందు నా కది ప్రమాణగ్రంథము. 'అపరిగ్రహము', 'సమభావము' వంటి మాటలు నాపాలిటికి మంత్రములైనవి. ఆ సమభావము నలవరచికొని వీడకుండు టెట్లు? నా సర్వస్వము వదలికొని స్వామి నాశ్రయింపవలెనా? ఈ ప్రశ్నములకు వెంటనే 'సర్వధర్మములను పరిత్యజించినగాని న న్నాశ్రయింపలేవు' అని సమాధానము వచ్చెను. అంతట శ్రీ రేవాశంకరభాయికి నా యిన్స్యూరెన్సు పట్టమును అంతరింపజేసి, వచ్చినంతవట్టు రాబట్టుడనియు, అట్లు వీలుపడనిచో ఇంతకుమున్ను చెల్లించిన వాయిదాల సొమ్ము రద్దయినట్లే ఎంచదగుననియు. నన్ను, నా యాలుబిడ్డలను సృజించిన ఈశ్వరుడే మమ్ము రక్షింపగలడను విశ్వాసము నాకు జనించెననియు వ్రాసితిని. నాకు దండ్రివంటివా

డగు అన్నకు, 'నే నింతవరకు గూడబెట్టిన సొమ్మంతయు మీరు కైకొనుడు ఇక నా గడనపై ఆసపెట్టుకొనకుడు. అది యెల్ల ఇచటి ప్రజలకే వినియుక్తమగును' అని తెలిపితిని.

34

నన్ను మంత్రముగ్ధు నొనర్చిన గ్రంథము

మిత్రమగు శ్రీ పోలకు నన్ను దర్బానుకు సాగనంపుచు, త్రోవలో గాలక్షేపమునకై నా కొక పుస్తకమిచ్చి 'ఇది మీకు రుచించును, చదువు' డనెను. రస్కిను రచించిన 'అంటు ది లాస్టు' (Unto the Last) అను గ్రంథ మది.

చదువదొడగినంతనే మంత్రముగ్ధుడనైనట్లు ఆ గ్రంథమును విడువలేకపోతిని. జోహాన్సుబర్గునుండి దర్బాను కిరువది నాల్గు గంటల ప్రయాణము. ప్రొద్దు క్రుంకువేళ కచటికి జేరితిని. ఆ రేయి నిదుర పట్టలేదు. ఆ గ్రంథములోని ఉపదేశములవెంట నా జీవితమును నడ్డికొనవలెనను నిశ్చయ మేర్పడెను.

చిరప్రరూఢములగు నా యాశయములు కొన్ని ఆ పుస్తకమున బ్రతిఫలించుచున్నట్లు నాకు గన్పించెను. కావున నన్నది లోగొని నా బ్రదుకు తీరును దిద్దికొనజేసెను.

1. సమష్టి సౌఖ్యమే వ్యష్టి సౌఖ్యము.

2. వృత్తులన్నియు జీవనోపాధులేగాన లాయరు వృత్తియు మంగలివృత్తియు తుల్యగౌరవములే.

3. జీవన మన్నచో – కాయకష్టముచే బ్రదుకు కర్షకులది, చేతిపనులవారిదే జీవనము.

ఇవి, ఆ గ్రంథమందలి యుపదేశములని నాకు దోచెను.

ఇందు మొదటిది నా యెఱిగినదే. రెండవదియు గొంతకు గొంత నా కనుభూతమే. మూడవది నాకు గ్రొత్తది. వీనిలో ద్వితీయ తృతీయములు ప్రథమోపదేశమం దంతర్భూతములే యని ఆ గ్రంథము నాకు గరతలామలక మొనర్చెను. ప్రొద్దుతో గూడ మేలుకొని ఆ యుపదేశముల నాచరింప గడంగితిని.

35

ఫోనిక్సు వసతి

నేనపుడు 'ఇండియన్ ఒపీనియన్' అను వారపత్రిక ప్రచురించుచుంటిని. పత్రికా ముద్రణకార్యము శ్రీ వెస్టు చూచుచుండెను. 'అంటు దిస్ లాస్టు' చదువుటచే నాలో గలిగిన పరిణామమునుగూర్చి ఆయనతో సంప్రదించితిని. మన మొక పొలములో వసతి యేర్పరచుకొని, పొలముపని చేసికొనుచు,

తీరిక వేళల పత్రికాకార్యము చూచుకొనుచు, అందరము సమముగా దలకు మూడు పౌనుల చొప్పున నెలబత్తెము దీసికొనుచు బ్రదుకుదమని నేను చెప్పినంతట శ్రీ వెస్టు వల్లెయనెను. నెలబత్తెము విషయమున తెలుపు నలుపు భేదముతో బని లేదనుకొంటిమి.

ఈ విధముగా 1904 లో 'ఫోనిక్సు వసతి' అవతరించెను. అటనుండియే కడగండ్లను లెక్కసేయక 'ఇండియన్ ఒపినియన్' పత్రికను ప్రచురించుచుంటిమి.

ఇక ఇప్పటిలో స్వదేశమునకు వెళ్ళగలనను నాస వదలికొంటిని. సంవత్సరము దాటకుండ దిరిగి వత్తునని నా భార్యతో జెప్పివచ్చినవాడను, ఆ గడువు దాటినను, బయలుదేరుటకు వీలుపడలేదు. కావున ఆలుబిడ్డల నిటకే రావింప నిశ్చయించితిని.

36

జూలూ తిరుగుబాటు

కొంచెము తీరిక చిక్కిన దనుకొని సంతసించుచున్న తరుణమున అప్రతర్కితముగ నొక చిక్కు వచ్చిపడెను. నేటాలులో జూలూ జాతి తిరుగుబాటు చేసెనన్న వార్త పత్రికలందు పొక్కెను. జూలూలపై నా కెట్టి యీసును లేదు. వారెన్నడు భారతీయుల కపకృతి చేసియెరుగరు. కాని

ఆ తిరుగుబాటు యుక్తమా యని నేను సంశయించితిని. బ్రిటిషు సామ్రాజ్యము లోకహితార్థ మేర్పడినదని నే నపుడు నమ్ముచుంటి నాయెను. నేటాలు రక్షణకై వలంటీరు దళ మొకటి యేర్పడియుండెను.

నేటాలుతో గాఢసంబంధమున్న నేనును నేటాలు పౌరుడనే యని యెంచికొని 'పనివడినచో భారతీయులము క్షతగాత్రులకు బరిచర్య చేయుదుము' అని గవర్నరుకు విన్నప మంపితిని. ఆయన వెంటనే అంగీకరించెను.

నేను దర్బాను పురికేగి పరిచారకదళమున జేరుడని భారతీయులను కోరితిని. అచటి ప్రధాన వైద్యాధికారి నన్ను తాత్కాలికపు సార్జంటు మేజరును గావించి, నాకు నచ్చిన వారిలో ముగ్గురను సార్జంట్లుగాను, ఒకని కార్పొరల్‌గాను నియమించుకొనుటకు నా కధికారమిచ్చెను. దీనిచే నా కుచిత ప్రతిపత్తి లభించి, పనిసుకరమగుటే కాక, సేనలో నట్లొనరుప నాచారముకూడ కలదు గావున నేనా నియామకము నంగీకరించితిని. సర్కారు మాకు సైనికుల దుస్తుల నొసగెను. మా సేవాదళము ఆరువారముల కాలము పరిచర్య లొనరించెను. క్షతగాత్రులగు జూలూలకు బరిచర్య చేయుటయే మాపని. వైద్యాధికారి మారాక కెంతయు సంతోషించెను. తెల్లవాండ్రు జూలూలకు బరిచర్య మనసార జేయమిచే క్షతగాత్రుల గాయములు కుళ్ళి చెడిపోవుచుండెననియు, తన కేమి చేయుటకును దోచకుండెననియు ఆ యధికారి చెప్పి, 'నిరపరాధులగు ఈ జనుల పాలిటి ఈశ్వరుడే మిమ్ము బంపించె' ననెను.

37

కస్తూరిబా ధీరత్వము

నాకు మిత్రమగు నొక వైద్యుడు కస్తూరిబాకు శస్త్ర చికిత్స అవసరమని చెప్పెను. ఆమె కొంతవడి సంశయించి తుదకు సమ్మతించెను. ఆమె చాల చిక్కిపోయి దుర్బలముగా నుండుటచే మత్తుమం దీయకయే శస్త్రచికిత్స నాతడొనర్చెను. చికిత్స చక్కగనే జరగెను గాని అపరిమితమగు బాధ కలిగెను. అద్భుతమగు ధైర్యముచే నాబిడ ఆ బాధ నంతటి నోర్చుకొనెను. వైద్యుడు నాయన భార్యయు నెంతో శ్రద్ధమై ఉపచారములు సల్పిరి. ఈ చికిత్స దర్బానులో జరగెను. వైద్యుడిక నామెకు భయములేదు. మీరు నిశ్చింతగా వెళ్ళవచ్చును' అని చెప్పినమీదట నేను జోహాన్సుబర్గు కేగితిని.

కొలదినాళ్ళకే కస్తూరిబాయి స్థితి చెడినదనియు లేచి కూరుచుండలేకున్నదనియు, నొకపరి స్పృహకూడ తప్పె ననియు నాకు లేఖయందెను. నా యనుమతి లేనిదే ఆమెకు మద్యమాంసము లిచ్చుట అయుక్తమని యెంచి వైద్యుడు గోమాంస పానమును రోగి కిచ్చుటకు టెలిఫోను ద్వారమున నా యనుమతి నర్థించెను. నేనందుల కనుమతింపజాలననియు, కస్తూరిబా చెప్పగల స్థితిలో నున్నచో నామె యభిమతము వెంట నడచుకొనుట యుచితమనియు నేను దెలిపితిని. 'రోగి

యభీష్టముతో నాకు బనిలేదు. మీరు రావలయును. నా యిష్టము చొప్పున పథ్యపానకములు కడువనిచో మీ భార్య యేమగునో చెప్పలేను' అనియెను డాక్టరు.

ఆనాడే దర్బానుకు రైలెక్కి పోయితిని. వైద్యుడు నన్ను దరియవచ్చి 'మీకు జెప్పునప్పటికే శ్రీమతికి గోమాంస పారము నిచ్చితి' నని చల్లగా దెలియ జెప్పెను.

నేను 'ఎంత మోసము చేసితిరండీ' అంటిని.

'రోగికి ఔషధమును. పథ్యము నిచ్చుటలో మోసపు ప్రసక్తియే యుండదు. రోగిని రక్షించుటకై రోగులను, తద్బంధువులను ఇట్లు మోసగించుట వైద్య ధర్మము' అని ఆయన నిశ్చలముగ బదులు పలికెను.

నా మనస్సునకు జాలిబాధ కలిగెను గాని తాలిమి వహించితిని. సజ్జనుడు. నా కాప్తమిత్రముడగు డాక్టరు నేమన గలను? ఆ యాలుమగ లిరువురును నా కొనర్చిన మహోప కారమెట్లు మరవగలను? అట్లయ్యు ఆయన చెప్పిన వైద్య ధర్మమునకు మాత్రము తలయొగ్గలేను.

'అయిన దేదియో అయినది. ఇపుడు కర్తవ్యమేమి? నా భార్య ప్రాణముమీదికి వచ్చినను సరియే, మాంసాదు లిచ్చుటకు నే నంగీకరింపను. ఆమె యిష్టపడి పుచ్చుకొన్నచో నేకష్టము చెప్ప' నంటిని. ఆయన 'మీ నీతిధర్మములను నేను కాదనుగాని ఒక్కమాట చెప్పుచున్నాను. వినుడు. నేను చికిత్స చేయుచున్నంతవరకు ఆమె పథ్యపానకములు నా యిష్టమువెంట జరగవలెను. మీ కిది సమ్మతము కానిచో

నామె నిటనుండి తీసికొని పొండని, సవిషాదముగా నేను చెప్పక తప్పదు. నా యింటిలో నామె మరణించు చుండగా నూరక చూచుచుండుట నా వలనగాదు' అని ఖండితముగా జెప్పి వైచెను.

అపుడు నా పుత్రులలో నొకడచటనుండెనని జ్ఞాపకము. ఆతడు తన తల్లికి గోమాంసరసము నిచ్చుట దోషమని చెప్పి నాతో నేకీభవించెను. కస్తూరిబా చాల నీరసించి యున్నది. ఆస్థితిలో నామె నడిగి బాధించుట తగదని యెరిగియు అడుగుట నా విధియని యెంచి, డాక్టరుకు, నాకు జరిగిన సంభాషణము వినిపించితిని. 'గోమాంసరసము నాకు వలదు. పరమ దుర్లభ మగు మానవజన్మ మెత్తి శరీరము నిట్లు కలుపిత మొనర్చుట కంటె మీ చేతులమీదుగా వెళ్ళిపోవుటయే నాకు ప్రియ' మని ఆమె ఖండితముగా జెప్పివేసెను.

నే నామెకు బలువిధముల జెప్పిచూచితిని. నీవు నన్ననుసరింప నక్కరలేదంటిని. మా వా రెందరో మద్య మాంసముల నౌషధముగా సేవించుచుండిరని చూపి చెప్పితిని. ఎంత చెప్పినను ఆమె వినేమిరా యనెను. 'నన్నిటనుండి కొనిపొం' డని బ్రతిమాలెను.

అటనుండి వెడలిపోవుటకే నిశ్చయించుకొంటిమి. రైలు స్టేషను దవ్వున నున్నది. వానతుప్పర పడుచున్నది. మేము దర్బానులో రైలెక్కి ఫోనిక్సులో దిగి అటనుండి మా విడిదికి రెండున్నరమైళ్ళు పోవలెను. అయినను దైవముపై భారమిడి నే నా సాహసమును కొడిగట్టితిని. 'అర్గురు మనుజులతో నొక

డోలీ పట్టించుకొని వేడిపాలు, వేడినీరు సీసాలతో దీసికొని స్టేషనుకు రం' డని శ్రీ వెస్టుకు వార్త అంపితిని. కస్తూరిబా కొరకు ఒక రిక్షా మాటలాడితిని. ఆ యపాయస్థితిలో నామె నం దెక్కించి స్టేషనుకు గొంపోతిని.

కస్తూరిబాకు నేను ధైర్యము చెప్పవలసినది లేకపోగా ఆమెయే 'నాకు వచ్చిన భయములేదు. మీ రలజడి చెందకు' డని నాకు ధైర్యము గరపెను.

అప్పటి కామె నోటిలోనికి మెదుకులుపోయి యెన్నాళ్ళాయెనో, శల్యావశిష్టయై యున్నది. స్టేషను ప్లాటుఫారము చాలపొడవుగా నుండెను. రిక్షాను లోనికి బోనీయరు. కావున రైలుచెంతకు నడచిపోవలెను. నేనే ఆమె నెత్తికొని రైలులో గూర్చుండ బెట్టితిని. ఫోనిక్సు స్టేషనునుండి డోలీలో గొనిపోయితిమి. అచట జలచికిత్సచే నామె యించుకించుకగా గోలుకొన్నది.

38

ఇంటిలో సత్యాగ్రహము

ఒక కొన్నినాళ్ళకు కస్తూరిబా మరల వ్యాధిగ్రస్త యయ్యెను. నా వేయు చికిత్సల కామె యెదురాడదుగాని వానియందు విశ్వాసముమాత్ర మామెకు లేదు. అటులని

ఇతరవైద్యమును ఆమె కోరెడిది కాదు. నేను చేసిన చికిత్స లెల్ల నిష్ఫలములగుడు, ఉప్పును, పప్పుదినుసులు దినుట మాను కొమ్మని యామెను బతిమాలితిని. నే నెంత చెప్పినను, ఎన్ని ప్రమాణములు చూపినను ఆమె నామాట విన్నదికాదు. తుద కామె 'ఒకరికి చెప్పుట కష్టముకాదు; మీరే మానవలసి వచ్చినపుడుగాని తెలిసిరా' దని న న్నెత్తిపొడిచెను. నా మనసు చివుక్కుమనెను గాని ఒకయందుకు సంతోషము నుప్పతిల్లెను: నా ప్రేమ మా యబలపై వర్షించుట కిదె తరుణముగదా యని నే నంతట 'నీవు పొరపడుచున్నావు. నాకే జబ్బుగానుండి, వైద్యుడు పరిహరింపు మనినచో, వీనినే కాదు, వేనినైన మరుమాట చెప్పకుండ బరిహరింతును. నీకు నమ్మకము లేదేని ఇదిగో, వైద్యుడు చెప్పకుండగనే ఈ పప్పును. ఉప్పును సంవత్సరమువరకు నేను ముట్టను. నీవు మానుదువో. లేదో నా కక్కరలేదు' అంటిని.

ఈ నా ప్రతిన కామె నిర్ఘాతపడి 'నన్ను మన్నింపుడు. బుద్ధిమాలినదానను, మి మ్మెరిగియుండియు. న ట్లంటిని. మీ చెప్పిన ట్టీ పదార్థములు నేను వర్జింతును. మీ పున్నెమామె, ఈ ప్రతిజ్ఞ ఉపసంహరింపుడు. నే నా బాధ భరింపలే' ననుచు బిట్టు విలపించెను.

'నీ వీ వస్తువులు వర్జించితివేని మేలు కలుగును. సందేహములేదు. ఇక నా మాట యంటివా, మనస్ఫూర్తిగా చేసిన ప్రతిజ్ఞ విడనాడుట నావలనగాదు. ఏకారణమున దాల్చినను ఇట్టి నిగ్రహమువలన నాకును మేలే చేకూరును.

కావున నాకై విచారింపకుము. నా కిది పరీక్ష. దీనిచే నీ మాటను నిలిపికొనుటకు వలయు మనోబలము నీకును సమకూరు' ననుచు నా పట్టు విడువనైతిని.

ఆమె యంతట నాతో వాదించి ఫలములేదని యెంచి, 'మీ మంకుపట్టు మీదియేగాని ఒకరిమాట యెన్నడేని వింటిరి కనుకనా' యనుచు కన్నీరోడ్చుచు మిన్నకుండెను. నా సత్యాగ్రహప్రయోగములలో నిదియొక ఘట్టమగుటేకాక నా జీవితమున నిదియొక మధురస్మృతియు నాయెను. పిమ్మట కస్తూరిబా త్వరితముగ గోలుకొనెను.

39

సత్యాగ్రహోదయము

జూలూ తిరుగుబాటు ముగిసినపిమ్మట ఫోనిక్సులో మిత్రుల గలసికొంటిని. తరువాత జోహాన్సుబర్గు కేగితిని. అచట ట్రాన్సువాల్ సర్కారు 22-8-06 న విశేష గెజెటులో ప్రచురించిన ఆతురశాసనము (Ordinance) జదివి రిచ్చవడితిని. దక్షిణాఫ్రికాయందలి భారతీయుల కది సర్వనాశము దల పెట్టెను. అచట నివసించుట కర్హతగల స్త్రీ పురుషులు, ఎనిమిదేండ్లకు పైబడిన పిన్నలుగూడ ఆసియావాసుల రిజిస్ట్రారు కడ తమ తమ పేరులు నమోదుచేయించుకొని అనుమతి

పత్రముల దీసికొనవలెనట. తమ యొద్దనున్న ప్రాతపత్రములను రిజిస్ట్రారుకు దఖలుపరచి క్రొత్తపత్రములకు దరఖాస్తు పెట్టుకో వలెనట. అందు తమ పేరు, నివాసము, కులము, వయస్సు, మున్నగునవి తెలుపవలెనట. దరఖాస్తుదారుని చహరాను (Identification marks) రిజిస్ట్రారు నమోదుచేసికొని, ఆతని వ్రేలి ముద్రలను తీసికొనునట. ఒక గడువులోపల రిజిస్ట్రారుకు దరఖాస్తు లంపనివారు ట్రానువాలులో నివసించు నర్హతను గోల్పోవుదురు. దరఖాస్తు లంపికొనకుండుటను నేరముగా నెంచి జరిమానా విధింతురట, బందె బెట్టుదురట, దేశభ్రష్టుల నొనర్తురట. రాచబాటపై నడచునపుడుగూడ అనుమతిపత్రములు చెంత నుంచికొని, అడిగినపుడు చూపింపవలెనట. ఈ పత్రముల పరిశోధనకై పోలీసుద్యోగులు గృహస్థుల యిండ్లలో ప్రవేశింప వచ్చునట. లోకమున నెందును స్వతంత్రప్రజ నిట్టి శాసనమునకు గురిచేసిన ప్రభుత్వమున్నట్లు నేను కని విని యెరుగను.

అచటి భారతీయులలో ముఖ్యులను మరునాడు కూడ బిలిచి వారి కీ శాసనసారమును వివరించి చెప్పితిని. నావలెనే వారును నిర్ఘాంతపడిరి. దారుణమగు ఈ సంకటమును గ్రహించి వారెల్ల రొక మహాసభను చేయుటకు సంకల్పించిరి.

11-9-06 న మహాజన సమావేశము జరిగెను. అపుడు చేసిన కార్యనిశ్చయములలో నాలుగవది అతిప్రధానమై ప్రసిద్ధి కెక్కెను. ఇట్టి శాసనము చేయుట తగదని ప్రతి ఘటించుటకును, ఆ ప్రతిఘటన నిష్ఫలమైనచో ఆ శాసనమునకు

దల యొగ్గక, కష్టనష్టముల ననుభవించుటకును నాలుగవ ప్రస్తావమున కార్యనిశ్చయము జరగినది.

ఈ యుద్యమమున కేమి పేరు పెట్టవలెనో మాకు దోచినదికాదు. శ్రీ మగన్లాలు గాంధి 'సదాగ్రహ' మని పేరిడెను. సత్కార్యములందు స్థైర్యమని ఆ మాట కర్థము. ఆ పేరు బాగుగనే యున్నది. కాని నా మనసులో నున్న దంతయు నందు ప్రతిఫలింపమిచే నేను దానిని 'సత్యాగ్రహము' అని దిద్దితిని. ఇందు సత్యము ప్రేమను, ఆగ్రహము ప్రతి ఘటనశక్తిని బోధించును. ఈ శక్తికి సత్య ప్రేమలే మూల కందము. ప్రేమ మరగా అహింస. అంతకుమున్ను వాడు చున్న 'తటస్థ ప్రతిఘటనము' (Passive Resistance) అను పేరు నంతట విడనాడి ఆ భారతీయోద్యమమునకు సత్యాగ్రహ మని నామకరణ మొనర్చితిని.

40

కా రా గృ హ వా స ము

ఇట్లు తలయెత్తిన యుద్యమమును బిదుకపొడువవలె నన్నచో ప్రధాన్నాయకులను బంధించుట కర్తవ్యమని తలపోసి పసియాటికు డిపార్టుమెంటు మాలో గొందరని బందెబెట్టెను.

మమ్ము అట్లు బందె నిండినంతనే మావాండ్రు జెయిళ్లు నింప నిశ్చయించిరి.

బందిఖానాలో మాకు పక్షము దినములు గడచుసరికి క్రొత్తగా మరికొందరు జెయిలులోనికి వచ్చి, ప్రభుత్వముతో రాజీబేరము సాగుచుండెనని వార్త గొనితెచ్చిరి. భారతీయులు తమంతదామే పేరులు నమోదు చేసికొనవలెననియు, అధికసంఖ్యాకు లట్లు బుద్ధిపూర్వకముగా రిజిస్టరు చేసికొనిన పిమ్మట సర్కారీ నల్లశాసనమును రద్దు చేసికొనవలెననియు—ఇది ఆ రాజీసారము.

ఆ యొడంబడికకు నే నొక సవరణను సూచించితిని. దానినిగూర్చి స్మట్సు సేనానితో మాటలాడుటకై నన్ను ప్రిటోరియాకు గొంపోయిరి. ఒడంబడిక ముసాయిదా ఉభయులచే నంగీకృత మయినపిమ్మట కారాగృహమునుండి మాకు విముక్తి యొదవెను. ఆ యొడంబడికను నా ప్రజలకు వివరించి చెప్పుచు నేను కొన్నాళ్లు పలుతావుల సంచరించితిని.

41

దండప్రహారణము

వ్రేలిముద్ర లిచ్చుటకు సమ్మతించితినని ఇరువురు పఠానులకు నామీద గుఱ్ఱుగా నుండెను. తొలినాడే ఉద్యమ

నాయకు లనుమతిపత్రములను గైకొనుట కేర్పాటు చేసికొంటిమి. సత్యాగ్రహ సమితి కార్యాలయము నా సొంత యాఫీసులోనే యుండెను. నే నట కేగుసరికి మీర్ ఆలం మున్నగు కొందరు పఠానులు వాకిట నిలిచియుండిరి. మీర్ ఆలం వ్యవహారములు నేనే చూచుచుంటిని. పనిపడినపుడెల్ల నాతడు నాకడ కేతెంచెడివాడు. ఆత డారడుగుల యెత్తుగ ఒడ్డు పొడవు గల దృఢగాత్రుడు. ఎప్పుడును లోనికి వచ్చెడివా డానా డాత డేలనో వాకిట నిలిచియుండెను. అలవాటు చొప్పున నా కానాడు సలామును చేయలేదు. నేనే సలాము చేయగా నాతడు ప్రతిసలాము చేసెను. ఎప్పుడును మంద హాసముతో ప్రసన్నముగా నుండువా డాతని కను లానాడు జేవురించియుండుట కనుపెట్టితిని. ఏదో మూడనున్నదని అనుకొంటిని. అధ్యక్షుడగు శ్రీ యూసఫ్ మయాా మున్నగువా రేతెంచినంతట ఆసియాటికు ఆఫీసు కందరము బయలుదేరితిమి. మీరాలం సమిత్రముగా మావెంట వచ్చుచుండెను.

మరి రెండుమూడు నిముసములలో రిజిస్ట్రా రాఫీసుకు చేరుదు మనగా మీరాలం నాచెంత కేతెంచి 'ఎచటి కేగుచుంటి?' యని యడిగెను. 'నా పదివ్రేళ్ళ ముద్రలు నిచ్చి అనుమతిపత్రము తెచ్చికొన బోవుచున్నాను. మీరుగూడ వత్తురేని మీ పత్రము ముందుగా నిప్పింతును. మీరు బొటన వ్రేళ్ళ ముద్రలు రెండుమాత్ర మిచ్చిన చాలును. పిమ్మట నా పదివ్రేళ్ళ ముద్ర లిచ్చి పత్రము దీసికొందు' నంటిని.

ఈ తుదివాక్యము ముగియకుండనే వెనుకనుండి నా తలపై చబుకుదెబ్బ పడెను. 'హేరామ' యనుచు నేలపై బడి నేను మూర్ఛిల్లితిని. పిమ్మట మీరాలము, ఆతని మిత్రులు నన్ను కాలదన్నుచు, మరికొంత ప్రహరించిరట. అడ్డము సొచ్చిన శ్రీయుతులు యూసఫ్ మయార్, తంబినాయుళ్ళకుగూడ కొన్ని దెబ్బలు తగిలెనట కాని నాకు స్పృహ లేదు. ఆ త్రోవ నేగుచు ఈ సందడి గాంచిన కొంద రైరోపీయులుగూడ నచటి కేతెంచిరి. మీరాలము, నాతని మిత్రులు బారిపోవుచుండగా వీరు వెన్నాడి పట్టుకొనిరి. ఇంతలో నచటి కేతెంచిన పోలీసులకు వారి నప్పగించిరి.

ఒడలెరుగక పడియున్న నన్ను శ్రీ జె. సి. గిబ్సను కార్యాలయమునకు దరలించుని పోయిరి. నేను కనులువిప్పి చూచుసరికి శ్రీ దోక్ నాదెసకు వంగి చూచుచు 'ఎటులున్నది మీకు?' అని యడిగెను. నేను 'బాగుగనే యున్నది కాని పలువరుసయు, డొక్కలు నొప్పిగా నున్నవి. శ్రీ ఆలం ఏమాయెను?' అంటిని.

'ఆతని ననుయాయులతోగూడ పోలీసులు బంధించిరి.'

'వారిని విడిపించవలెను.'

'అది యటు లుండనిండు కాని మీ రిచట నొక యపరిచితు నింట నున్నారు. మీ పెదవియు, చెక్కిలియు జీరుకొనిపోయి వాచి యున్నవి. పోలీసులు మిమ్ము ఆసుపత్రికి గొంపోవుదురు. కాని మా యింటి కేతెంచినచో నేను, నా యిల్లాలు మా చేతనైన యుపచారములు చేయుదుము.'

'మంచిది. నన్ను మీ యింటికే కొనిపొండు. పోలీసులకు నేను కృతజ్ఞుడనని తెలిపి మీ యింటికి వెళ్ళుదుననిచెప్పుదును.'

ఇంతలో ఆసియావాసుల రిజిస్ట్రారు శ్రీ చామ్నీ కూడ నచటి కేతెంచెను. శ్రీ దోక్ క్రయిస్తవ పురోహితుడు. ఆ సజ్జనుని యిల్లు స్మిట్టువీధిలో నున్నది. నన్నటకు గొంపోయి వైద్యుని రావించిరి. నేను శ్రీ చామ్నీతో 'నా పదివ్రేళ్ళ ముద్రలు నిచ్చి మొట్టమొదటి అనుమతిపత్రమును మీకడ గ్రహించు కుతూహలమువైచే మీ కార్యాలయమునకే వచ్చుచుంటిని. ఈశ్వరవిలాసముచే త్రోవలో ఈ పని జరగినది. మీ రా కాగితములు నిటకు దెప్పించి వెంటనే నా పేరు రిజిస్టరు చేయింప వేడెదను. నాకంటె ముందుగా మీరు మరియొకరి పేరు నమోదుచేయ జనదు' అంటిని.

శ్రీ చామ్నీ 'ఆపని కిపుడేమి తొందరవచ్చినది? ముందు డాక్టరును రానిండు. ఆయన వచ్చి చూచినమీదట మీకు విశ్రాంతి గైకొన్నచో నంతయు జరుగబడును. ఇతరుల పేర్లెల్లను నేను నమోదు చేసినను ఆదిలో మీ పేరునకెడముంచియే చేయుదు' ననెను. నేను 'అట్లుకాదు, ఈశ్వరానుగ్రహమున నేను బ్రతికియున్నచో మొదటి అనుమతిపత్రము తీసికొందునని ప్రతిన చేసితిని. కావున ఆ పత్రములు నిపుడే యిటకు దెప్పింపు' డని పట్టుపట్టితిని.

అంతట శ్రీ చామ్నీ ఆ పత్రములు గొనిరా నేగెను.

నన్ను బ్రహరించిన మీరాలం ప్రభృతులపై నేను నేరము మోపననియు, వారిని దండించుటకై కోర్టు విచారణ

నడుపవలదనియు, నా మాట మన్నించి వారిని వదలివేయు డనియు అటార్నీజనరల్ పేర తంతివార్త పంపుట కర్తవ్య మని యెంచి ఆ పని చేసితిని. కాని జోహాన్సుబర్గులోని ఐరోపియనులు అటార్నీజనరలుకు 'దోషులను దండించు విషయమున గాంధి చెప్పెడి నీతిశాస్త్ర మీ దక్షిణాఫ్రికాలో చెల్లుటకు వీలులేదు. గాంధి స్వయముగా దోషారోపణ చేయక పోవుగాక. ఈ యత్యాచారము రాచబాటపై జరిగినది కాన ప్రభుత్వ ముపేక్షించుటకు వీలులేదు. చాలమంది ఆంగ్లేయు లీ నేరమును జూచినవా రున్నారు. వారందరు కోర్టులో సాక్ష్య మీయగలరు. కనుక వ్యవహారము నడుపవలసినదే' యని కఠినముగా నొక లేఖ వ్రాసి యంపిరి. కావున అటార్నీ జనరలు మీరాలమును, మరియొకరిని మరల బంధించెను. వారు మూడు నెలల కఠిన కారావాస దండనమునకు పాత్రులైరి.

భారతీయ ప్రజ నుద్దేశించి సంఘాధ్యక్షుని ద్వారమున నే నిట్లు ప్రచురించితిని: 'శ్రీ దోక్ దంపతులు నన్ను వమ తోబుట్టినవానివలె ఉపచరించుచున్నారు. కొలదినాళ్ళలో స్వస్థుడనై ఎప్పటివలె కార్యప్రవృత్తుడ నగుదును.'

'నాపై చేయి జేసికొన్నవారు, పాపము తమ్మ దా మెరుగరు. నే నేదో అకార్యము చేయుచుంటినని వారు తలపోసిరి. వారికి చేతనైన ఈ ప్రతీకారము గావించిరి. కావున వారిపై నెట్టిచర్యయు జరుపవలదు.'

ఇంతలో శ్రీ చామ్నీ అనుమతిపత్రములతో నచటి కేతెంచెను. అతిప్రయాసముతో నేను వ్రేళ్ళ గురుతులు

ముద్రించితిని. పాపము, శ్రీ చామ్ని కనుల బాష్పము లొలుకుచుండెను. నే నాయననుగూర్చి పలుమారు పరుషముగా బత్రికలలో వ్రాసితిని. కాని మానవహృదయములు ఘటనా వశముగ నార్ద్రములగునని దీనిచే దెలిసివచ్చెను.

42

పునః సత్యాగ్రహము

భారతీయు లిట్లు బుద్ధిపూర్వకముగ దమంత తామే పేళ్ళు నమోదు చేయించుకొనిరి. కావున సర్కారు ఆ నల్ల శాసనమును రద్దుచేయవలసియుండెను. స్మట్సు సేనాపతి దాని నుపసంహరింపక అట్లే యుంచి 'ఆసియావాసుల నింకను రిజిష్టరు చేయుటకై' మరొక శాసనము నిర్మింపదొడగెను. ఆ చిత్తుశాసనమును జదివి నేను నిర్ఘాంతపడితిని.

సత్యాగ్రహు లపుడు సర్కారుకు తమ 'తుదిమాట' గా (Ultimatum) 'ఆసియావాసుల శాసనము రద్దు చేయనిచో ఈవరకు భారతీయులు పుచ్చుకొన్న సమ్మతి పత్రములను తగులబెట్టి అసల కాగల కార్యమునకు నిశ్చలముగా నొడిగట్టి యుందు' రని తెలిపిరి.

ప్రాతపత్రములను బరశురామప్రీతి గావించుటకై బహిరంగముగ సమావేశ మైతిమి.

సభ యారంభము కాబోవుచుండగా సర్కారు పంపిన తంతివార్తతో నొక స్వచ్ఛందసేవకుడు సైకిలెక్కి యేతెంచెను. భారతీయుల యీ పట్టుదల సర్కారుకు విచారకారణమైన దనియు, సర్కారు తన పని దా సాగించు ననియు వచ్చిన ఆ తంతివార్తను మహాసభలో జదివి వినిపించినంతట, అగ్ని దేవునకు దాము చేయదలచిన సంతర్పణము ఆగిపోలేదుకదా యను సంతోషముచే సభ్యులొక్కపెట్టున జప్పటలు చరచిరి.

మీర్ ఆలంకూడ ఆ సభలో నుండెను. నాయెడల దాను సల్పిన అత్యాచారమునకు సంతాపించుచుంటినని చెప్పి మావలె స్వయముగా అనుమతిపత్రము దీసికొనలేదు కావున తన పూర్వపు రిజిష్టరు పత్రమునుదెచ్చి ఆ మంటల కాహుతి గావించెను. నే నాతని గౌగిలించుకొని 'నీపట్ల నాకెట్టి కోపమును లేదు' అని మరొకమారు స్పష్టము చేసితిని.

మా కార్యనిర్వాహక సంఘమునకు కప్పటికి జేరిన 2,000 పత్రములను కిరోసిను నూనెతో దడిపి శ్రీ యూసఫ్ మియాగారి చేతులమీదుగా అగ్నిలో వేల్చితిమి. ఆ పత్రములు కాలుచున్నంతసేపు ఆ సభ కేతెంచినవారెల్ల లేచి నిలిచి ఆనంద కోలాహలమున నుఱ్ఱూతలూగుచు జప్పటలు సరచుచునేయుండిరి. ఇంకను గొంద రప్పటికప్పుడు తెచ్చియిచ్చిన పత్రములనుగూడ ఆ భోగిమంటలో వైచితిమి.

ఆ సభ కేతెంచి ఈ వేడుకను గనులార గాంచిన ఆంగ్ల పత్రికాప్రతినిధులు తమ తమ పత్రికలలో నిదియంతయు వన్నె చిన్నెలతో జిత్రించిరి.

ఈ నల్లశాసనమును చేసినయేటనే స్మట్సుసేనాపతి ట్రాన్సువాలుకు వలసవచ్చినవారి నదుపుచేయు మరొక శాసనము (Transwal Immigrants Restriction Bill) గూడ నిర్మించెను. ఈ శాసనముచే ట్రాన్సువాలులో క్రొత్తగా నొక భారతీయుడుగూడ నడుగుపెట్టుట కాస్కారము లేకుండ బోయెను.

నూతన దురాక్రమమునుండి తమ స్వత్వమును రక్షించుకొనుటకై ఆ శాసనమును ప్రతిఘటించుటకు భారతీయులకు దప్పనిదయ్యెను. అందులకై కొందరు సత్యాగ్రహులు ట్రాన్సువాలు కేతెంచి బద్ధులు కాజొచ్చిరి. నన్నుగూడ మరల బందె బెట్టిరి.

1912 అక్టోబరు నెలలో సర్కారుకు, సత్యాగ్రహులకు సమాధానము గుదుర్చుటకై శ్రీ గోఖలే దక్షిణాఫ్రికా కేతెంచిరి. ఒక సంవత్సరములోపల ఈ నల్లశాసనమును, మూడు పౌనుల తల పన్నును రద్దుచేయుదుమని బోథా సేనాని శ్రీ గోఖలేకు మాట యిచ్చెనట. ఆ వాగ్దానము నెరవేరినదికాదు.

సర్కారు తమ మాట చెల్లించుకొనలేదని నేను శ్రీ గోఖలేకొక లేఖవ్రాసి సత్యాగ్రహోద్యమమును సమాయత్త మొనర్పసాగితిని.

స్త్రీజనము చెరసాల కేగకుండ మేమందరము వారించుచుంటిమి. దక్షిణాఫ్రికా ప్రభుత్వమప్పు డొక వివాదములో నిర్ణయమొకటి చెప్పుట తటస్థించెను. క్రిస్టియన్ల యాచారము ననుస

రించి పెండ్లిండ్లు జరగవలెననియు, వానిని పెళ్ళిళ్ళ రిజిస్ట్రారు కడ నమోదుచేసికొనవలెననియు అట్లు జరుగని వివాహములు చెల్లవనియు ఆ తీర్పుచే నేర్పడెను. అంతకుమున్న హిందూ ముసల్మాను జోరాస్ట్రియను ధర్మానుసారము జరగిన వివాహములన్నియు ఇట్లొక్క కలముపోటుతో అశాస్త్రీయములై పోయెను. అట్లు వివాహితలగు స్త్రీలందరు నుంపుడుకత్తెలగుటయు, వారి సంతానమునకు ఆస్తిపాస్తుల వారసత్వము రద్దగుటయు సంభవించును. ఇది స్త్రీలకును, అంతకంటె బురుషులకును దుస్సహమైపోయెను.

మా నారీలోకమునకు గళంక మాపాదించు నీ యవమానము నోర్చుకొనలేకపోతిమి. సత్యాగ్రహుల లెక్కతో నిమిత్తము లేకుండ చలముమై సత్యాగ్రహము సాగింప సమకట్టితిమి. సత్యాగ్రహమున జేరగూడదని స్త్రీల కీతూరి నిషేధము లేకపోవుటేకాదు, పురుషులతోపాటు నడుము గట్టుడని స్త్రీల నర్థించితిమి.

స్త్రీలనుగూడ బందెపెట్టుచుండిరన్న వార్త న్యూకాసిలు చెంత గనులలో పనిచేయువారిపాలిటి కావేశ మంత్రమయ్యెను. వారందరు పనిముట్లను బారవైచి తరతరముగా బదువులు గట్టి పట్టణమున బ్రవేశించిరి. నే నీ వార్త విన్నంతనే ఫోనిక్సు విడచి న్యూకాసిలు కేగితిని.

గనులు విడిచివచ్చిన పనివాండ్రసంఖ్య పదులుదాటి వందలలో బడెను. వేలలో బడుటకు సిద్ధముగా నుండెను. వీరందరికి దల దాచికొను చోటును, భోజనభాజనములు నెటు

లమన్నిగలను? పనిపాటులు లేని యీ మహాజనము నొక్క-చోట నేర్చి, కనుపెట్టియుంచుట అసాధ్యము, అపాయకరముగా గనుపట్టెను. నాకపు డొక యుపాయము తట్టినది. ఈ సేనను ట్రాన్సువాలుకు నడిపించుకొని యేగినచో నచట కారాగృహప్రవేశము సులభముగా లభించును. ఆ సేనలో నైదువేలమంది యుండిరి.

43

సత్యాగ్రహ విజయము

నిరపరాధమగు వేలాదిజనమును బందెలో నిలిపిపెట్టు శక్తి యూనియన్ సర్కా-రుకు లేదు. రాజప్రతినిధియు ఈ యకార్యమును సహించి యూరకొనడు. స్మట్సుసేనాపతి యేమిచేయునో యని మానవలోక మెదురు చూచుచుండెను. అట్టి సంకటములందు ప్రభుత్వము లన్నియు జేసెడిపనినే యూనియన్ సర్కా-రును చేసెను. విచారణకొరకొక కమిషన్ నియమించి దాటికొనిపోవు టొక్క-టే ఇందుల కుపాయము. ఆ కమిషన్ చేసెడి యుపదేశమును ప్రభుత్వము మన్నించుట పరిపాటి. సర్కా-రు తొలుత తాను నిరాకరించిన న్యాయమును, కమిషను మాటను మన్నించు నెపమున, ప్రజలకు గల్గించును. స్మట్సుసేనానియు నట్లే ముగ్గురు సభ్యులుండు కమిషను నియమించెను.

వ్యయభారము నేను చూచెదను. దాని నా సొంతముగా నెంచుకొందు 'నని చెప్పిరి.

నా యానందము మేరమీరెను. ధనము సమకూర్చు భారము తప్పిపోవుటచే మిన్నెక్కినట్లు సంతోషించితిని.

45

ఆశ్రమస్థాపనము

25-5-1915 న అహమదాబాదునందు కోచరాబులో సత్యాగ్రహాశ్రమము నెలకొల్పితిని.

మేము స్త్రీ పురుషులందరు నిరువదియైదుగురము ఏక భాండాశనముచేయుచు, నేకకుటుంబముగా మెలగుటకు యత్నించితిమి.

ఆశ్రమమునకు కతిపయమాసములు గడచెనో లేదో, అప్పుడే అనుకొనని బెడద యొకటి యేర్పడెను. 'పేదవాడు, సజ్జనుడు నగు అంత్యజు డొకడు తన కుటుంబముతో మీ యాశ్రమమం దుండునట. అంగీకరింతురా ?' యని శ్రీ అమృతలాలు తక్కరుకడనుండి లేఖ యేతెంచెను.

'ఆ కుటుంబమున నందరు మా యాశ్రమనియమములను పాటింతురేని మాతోపాటు నిచట నుండవచ్చు' నని బదులు వ్రాసితిని.

వా రందులకు సమ్మతించి ఆశ్రమమున వచ్చి చేరిరి. ఆశ్రమమునకు సాయమొనర్చుచున్న మిత్రుల కిది కొంత మనస్తాపహేతు వయ్యెను. ముందుగా నీటిబావియొద్ద కలహ మేర్పడినది. ఆ బావి ఇంటివారికిని, మాకును ఉమ్మడి కావున అచట పెత్తము నాడించు నాతడు మా బిందెనుండి నీరు తన మీద చింది మైలపరచుచుండెనని ఆక్షేపించి, మమ్ము నిందింప నారంభించెను. వాని తిట్టులను గణింపక మీపని మీరు చేసికొనుడని ఆశ్రమవాసు లందరితో జెప్పితిని. మేము తన్ను ప్రతిభాష లాడమిచే నాతడు లజ్జించి మమ్ము దిట్టుట మానుకొనియెను.

ఆశ్రమ దాతలు మాత్రము మాకు దానము నొసగుట నిలిపివేసిరి. మాకు సంఘబహిష్కారముగూడ ప్రాప్తించునను వార్తలు పొక్కెను. మే మన్నిటికి నొడిగట్టియే యుంటిమి. మనపై ఆంక్షు విధించి వెలిపెట్టినను సరియే అహమదాబాదును విడువగూడదనియు, అచటనే వెలివాడలో నివసించి, అచటి యంత్రశాలలతో పాటు కూలి నాలి చేసికొనుచు జీవింతమనియు మావాండ్రకు నచ్చజెప్పితిని.

వ్యవహారము క్రమముగా క్షీణించుటయు, నొకనాడు మగన్‌లాలు గాంధి 'మన సొమ్ముసంచి వట్టిపోయినది. పైనెలనుండి పస్తులే' యని ముందుగనే హెచ్చరించెను.

నేను కలవరపడక 'కానిండు. మూలగాడెమున నేగుదము' అంటిని. ఇట్టి సంకటములు నాకు క్రొత్తకావు. తుది ముహూర్తమున పరమేశ్వరుడే సన్నాదుకొనుట పరిపాటి

కమిషన్ చేయవలసిన పనినిగూర్చి స్మట్సు సేనానికి నాకు జాబు జవాబులు నడచెను. మా యుభయులకు ఏక గ్రీవత కుదిరినది. భారత ప్రజల కోరికలను తీర్పవలసినదని ఆ కమిషన్ సర్కారుకు నివేదన మంపెను. నివేదన మందిన అనతికాలముననే సర్కారు గెజెటులో 'భారతీయులకు పరిహారము' అను పేర చిత్తుశాసనము ప్రకటితమయ్యెను. మూడు పౌనుల తలపన్ను రద్దగుటయు, భారతభూమిలో శాస్త్రీయములగు వివాహములన్నిటిని ఇచటగూడ శాస్త్రీయ ములుగా సంగీకరించుటయు. బొటన వ్రేలిముద్రగల పత్రము లను చూపిన ప్రాతకాపులందరికి దక్షిణాఫ్రికాలో ప్రవేశాస్వాత కలుగుటయు—ఇవి యీ శాసనముచే నొనగూడును.

ఆ సత్యాగ్రహమహాసమర మిట్లు ఎనిమిదేండ్లకు ముగిసి నది. దక్షిణాఫ్రికా భారతీయులకు శాంతి లభించినదనిపించెను. 18-7-14 న యింటిత్రోవపట్టి ఇంగ్లండు కేగితిని. మానవ జీవనమునందలి తీపిని. చేదును అనుభవించుచు 21 సంవత్సర ములు దక్షిణాఫ్రికాలో గడపితిని. నా జీవనపరమార్థమున కచటనే రూపురేఖలు దిద్దికొంటిని. అట్టి ఆ భూమి నెడబాసి వచ్చుటకు నాకు గాళ్ళాడినవి కావు.

నవమ భాగము:

ఇండియాలో - ఆశ్రమస్థాపనము

44

పూనానగరములో

ఇన్ని యేండ్లు పరదేశవాసము చేసి మరల మాతృభూమికి వచ్చుట పరమానందముగా నుండెను.

భారతసేవక సామాజికులును, శ్రీ గోఖలేయు నన్ను ఆదరముచే ముంచియెత్తిరి. శ్రీ గోఖలే సామాజికుల నందరిని సమావేశపరచిరని జ్ఞాపకము. వారి యందరి పరిచయమును సంపాదించి నానావిషయములుగూర్చి వారితో అరమరలేక ముచ్చటించితిని.

నా ఫోనిక్సు కుటుంబముతోగూడ నివసించుట కొక యాశ్రమముండిన బాగుండు ననుకొంటిని. నేను ఘూర్జరుడను గాన ఘూర్జరమందే వసతి కుదిరినచో ఘూర్జరులను, తద్వారా ముఖ్య భారతప్రజలను సేవింపవచ్చు నని యాలోచన పొడమెను. శ్రీ గోఖలే కీ యాలోచన లెస్సగా నున్నది. ఆశ్రమ

హైపోయెను. మగన్లా లిట్లు హెచ్చరించిన కొలదినాళ్ళకే ఒక ప్రొద్దుట ఆశ్రమబాలకులు నాచెంత కేతెంచి 'ఎవరో సేటు మోటారుపై వచ్చి, ఆశ్రమము వాకిట నిలిచి మిమ్మడుగు చున్నా' డని తెలిపిరి. నేను సమీపింపగనే ఆ సేటు 'మీ యాశ్రమమునకు దాన మొసగవలెనని యున్నది. పుచ్చు కొందురా?' యని యడిగెను.

నేను 'అంతకంటెనా! ఇపుడు చేతిలో సొమ్ములేక ఇరకటముగాగూడ నున్న' దంటిని.

'నేను రేపీవేళకు వచ్చినచో ఉందురుకదా?' యనెను.

'ఉందు' నన్నంతట ఆయన వెడలిపోయెను.

చెప్పినట్లు మరునా డదియేవేళకు మోటారు వచ్చి నిలచెను. బాలురు వచ్చి చెప్పిరి. ఆ సేటు లోపలికి రాలేదు. నేనే వాకిటి కేగితిని. రు. 13,000 ల నోట్లు నాచేత నిడి ఆయన మరుమాట పలుకక వెడలిపోయెను.

ఈ యీవి అతర్కితోపపన్నము. దీని నిచ్చిన భంగి కూడ అపురూపము! ఆయన యీవర కెన్నడు ఆశ్రమమునకు వచ్చినవాడు గాడు. ఆయన నొక్కపరి కాబోలు నేను చూచితిని. లోపల కేతెంచుట, విచారణ చేయుట ఏమియు లేదు. సొమ్మును చేతిలో క్రుమ్మరించి చక్కపోవుట. ఇట్టి యీవి నే విన్నదియు గన్నదియు గాదు. ఒక సంవత్సరమువరకు మా కిక నిశ్చింత.

దశమ భాగము : చంపారణ్యము

46

నీలిమందు మచ్చ

చంపారణ్యమందలి కర్షకుడు తాను సేద్యముచేయు భూమియం దిరువదింట మూడువంతులలో, భూస్వామికోసము నీలిమందు పండింపవలెనను విధి యొకటి యున్నది. దీనిని తీ౯కఠియా పద్ధతి యందురు. ఇరువది కత్తుల భూమిలో మూడు కత్తులని దీని యర్థము.

ఈ బాధ ననుభవించువారిలో రాజకుమార శుక్లా యను నతడు నాకడ కేతెంచి తమ యిడుమలను కనులార గాంచుటకై చంపారణ్యమునకు రావలసినదని నన్ను గోరెను.

1917 ఆరంభములో కలకత్తానుండి చంపారణ్యమునకు బయలుదేరితిమి. చంపారణ్యమందలి కర్షకుల కష్ట సుఖములను గాంచి, నీలిమందు గుత్తదారులచే వారికగు అగచాట్లను గూర్చి తెలిసికొను కుతూహలమున నే నచటి కేగితిని. కావున వేలకొలదిగా నున్న యచటి సేద్యగాండ్రను కలిసికొనవలెను. రైతులను విచారించుటకు ముందుగా గుత్తదారు లేమి

చెప్పెదరో వినుట మంచి దనుకొంటిని. దర్శన మిప్పింపుడని గుత్తదారులకు, డివిజనల్ కమీషనరుకు విన్నపమంపగా వారు సమ్మతించిరి.

గుత్తదారుల కార్యదర్శి నాతో 'మీరిచట క్రొత్తవారు. గుత్తదారులకు, కర్షకులకు మధ్య మీ కీ జోక్య మెందులకు? మీ రేదేని చెప్పవలసినచో అదియెల్ల వ్రాసి పంపు' డని స్పష్టముగా జెప్పెను. 'నేను పరాయివాడ ననుకొనుటలేదు. కర్షకుల కోరికపై వారి కష్టసుఖములను విచారించుటకు నాకు అధికారము కల' దని నేను సవినయముగా బదులు పలికితిని.

పిమ్మట కమీషనరును దర్శింపబోగా ఆయన 'మీరు వెంటనే తిర్హూత్ నుంచి వెడలిపొం' డని నా కుపదేశించెను.

జరిగిన దంతయు నా సహచరుల కెరిగించి యిట్లంటిని: 'నన్ను సర్కారు ఇటనుండి ముందునకు పోనీయరేమో? నే ననుకొన్న దానికంటె ముందుగనే నాకు కారాగృహప్రవేశ మును సంభవించునేమో చెప్పలేను. నాకు బంధనము తప్పనిచో నది మోతిహారిలోనో, బేటియాలోనో జరగుట మంచిది. కాబట్టి నేను వెంటనే ఆప్రదేశముల కేగుట మేలు.'

బీహారు రాష్ట్రమున తిర్హూత్ డివిజనులో చంపారణ్యా మొక మండలము. మోతిహారి ఆ మండలమునకు రాజధాని. రాజకుమార శుక్లా నివాసము బేటియా సమీపమం దున్నది. అచటివారు చంపారణ్యాకర్షకులం దెల్ల నిరుపేదలు. వారి దురవస్థను నాకు జూపింపవలెనని శుక్లా కుతూహలపడెను. చూడవలెనని అంతకంటె అధికముగా నేనును ఉబలాటపడితిని.

LIBRARY
ACC. No. 7095
CLASS No.
Date 26/8/97

సహచరులు, నేను ఆనాడే మోతిహారీకి బయనమైతిమి. మోతిహారీ కైదుమైళ్ళ దూరములో నొక కర్షకు డవమానితు డయ్యెనని మా కానాడే వార్త వచ్చెను. శ్రీ ధరణీధర ప్రసాదబాబుతో నేను మరునాటి ప్రొద్దుట ఆ కర్షకుని జూడ నిశ్చయించి గజారూఢులమై ఆ యూరికి బయలుదేరితిమి. మేము సగముమేర దాటకుండగనే పోలీసు సూపరింటెండెంటుకడ నుండి వార్తాహరు డేతెంచి, వారి యభినందనము నా కందించెను. ఆ మాటల తాత్పర్యము గ్రహించి, ధరణీధరబాబును 'మీరు సాగిపొం' డని పంపి, నే నా వార్తాహరుడు తెచ్చిన అద్దెబండి నెక్కితిని. అత డంతట నన్ను చంపారణ్యమును వీడి పొమ్మను హెచ్చరికపత్రము నా కందించి, ఆ హెచ్చరిక యందినట్లు చేవ్రాలు చేయుడని కోరెను. నా విచారణ ముగియకుండ చంపారణ్యమును వీడనని ఆ పత్రముమీద వ్రాసి యిచ్చితిని. అంతట నాతడు చంపారణ్యమును విడువవలసిన దను యాజ్ఞను ధిక్కరించిన నేరమునకు కోర్టులో విచారణకు హాజరుకావలసిన దను ఆజ్ఞాపత్రము నా కందించెను.

నా కీ హెచ్చరికను, ఆజ్ఞాపత్రమును అందించిన వార్త కార్చిచ్చువలె పలుదెసల ప్రాకిపోయెను. మోతిహారిలో ఆనాడు అపూర్వముగు కోలాహలము చెలరేగెనట. గోరఖ్ బాబు గృహమునను, కోర్టునందును ప్రజల వెల్లువ పొంగిపోయెను. ఆ రేయియే నా పని యంతయు ముగించుకొంటినిగాన ఆ ప్రజాకోటి నదుపులో నుంచుటకు నాకు వీలు చిక్కెను. నే నెచటి కేగిన నచటికెల్ల నన్ను వెంటాడుచున్న ప్రజాసమూహ

మునకు సర్దిచెప్పుచు, నా సహచరులు నా కెంతయో బాసట
యైరి.

కలెక్టరు, మాజిస్ట్రేటు, సూపరింటెండెంటు మున్నగు
నధికారులకు, నాకు నొకరీతి నెయ్యమేర్పడినది. వారి ఆజ్ఞలను
నేను ధిక్కరింపక అందుకొనుటయు, వారితో యథోచితముగ
వర్తించుటయు గాంచి వారిపట్ల నాకు తిరస్కారభావము లేదని
గ్రహించిరి. వారి ఆజ్ఞలను శాంతముగ ప్రతిఘటించుటయే
నా యుద్దేశమని తెలిసికొన్నమీదట వారి గుండెలు కుదుట
బడెను. కావున నన్ను లేనిపోని ఆయాసము పాల్పరచక,
నేనును నా సహచరులును ప్రజల నడుపులో నుంచుట నామో
దించిరి. తమ యధికారదర్ప మిక తొల్లిటివలె సాగదని నాటి
ప్రజావేశముచే వారికి దెల్లముగా దెలిసెను. ప్రజ లాసమయ
మున రాజదండభీతిని విడనాడి, తమ యీ క్రొత్త స్నేహితుని
ప్రేమబలమునకు వశులైరి.

చంపారణ్యమునకు నేను క్రొత్తవాడనైనను ప్రజలు
నన్ను చిరబాంధవునివలె ఆదరించిరి. ఆ యమాయిక కర్షక
జనమును చూచినపుడు ఈశ్వరుడు, సత్యము, అహింసయు నాకు
ప్రత్యక్షమైనట్లుండెను. ఇం దతిశయోక్తి ఆవంతయు లేదు.

చంపారణ్యమున గడపిన ఆ దినము ఈ జన్మమున
మరపురాదు. ఆ కర్షకులకు, నాకు నది మహాపర్వదినము.

కోర్టులో విచారణ ఆరంభమయ్యెను. సర్కారు వకీలుకు,
మాజిస్ట్రేటుకు, ఇతరాధికృతులకుగూడ నేమిచేయవలెనో
తెలియదాయెను.

తీర్పు వాయిదానాడు నేను కోర్టుకు హాజరగుటకు మున్నే మాజిస్ట్రేటు నాపై దోషారోపణను లెఫ్టినెంటు గవర్నరు ఉపసంహరించినట్లు నా పేర వ్రాసి యంపెను. కర్షకుల స్థితిగతులను నేను స్వేచ్ఛగా విచారించుకొనవచ్చుననియు, రాజోద్యోగులు వలసినసాయ మొనర్తురనియు కలెక్టరుగూడ నాకు లేఖ వ్రాసి యంపెను. ఈ వ్యవహార మిట్లు శుభపరిణామ మందునని మే మెవ్వరము నూహింపలేదు.

కర్షకులు తండతండములుగా నేగుదెంచి తమ కష్ట నిష్ఠురములను నివేదించిరి. వారివెంట వచ్చిన జనప్రవాహముచే మా విడిది యావరణమును, తోటయు నిండిపోయెను.

47

కళంకము మాసిపోయినది

కష్టనివేదనము సల్పుటకై యేతెంచు కర్షకుల సంఖ్య నానాట పెరిగిపోవుట యరసి భూస్వాములకు ఒడలు మండ దొడగెను. నేను చేయుచున్న విచారణను మాన్పించుటకై వారు భూమ్యాకాశములను దలక్రిందు చేయసాగిరి.

లెఫ్టినెంటు గవర్నరగు సర్ ఎడ్వర్డు గెయిటు నన్ను చెంతకు రావించుకొని, ఈ వ్యవహారమును సాకల్యముగా

విచారించుటకై తాము కొందరిని నియమింతుమనియు, వారిలో నన్నుగూడ జేర్చెదమనియు దెలిపిరి.

ఆ విచారణకర్తలు కర్షకులపక్షముననే తీర్పు చెప్పిరి. భూస్వాములు కర్షకులనుండి అన్యాయముగా గుంజుకొనిన సొమ్మును మరల వారి కిప్పింపవలసిన దనిరి. తీన్‌కతియా పద్ధతి శాస్త్రవిహితము కాదనియు, దానిని రద్దు చేయవలసినదనియు వారు సర్కారుకు నివేదించిరి.

అప్పటికి నూరేండ్లుగా సాగుచు వచ్చిన తీన్‌కతియా పద్ధతి యిట్లు అంతరించిపోయెను. దానితో భూస్వాముల దొరతనము నస్తమించెను.

ఏకాదశ భాగము :

అహమదాబాదు కూలిజనము

48

కూలిజనముతో సంబంధము

అహమదాబాదు కూలిజనమునుగూర్చి శ్రీమతి అనసూయబాయి నాకు లేఖ వ్రాసెను. అచటి కూలివారు తమకు కూలి చాలుటలేదని చాలకాలమునుండి ఆందోళన చేయుచుండిరి. వారి కొక దారి చూపి నడిపింపగలనేమో చూడనెంచి అహమదాబాదు కేగితిని.

కూలివారిది న్యాయపక్షమని నాకు దోచెను. మిల్లు యజమానులకు శ్రీ అంబాలాలు సారాభాయి నాయకుడు. శ్రీమతి అనసూయ ఆయనకు సోదరియయ్యు కూలీలపక్షము వహించి పోరుచుండెను. మిల్లుయజమానులతో నాకు మైత్రి కలదు. కావున నాకీ వ్యవహారము నాయియము గోయియముగ నుండెను. యజమానులతో ముచ్చటించి చూచితిని. మధ్యవర్తి పరిష్కారమున కంగీకరింపు డంటిని. వారు పరిష్కారపద్ధతికీ మాకూ చుక్కెదురనిరి.

కావున కూలిజనముచే సమ్మె కట్టించితిని. సమ్మె ఆరంభించుటకు ముందు కూలివారితో, వారి నాయకులతో కలిపిగోలుగా మెలగి సమ్మె ఫలప్రదమగుటకు కొన్ని నియమము లున్నవని బోధించితిని: 1) హింసాచరణము పనికి రాదు. 2) పనిలోని కేగువారిని బాధింపదగదు. 3) యాచించి జీవింపగూడదు. 4) సమ్మె యెంతకాలము సాగినను నిశ్చలముగా నుండి, న్యాయ్యమగు మఱియొక బ్రదుకుతెరవున కాల మీదవలెను.

సమ్మెగాండ్రును, వారిలో పెత్తనదారులును ఈ నియమములను గ్రహించి అంగీకరించిరి. మహాసభాసమావిష్టులై అందరు 'మా కోర్కెలు మిల్లుదారులు తీర్చవలెను: లేదా, మధ్యవర్తిపరిష్కారమున కొప్పికోవలెను. అంతవరకు పనిలోని కేగము' అని శపథము చేసిరి.

రెండు వారములు గడచుదనుక సమ్మెదారులు ధైర్యమును, నిగ్రహమును వీడక ప్రతిదినము సభలు చేయుచుండిరి. ఆ సభలలో నేను వారి శపథములను జ్ఞప్తికి దెచ్చుచుంటిని. 'ప్రాణములు పోయినను శపథములు వీడ' మని వారు బిగ్గరనా నరచుచుండిరి.

పిమ్మట క్రమముగా దౌర్బల్యలక్షణములు తల చూపెను. నేను కలవరపడుచు 'నిపుడు నా కర్తవ్య మేమి?' యని గాటపుటాలోచనలో బడితిని.

ఒకనాటి యుదయమున కూలివాండ్ర సభ జరుగుచుండెను. నేను తెన్నుగానక కొట్టుమిట్టాడుచుంటిని. ఇంతలో

నా మనస్సునకు మెరపు మెరసినట్లై, అప్రయత్నముగా నానోట నీ మాటలు వెలువడెను :

'సమాధానము కుదురుటో, మిల్లులు వదలిపోవుటో తేలువరకు మీరు కట్టుగా నిలిచి సమ్మె సాగింపనిచో నేను అన్నము ముట్టను.'

కూలిజనుల కీ మాటలు పిడుగుపాటయ్యెను. అనసూయ బాయి చెక్కుల కన్నీరు రోడసాగెను. అంతట కూలిజనులు 'మీరు కాదు. మేమే ఉపవసింతుము. మీరు పస్తులుండుట న్యాయము. మావలన తప్పయినది. మన్నింపుడు. ఇక కట్టుదప్పి చరింపము. మా చేసిన బాసలు తప్ప' మని ఘోషింపజొచ్చిరి.

'మీకు పస్తు అక్కరలేదు. మీరు చేసిన బాసలు పాలింపుడు, చాలును. మనకు విత్తబలములేదనియు, బిచ్చ మెత్తి జీవింపదగదనియు మీ రెరుగినదే. కావున మీరు ఏదయో కాయకష్టముచేసి కాలము నీడ్చుచుండుడు. అట్లు చేయుదు రేని ఈ సమ్మె ఎంతకాలము సాగినను మీరు నిర్వచారముగా నుందురు. ఇక నా యుపవాస మంటిరా, ఈ సమ్మె ఫలించు వరకు సాగవలసినదే' యని నేను బదులు పలికితిని.

తొలినాటి సోదరి అనసూయయు, కొందరు స్నేహితు లును, కూలిజనముగూడ నుపవాసముండిరి. నేను చాల దూరము శోధించి వారిచే నుపవాసము మాన్పించితిని.

దీనిచే కాలుష్యమడగి మనసులు నిర్మలము లాయెను. మిల్లుయజమానుల హృదయములును కరగెను. వారంతట

సమాధానమున కుపాయము నెమకదొడగిరి. అనసూయబాయి యింటనే వారందరు కూడబలికికొనసాగిరి. శ్రీ ఆనందశంకరధ్రువ పుణ్యమా యని దారి దొరకెను. వారే మధ్యవర్తిగా నుండుట కెల్లరు నంగీకరించిరి. మూణ్ణాళ్లలో నా యుపవాసము ముగిసెను. మిల్లుయజమానులా శుభావసరమున కూలివారికి మిఠాయి పంచిపెట్టిరి. 21 దినములు సమ్మె సాగినమీదట ఉభయులకు సమాధానము కుదిరెను.

ద్వాదశ భాగము: ఖేడాసత్యాగ్రహము

49

ఖే డా స త్యా గ్ర హ ము

అహమదాబాదు సమ్మె ఒకవంక ముగిసెనో లేదో, నా కించుక ఊపిరి యాడకుండగనే, ఖేడా సత్యాగ్రహము నా కొరకు సిద్ధమై, నే నందు ఉరుకవలసివచ్చెను.

ఖేడా మండల మంతట పంటలు పాడై పోవుటచే కాటక ముముసుకొనుటకై పొంచియుండెను. ఆ యేటికి శిస్తు వసూలు నిలుపుచేయుటకై సర్కారుకు విన్నవింపవలెనని అచటి పట్టాదారు లాలోచించుచుండిరి.

పంట నాలుగణాలకు (1/4 వంతు) మించనిచో ఆ యేటికి శిస్తువసూలు నిలుపవలెనని సర్కారు నడుగవచ్చును. భూమిశిస్తు నియమము లిందుల కంగీకరించును. సర్కారు అంచనాలో ఆ యేటి పంట నాలుగణాలకు మించెను. మనుకు నాలుగణాల పంట మించలేదని రైతుల వాదము. సర్కారు ఈ వాదమును పెడచెవిని బెట్టెను. విన్నపములచే, ప్రార్థనలచే ఫలముగానక, నేను సహచరులతో ఆలోచించి పట్టాదారులు సత్యాగ్రహ మొనర్చుటే మార్గమని చెప్పితిని.

ప్రజల ధీరత్వమును గాంచియు తొలుదొలుత ప్రభుత్వము కఠినచర్యలకు బూనలేదు. కాని ప్రజల పట్టుదల సడలమి గాంచి సర్కారు తీవ్ర నిరోధచర్య లవలంబించెను. జప్తుచేసిన పశువులను అధికారులు వేలము వేసి యమ్మిరి. చేతికందిన చరాస్తినెల్ల పట్టుకొనిపోయిరి. అపరాధపు శిస్తు విధింతుమని హెచ్చరికలంపిరి. కొన్నిచోట్ల నిలువున నున్న పైరులనుగూడ జప్తుచేసిరి.

భయపడిన ప్రజల బెదరు తీర్పనెంచి నే నొక యుపాయము చేసితిని. ఒక పొలములోనున్న ఉల్లిపంటను అధికారులు జప్తుచేయుటలో పొరపడిరని నాకు దోచెను. అంతట శ్రీ మోహన్లాలు పాండ్యాను పెద్దనుగావించి, రైతు లాయనవెంట నేగి ఆ యుల్లిపంటను తెచ్చుకొనుడని చెప్పితిని. ఈ పనిచేసినచో జరిమానయో, బందిఖానయో తప్పదు. ఈ కష్టములను గోరి తెచ్చుకొనుట ప్రజల కలవరచుట మంచిదని యెంచితిని. ఈ పని శ్రీ మోహన్లాలు పాండ్యా కెంతేని ప్రియము గావున ఆతడు సిద్ధపడెను. మరి యేడెనమండ్రు ఆయనవెంట నరిగిరి.

ఇంతటిపని జరిగినంతట సర్కారు మిన్నకుండదు కావున మోహన్లాలును, తదనుచరులను బందెలో నిడెను. ప్రజల కిది ఉత్సాహజనకమయ్యెను. బందె భయము తీరినపిమ్మట రాజదండము ప్రజల యుత్సాహమునకే కారణమగును.

పాండ్యాను, తదనుచరులను బంధించి కొనిపోవుచుండ ప్రజలు వారివెంట ఊరేగింపుగా బయలుదేరిరి. పాండ్యా ఆనాడార్జించుకొన్న 'ఉల్లిదొంగ' యను బిరుదము నేటికిని చెల్లుచునే యున్నది.

పరువుచెడకుండ ఈ పోరాటమునుండి తప్పికొనుటకై సత్యాగ్రహికి సముచితోపాయ మేదియా యని ఆలోచన మారంభించితిని. అనుకొనని ఉపాయ మొకటి తనంత దొరకెను. సంపన్నులగు పట్టాదారులు శిస్తుచెల్లింతురేని పేదవారి శిస్తు వసూలు నిలిపియుంతుమని నద్యాద్ తాలూకా మామ్లతుదారు నాకు గబురంపెను. ఆ మాట వ్రాసియిండని కోరినంతట ఆయన వ్రాసియిచ్చెను. ఈ యొడంబడికను మండల మంతట వర్తింపజేయగల అధికారము కలెక్టరుది. కావున మామ్లతుదారు మాట మండల మంతట వర్తించునా యని కలెక్టరు నడిగితిని. మామ్లతుదారు ఒడంబడికను మండల మంతట జెల్లించు ఆజ్ఞ లిదివరకే పంపితినని కలెక్టరు తెలియజేసెను. ఇట్లు జరిగెనని నే నెరుగను. ఇదియే నిజమైనచో పట్టాదారుల ప్రతిన నెరవేరినట్లే. వారు సాధింపగోరిన ఫలము నిదియే కావున కలెక్టరు పంపిన ఆజ్ఞచే మేము సంతుష్టిచెందితిమని చెప్పితిమి.

ఘూర్జర కర్షకుల కీ సత్యాగ్రహముచే కనువిప్పు కలిగెను. రాజకీయ వ్యవహారములం దిది వారి కక్షరాభ్యాసమువంటి దయ్యెను. కష్టసహిష్ణుతను, త్యాగము నలవరచికొన్నవారికి విముక్తి కరతలామలక మను రహస్యము ఘూర్జరవాసుల మనస్సుల నాటుకొనెను. ఖేడా పోరాటముచే సత్యాగ్రహ బీజములు ఘూర్జరమున వేరు దన్నికొన్నవి.

50

మృత్యువుచెంగట

నే నపుడు వేరుసెనగపప్పు, వెన్న, నిమ్మపండ్లు మాత్రమే తినుచుంటిని. మితిమీరి వెన్న దిన్నచో ఆరోగ్యము చెడునని యెఱిగియు, దిని, జిగటవిరేచనములు తెచ్చికొంటిని.

ఆ నా డేదియో పండుగ. మధ్యాహ్నమున నే నేమియు దిననని కస్తూరిబాయికి జెప్పితిని కాని యామిడ బలవంతముచేయగా మెత్తబడితిని. క్షీరములును, తజ్జన్య పదార్థములును వర్జించు నియమము నా కున్నదని ఆమె యెఱిగినది కాన నా కొఱకు కానాడు గోదుమతో తీయని జావ చేసి అందు నేతికి మారుగా నూనె కలిపెను. నాకోసమని మినుపకట్టుగూడ మిగిల్చియుంచెను. ఆ పదార్థములపై నా కిష్టము కావున నించుక రుచిచూచినచో గస్తూరిబాయి సంతోషించునని తిన నియ్యకొంటిని. సమయ మెప్పుడొదవునా యని వేచియున్న హతవిధి ప్రేరణచే, జిహ్వాచాపల్యమునకు వశుడనై, కడుపార భుజించితిని. మృత్యువును పేరంటము పిలిచిన ట్లాయెను నాపని. తిని గంటయైన గాకుండగనే జిగటవిరేచనములు తీవ్రరూపమున బ్రత్యక్షమైనవి.

నే నౌషధములు సేవింపను. చేసేత జేసిన దోసమునకు ఫల మనుభవింతు ననుకొంటిని. ఒకనాటిలో ముప్పది, నలువది

పాల్లు లేవవలసివచ్చెను. ఫలరసముగూడ త్రావక శుష్కోప వాసము చేసితిని. ఆకలి చప్పగా నశించెను. మృత్యువు చేరువవైయెనదనుకొంటిని.

మిత్తిరాక కెదురుచూచుచు నే నిట్లు పడియున్న సమయములో శంకరలాల్ బాంకరు నా యారోగ్య రక్షణ భారము వహించి, డాక్టరు దలాలుకు చూపింపుడని పట్టుపట్టెను. డాక్టరును బిలిచికొనివచ్చిరి. కర్తవ్యమును తక్షణమే నిశ్చయించు ఆ డాక్టరుప్రజ్ఞ నన్ను ముగ్ధు నొనర్చెను.

'పాలుపుచ్చుకొనకున్నచో మీరు కోలుకొనరు. దానికి దోడు లోహమును, పాషాణమును ఇంజెక్షన్లు పుచ్చుకొందు రేని మిమ్మెప్పటియట్లు చేసెడిభారము నాది' అనెను డాక్టరు.

నేను 'వలసినచో ఇంజెక్షన్లు మాత్రము మీరిందు. పాలమాట విడిచిపెట్టుడు. పాలు త్రావనని నా వ్రతము' అంటిని.

డాక్టరు 'ఆ వ్రతమెట్టిదో కొంచెము వివరింపు' డని యడిగెను.

ఆ వ్రతము నెందుకు పట్టితినో అనుపూర్వకముగా జెప్పితిని. గో మహిషముల పాలు పిండుటకై గొల్లలుచేయు అకృత్యములు చూచినమీదట నాకు పాలపై రోతపుట్టిన దంటిని: అదీ యట్లుండ పాలు మానవశరీర స్వభావమునకు దగిన యాహారము కాదని యెంచి వర్జించితి నంటిని. నే నిట్లు

చెప్పుచుండ చెంతనేయుండి వినుచున్న కస్తూరిబా 'మేకపాలు మీకు నిషిద్ధము కావుకదా?' యని అందుకొనెను.

డాక్టరంతట 'మేకపాలు త్రాగినను చాలును' అని మాట కలిపెను. నేను 'అల్లే కానిండు' అంటిని. ఎట్లేని బ్రదికి సత్యాగ్రహమును సాగింపవలెనను గాఢాభిలాష వలన ఈ మేకపాల వ్యాజముచే నా వ్రతరక్ష స్వల్ప నియ్యకొంటిని. నిజమునకు నా వ్రత పరమార్థము భంగమై, నిస్సారమగు కట్టె మిగిలినది. ఈ ప్రతిన తాల్చినపుడు గో మహిషముల క్షీరములే నా మనసులో మెదలుచుండినను, సకల జంతుక్షీరములకు ఆ ప్రతిన వ్యాపించితీరును. అది యటు లుండ మానవప్రకృతికి క్షీరము సజాతీయాహారము కాదని నమ్మిన నేను క్షీరమాత్రము నంగీకరింపనే కూడదు. ఇది యెల్ల ఎరిగియుండియు మేకపాల కియ్యకొంటిని. ఇది తలచి కొన్నచో నేటికిని నాకు మనస్తాపము జనించుచుండును. ఈ మేకపాలను వదల్చుకొను ఉపాయ మాలోచించుచునే యుంటిని. కామము లన్నిటిలో అతిసూక్ష్మమగు ఈ లోకా రాధన కామమునకు వశుడనై దాని పట్టునుండి నేటికిని విడి వడ లేకున్నాను.

అదిమొదలు మేకపాలు త్రావ దొడగితిని. డాక్టరు దలాలు నాకు శస్త్రచికిత్స గావించిరి. నేను కోల్కొనుచున్న కొలది, బ్రదుకుపై వాంఛ మరల చివురుదొడిగెను. పరమేశ్వరు డింకను నాచే నేమి చేయింపనుండెనో!

త్రయోదశ భాగము :

రౌలటు శాసనము, రాజకీయములలో ప్రవేశము

51

రౌలటు శాసనము

నే నింకను పూర్తిగా కోలుకొనక పూర్వమే రౌలటు కమిటీ నివేదనము యాదృచ్ఛికముగా నేను వార్తాపత్రికలలో జదివితిని. అప్పుడే ప్రకటితమైన ఆ నివేదనమందలి యంశములు నన్నాశ్చర్యచకితుని గావించెను. దినదినము నన్ను జూడ నేతెంచు వల్లభాయికి నా భయ సందేహములు దెలిపి 'దీని కేదేని ప్రతిక్రియ చేయవలసియుండు' నంటిని. అతడు 'ఇప్పుడు మనము చేయగలిగిన దేమియున్నది?' అనెను. 'దీనిని ప్రతిఘటింప బ్రతిన బూనువారు పదిమంది యున్న జాలును. ఆ ప్రతిఘటనను లక్షింపక సర్కారు ఈ శాసనము స్వీకరించినచో వెంటనే సత్యాగ్రహ మారంభించవలెను. నే నిట్లు జబ్బుపడితిని గాని లేకున్నచో నొంటరినై దీని బ్రతిఘటింతును. నన్ను అనుసరించువా రుండక పోరు. ఈ నీరసస్థితిలో ఇంతటి భారము వహింపలే ననిపించుచున్నది' అంటిని.

రౌలటు బిల్లింకను శాసనరూపమున గెజెటులో ప్రకటితము కాలేదు. నేనట్లు నీరసముగా నుండగనే మదరాసు నుండి పిలుపువచ్చెను. దైవముపై భారమిడి ఆ దూర ప్రయాణము చేసితిని. శ్రీ రాజగోపాలాచారి అంతకుమున్నె సేలము విడిచిపెట్టి మదరాసులో ప్లీడరువృత్తి యారంభించెను. రౌలటు బిల్లును ప్రతిఘటించు టెట్టులని దినదినము నెంత చర్చించినను బహిరంగసభలు చేయుటకంటె నితరోపాయము నా కేమియు గన్పించలేదు.

మే మిట్లు ఆలోచించుచుండగనే రౌలటు బిల్లు శాసనమై ప్రకటితమాయె నని మాకు వార్త వచ్చెను. దానినిగూర్చిన యాలోచనతోనే ఆ రాత్రి నిద్రకు బడితిని. వేగుజామున నించుక పెందలకడనే మెలకువ వచ్చెను. నిదురయు, మెలకువయు గాని ఆ తెరపి మరపు టవస్థలో, స్వప్నమందువలె ఆలోచన తట్టినది. తెలవారిన పిదప రాజగోపాలాచారి కా కథయంతయు జెప్పితిని.

'దేశమంతట హర్తాళ్ జరిపించవలెనని గతరాత్రి నేను కలగంటిని. సత్యాగ్రహ మనునది పాపక్షాళనమువంటిది. మనము చేయబోవునది ధర్మయుద్ధముగావున ముందు ప్రాయశ్చిత్తరూపమగు హర్తాళ్ సలుపుట యుక్తము. ఆ దినమున ప్రజలెల్లరు దమతమ వ్యాపారములు కట్టిపెట్టి, ఉపవసించి, ఈశ్వరప్రార్థన సల్పవలె' నంటిని.

రాజగోపాలాచారి నా యాలోచనము లెస్సగా నున్న దనెను. ఇది విన్న ఇతరస్నేహితులుగూడ ఆమోదించి,

హర్షించిరి. ప్రజల కొక విన్నపమును ప్రకటించి, 30-3-19 హర్తాళ్ చేయుట కేర్పరచితిని. పిమ్మట దానిని 6-4-19 కి మార్చితిమి.

ఆనాడు ఆసేతుహిమాచలము బల్లెలలో, పట్టణములలో బ్రజలందరు హర్తాళ్ జరపుట పరమాశ్చర్యము ఘటించెను.

7 వ తేది రాత్రమున నేను ఢిల్లీకి, అమృతసరమునకు బయలుదేరితిని. రైలు పాల్వాల్ స్టేషనుకు చేరనున్న వేళ పాంచాలపు హద్దులు దాటవలదను నిషేధాజ్ఞ సర్కారు నా కందించిరి. నే నచటి కేగినచో శాంతిభంగ మగుననిరి. నన్ను రైలునుండి యచట దిగుమనిరి. 'నన్ను పాంచాలవాసులు పిలుచుటచే నచట శాంతి నెలకొల్పుట కేగుచుంటినే కాని అశాంతి కలిగించుటకు గాదు. కావున ఈ నిషేధాజ్ఞ ననువర్తింపజాల' నని నిరాకరించితిని.

పాల్వాల్ స్టేషనులో నన్ను దింపి పోలీసుల అధీనమందుంచిరి. ఢిల్లీనుండి వచ్చిన రైలుబండిలో మూడవతరగతి గదిలో న న్నెక్కించి, పోలీసు బలగముకూడ ఎక్కెను. మధుర చేరగానే నన్ను పోలీసు బారకాసులకు (Barracks) గొనిపోయిరి. ఆ పిమ్మట న న్నేమి చేయవలెనో, ఎచటికి గొంపోవలెనో ఆ పోలీసు అధికారులకుగూడ దెలియదు. తెలవారువేళ 4 గంటలకు నన్ను నిద్ర మేల్కొలిపి బొంబాయి కేగు గుడ్సు బండిలో నెక్కించిరి. బొంబాయి చేరగనే నన్ను విడిచిపెట్టిరి.

నన్ను నిర్బంధించిన వార్త బొంబాయిలో అలజడికి గారణమయ్యెను. నేను మోటారు నెక్కి యేగుచుండ పైధునిచెంత మహాజన సమూహము కనుపించెను. నన్ను గనుగొన్నంతనే ప్రజ లానందపరవశులై ఊరేగింపు బయలు దేరదీసిరి. 'వందే మాతరం', 'అల్లాహో అక్బరు' అను ధ్వనులచే మిన్నులు బీటలువారుచుండెను. పైధునిలో అశ్వారూఢమగు పోలీసుదళము గన్పించెను. పైనుండి రాళ్లు వర్షించు చుండెను. ప్రజలను శాంతింపజేయ జూచితినికాని రాళ్ళ దెబ్బలు తప్పించుకొను మార్గము కన్పించలేదు. ఊరేగింపల్లె సాగి అబ్దుల్ రహ్మాన్ వీధి దాటి, క్రాఫర్డు మార్కెటు త్రోవ పట్టెను. అచట ఆశ్వికదళము త్రోవ నరికట్టి ఫోర్టుదెసకు ప్రజలను పోనీయకుండ వారించెను. అతివేలముగా గ్రిక్కిరిసి యున్న జనసమూహము పోలీసుల అడ్డుకట్టను మీరి పోదొడగెను. ఆ జన కోలాహలములో నామాట వినిపించుకొను వారెవరు? అంతట పోలీసు అధికారి మూకలను చెదరగొట్టు డని భటుల కాజ్ఞ యొసగెను. అశ్వారూఢులగు రాజభటు లపుడు భల్లములు సారించుచు ప్రజలపై కళ్ళెములు నడిపించిరి. నేనుగూడ గాయపడుదునని క్షణమాత్ర మనుకొంటిని కాని బల్లెములు మా మోటారును మాత్ర మొరసికొనుచు వెడలి పోయెను. అనతికాలముననే ప్రజాసమూహము విచ్చి పోయెను. ఎచటివా రచట త్రోవగానక చెదరి పరుగిడ జొచ్చిరి. కొందరు అశ్వపదాహతులచే నలిగులి యైరి. కొందరు నజ్జునజ్జయిన దేహములతో బయట బడిరి. ఇసుక వైచిన రాలని ఆ జనసమ్మర్దములో గుఱ్ఱములు నడచుటకు

సందుగాని, ప్రజలు చెదరి పోవుటకు తెరపిగాని లేదు. ఆశ్వికులు కనులుమూసికొని మూకలపైకి తురగముల నడిపించుచుండ, వారది తెలిసి చేయుచున్నపని యనుకొనుట కష్టమైపోయెను. అంతయు బీభత్సముగా నుండెను. ఒడలు తెలియని ఆ చిందులలో, శివాలలో ఆశ్వికులు ప్రజలు నొండొండ బెరసికొని పోయిరి.

ప్రజ లిట్లు చెదరిపోయిన పిమ్మట మా మోటారుబండికి దారి యిచ్చిరి. నేను మాబండిని పోలీసు కమీషనరు కార్యాలయముకడ ఆపి, పోలీసుచర్యనుగూర్చి కమీషనరు కాక్షేపము దెలుపుటకై దిగితిని.

అహమదాబాదులోగూడ అల్లరులు జరిగెనని వార్త యేతెంచెను. నేనంతట నచటికి బయనమై పోయితిని. నాడియాడ్ స్టేషనుకడ ప్రజలు పట్టాలు తొలగింప జూచిరనియు. వీరాంగాములో ప్రభుత్వోద్యోగి ప్రాణముల గొనిరనియు, అహమదాబాదులో సైనికశాసనము చెల్లుచుండెననియు దెలిసెను. ప్రజలు భయభ్రాంతులై పోయిరి. తాము చేసిన అత్యాచారములకు వడ్డితో ఫల మనుభవింపవలసినవారై ముచ్చముణిగి యుండిరి.

నన్ను పోలీసుకమీషనరు చెంతకు గొనిపోవుట కొక యధికారి రైలుస్టేసనులో వేచియుండెను. కమీషనరు ఆగ్రహోదగ్రుడై మండిపోవుచుండెను. నేను చల్లగా శాంతివాక్యములు బలుకుచు, ఈ దుండగములు జరిగినందుకు నేను చెందు మనస్తాపము బ్రకటించితిని. సైనికశాసనముతో బని

లేదని మనవిచేసితిని. శాంతి నెలకొల్పుటకై చేయగలవట్టు సాయ మొనర్తునంటిని. సబర్మతీ ఆశ్రమప్రదేశమున బహిరంగ సభ సల్పుట కనుజ్ఞ గోరితిని. నా కోరిక ఆయన మనసునకు నచ్చెను. ఏప్రిలు 13 వ తేది ఆదివారమునాడు కాబోలు సభ జరగెను. ఆనాడో మరునాడో సైనికశాసన ముపసంహృత మయ్యెను. ప్రజ లొనర్చిన దుండగపు బనులు వారి మనస్సుల కెక్కునట్లు సభలో బ్రసంగించితిని. ఆ దుండ గములకు బ్రాయశ్చిత్తముగా నేను మూణ్ణా ళ్ళుపవసింతునని ప్రకటించితిని. ప్రజలందరి నొకదిన ముపవసింపగోరితిని. ఘాతుకగార్యములు సల్పినవారు తమ దోషములను ప్రకట ముగా నంగీకరించుట యుక్తమని సూచించితిని.

నాకు గర్తవ్యము కనులగట్టినట్లు కన్పించెను. ఇచటి మిల్లుపనివాండ్ర క్షేమముగోరి, వారితో కలసిమెలసి చాలదినము లుండి వారిని సేవించుకొంటిని. అట్టి మిల్లుపనివాండ్రు యుక్తా యుక్త వివేకము గోల్పోయి రన్నచో ఆ పాపకార్యమున నాకును భాగమున్నట్లే.

శాంతవర్తనమున బ్రజలు సుశిక్షితులగు పర్యంతము సత్యాగ్రహము నుపసంహరించుట యుక్తమని నిశ్చయించు కొంటిని.

చతుర్దశ భాగము : ఖాదీపుట్టుక

52

ఖాదీ పుట్టుక

సబర్మతిలో సత్యాగ్రహాశ్రమము నెలకొల్పినపుడే కొన్ని చేమగ్గములగూడ నచట నేర్పాటుచేసితిమి.

ఆశ్రమవాసులందరము స్వయముగా నేసికొన్న వస్త్రములనే ధరించవలయునను నేమము గలదు కావున మేము మిల్లునేత గుడ్డలను ధరించుట మాని, మిల్లునూలుతో నేసికొన్న బట్టలనే వాడుచుంటిమి. మా మిత్రులనుగూడ నట్లు చేయుడని ప్రోత్సహించుచుంటిమి కాన మనదేశపు నూలుమిల్లులకు మేము జీతబత్తెములు లేని ఏజెంట్లమైతిమి. ఈ విధముగా మాకు నూలు మిల్లులతో చుట్టరిక మేర్పడెను. మిల్లునూలు నంతటిని మిల్లులోనే నేయుట మిల్లుదారుల యభిలాషయనియు, చేనేతవారిచే తాత్కాలికముగా విధిలేక నేయించుచేకాని వారి యిష్టపూర్వకమది కాదనియు మేము గ్రహించితిమి. దీనిచే, నూలుగూడ మనమే వడకికొనవలయునని మాకు తొందరపుట్టెను. అట్లు వడకికొనకున్నచో మనకీ మిల్లుల చెర తప్పదని స్పష్టపడెను. మిల్లునూలు

వాడుకను ప్రోత్సహించుటచే దేశమునకు గలుగు మే లేమియు నుండదనియు మే మనుకొంటిమి.

మా కెందును నూలురాట్నము గాని, వడకుటను నేర్పు వారు గాని కన్పింపరైరి.

ఆశ్రమమునకు వచ్చిపోయెడివారిలో, ఈ వృత్తిని గూర్చి యెరిగియుందు రనుకొనినవారినెల్ల అడిగి చూచితిమి.

1917 లో విద్యావిషయికమగు సభ యొకటి బ్రోచిలో జరగెను. గుజరాతి మిత్రుల కోరికపై నే నా సభ కధ్యక్షత వహించితిని. శ్రీమతి గంగాబాయి మజుందారనే దొడ్డ యిల్లాలు నా కచట నగపడెను. చరఖానుగూర్చిన నా నొద యామెతో వెళ్ళబోసికొంటిని. అప్పు డామె చరఖా యెచట నున్నను సాధించి పట్టుకొందునని మాటయిచ్చెను.

ఆయమ గుజరాతంతట గాలించి గాలించి, తుదకు బరోడాసంస్థానమున విజాపురమున చరఖాను పట్టుకొనెను. చాలమంది యిండ్లలో నచట నీ రాట్నము లుండెనుగాని వాని నెన్నడో అటకలపై బారవైచిరి. తమ కెప్పటి కప్పుడు ఏకు లిచ్చువారును, వడికిన నూలు కొనువారు నున్నచో మరల వడుకుదుమని ఆ యూరివా రనిరి. గంగాబాయి ఈ శుభ వార్త నా కెరిగించెను. ఏకులు చేయించి యిచ్చుట కష్టముగా గన్పించెను. నే నీ మాట కీర్తిశేషులగు ఉమార్ సొబానితో నంటిని. ఆయన వెంటనే వలసినన్ని యేకులు తనమిల్లునుండి పంపింతునని చెప్పి మా కష్ట మీడేర్చెను.

పోయిన పొడవున ఆయనవలననే ఏకులు సంపాదించుట నాకు రుచించలేదు. అదియునుగాక మిల్లులో చేసిన యేకులు వాడుట దోష మనిపించెను. మిల్లుల యేకులు పనికివచ్చుచో మిల్లునూలు మాత్ర మేల పనికిరాదు? మన పూర్వులకు ఏకుల నీ మిల్లులే ఇచ్చినవా? మరి వారి కేకు లెట్లులభించినవి? ఈ యాలోచనలతో మరల గంగాబాయినే అడిగితిని: 'ఏకులు చేయువారు దొరకరా' యని. 'ఏల దొరక' రని చెప్పి, దూది ఏకువాని నొకని దీసికొనివచ్చెను. నెలకు 35 రూపికలో, అంత కెక్కుడో ఆత డడిగెను. నే నపు డెంతసొమ్మైనియు నిచ్చుటకు సిద్ధముగా నుంటిని. ఏకిన దూది నేకులు చేయుట నామెయే కొందరు బాలురకు నేర్పెను. మా యాశ్రమమున రాట్నచక్ర మిట్లు శీఘ్రముగా ప్రతిష్ఠితమాయెను.

53

ఆశ్వాసాంతము

ఈ యాశ్వాసముల కిక అంతము చెప్పుటయే మిగిలినది.

ఇది మొదలు నా జీవితము ఎల్లరు నెరిగినదేకాన నేను క్రొత్తగా చెప్పదగిన దించుకయు గన్పించదు.

నా కలముగూడ నిది యెరిగియేకాబోలు ముందుకు సాగలేదు.

G.S. Raju.

పఠితలయొద్ద నింతట సెలవు పుచ్చుకొనుట నాకును కష్టముగానే యున్నది. నా యీ సత్యశోధనమునకు నేను వెలగట్టలేను. దానికి యథార్థ గౌరవము చేసితినో, లేదో యెరుగను. ఉన్నదున్నట్లు చెప్పుటలో నేను శక్తివంచనము మాత్రము చేయలేదు. నాకు సాక్షాత్కరించిన సత్యమును చిత్రించుటకే అవిరతముగ శ్రమపడితిని. సత్యాహింసల ప్రభావమునుగూర్చి సంశయించువారియెడల కిది విశ్వాసము గూర్చునన్న వెఱ్ఱియాసచే నా పడిన యీ శ్రమ నాకు చిత్తశాంతి యొసగుచున్నది.

ఓం శాంతిః

Presented by
G.S. Raju
P.U.C. II B.
22.2.73.

R.B.A.N.M's High School (Mala)
LIBRARY

ACC. No. 7095
CLASS No. B-94 (VEN) N68
Date 26/8/97

R.G.A.N.M's High School (Main)
LIBRARY

SATYA SODHANA

Gandhiji's Autobiography

Translated by

KATURI VENKATESWARA RAO

22-3-73.

TRIVENI PUBLISHERS
MADRAS 1 & MACHILIPATNAM 1

Rs. 2